# ప్రభాత్

## ఈ సంచికలో....


| | |
|---|---|
| ❖ ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రావతరణతో ప్రజలకేమీ ఒరిగింది లేదు ... | 6 |
| ❖ ప్రైవేటీకరణ పట్టాలపై పరుగెడుతున్న ఛత్తీస్‌గఢ్ ... | 9 |
| ❖ బస్తర్ ఛత్తీస్‌గఢ్‌లో భాగం కాదు ... | 13 |
| ❖ ప్రజాపోరాటాలపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ నిర్బంధకాండ ... | 15 |
| ❖ మీ ఎన్నికల విజయానికి మహిళలు సాధనం కారు ... | 18 |
| ❖ అమరులకు శ్రద్ధాంజలి ... | 21 |
| ❖ తెలంగాణా ప్రజలారా! మీరొంటరిగా లేరు! ... | 24 |



భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార త్రైమాసిక పత్రిక

☆ ఎన్నికల బహిష్కరణ ప్రత్యేక సంచిక ☆

సంపుటి - 16　　సంచిక - 3　　జూలై - సెప్టెంబర్ 2003　　వెల - 10 రూపాయలు


# ఛత్తీస్‌గఢ్ విధానసభకు జరిగే బూటకపు ఎన్నికలను బహిష్కరించండి !

## ప్రజా రాజ్యాధికార స్థాపనే ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయం

## విముక్తి ప్రాంత లక్ష్యంతో పురోగమిస్తున్న దండకారణ్య విప్లవోద్యమంతో మమేకంకండి!

ప్రియమైన దండకారణ్య ప్రజలారా,

రానున్న నవంబర్‌లో దేశంలోని ఐదు రాష్ట్రాలలో విధానసభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు రాష్ట్రాలలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరం, ఢిల్లీలతో పాటు ఛత్తీస్‌గఢ్ కూడా ఉంది. ప్రస్తుతం ఈ ఐదింటిలోనూ కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంది. ఈ సంవత్సరం చివరికల్లా ఈ రాష్ట్రాల విధానసభలకు ఐదేళ్లు పూర్తి కావస్తున్నందున మరో ఐదేళ్లు పాలించడానికి పోటీ పడుతున్న వివిధ రాజకీయ పార్టీలు మరోసారి ప్రజల ముందుకు వస్తున్నాయి. ఎన్నికల ద్వారా అధికారంలోని పార్టీలు మారడమే జరుగుతున్నది తప్ప ప్రజలకేమీ ఒరగడం లేదు. గత 55 ఏళ్ల 'స్వతంత్ర' పాలనే ఇందుకు సాక్ష్యం. అందుకే ఈ ఎన్నికలను బహిష్కరించాలని మేం ప్రజలను కోరుతున్నాం.

మధ్యప్రదేశ్ రాష్ట్రం రెండుగా విడిపోయి, ఛత్తీస్‌గఢ్ నవంబర్ 1, 2000 నాడు దేశంలో 26వ రాష్ట్రంగా అవతరించింది. 90 మంది సభ్యులతో ఈ రాష్ట్ర తొలి విధానసభ ఏర్పడింది. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో దాదాపు మూడో వంతు ప్రజలు ఆదివాసులు. అట్లాగే విధానసభలో కూడా 34 మంది ఆదివాసీ సభ్యులున్నారు. మొత్తం విధానసభ సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది అధికార కాంగ్రెస్ పార్టీ వాళ్లు కాగా మిగతా వాళ్లు బిజెపి సభ్యులు. విధానసభ ఏర్పడిన కొద్ది కాలానికే 13 మంది బిజెపి ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. కొత్త రాష్ట్రంలో తొలిసారిగా జరగనున్న ఈ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులూ ఆకట్టుకునే నినాదాలతో, ఊకదంపుడు ఉపన్యాసాలతో, నీటిమూటల్లాంటి వాగ్దానాలతో మీ ముందుకు వస్తున్నారు. ఎవరికి వారే అధికారం చేజిక్కించుకోవాలని పోటీ పడుతున్నారు. మీ గ్రామాలలోకి వచ్చే ఈ దొంగనాయకులను ప్రజలకు ఒరగబెట్టిందేమిటో చెప్పమని నిలదీయండి. కొత్తగా రాష్ట్రం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా సమస్యలేవీ తీర్చకుండానే 'అభివృద్ధి' జపం చేసే మోసగాళ్లను మీ గ్రామాలలో అడుగు పెట్టనివ్వకండి.

ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటయితే తమ చిరకాల, దైనందిన సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ప్రజలు సహజంగానే ఆశించారు. కానీ వారి ఆశలన్నీ అడియాసలైనాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో రాష్ట్రం అభివృద్ధిపథంలో పురోగమిస్తుందనీ, నిరుద్యోగ సమస్య సమసిపోతుందనీ, ప్రజలకు కరువు కారణంగా పొట్ట చేతబట్టుకొని వలస పోయే దుస్థితి లేకుండా పోతుందనీ, ఇక్కడున్న విలువైన ప్రకృతి వనరులను వినియోగించుకొని రాష్ట్రం పారిశ్రామికంగా ముందంజ వేయగల్గుతుందనీ పాలకులు ఎన్నెన్నో కల్లబొల్లి మాటలు చెప్పారు. కానీ ఈ మూడేళ్లలో వీటిలో ఏ ఒక్కటీ జరగలేదు. ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు. ప్రజల ఆకాంక్షలన్నీ వమ్ము కాగా రాజకీయ నాయకులు మాత్రం లబ్ధి పొందారు.

కొత్త రాష్ట్రం ఏర్పాటైన తర్వాత మధ్యప్రదేశ్ విధానసభ రెండుగా విడిపోయి ఛత్తీస్‌గఢ్ విధానసభ ఉనికిలోకి వచ్చింది. కొత్త రాష్ట్రం మూలంగా చాలా మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రి పదవులనూ, మంత్రి హోదా గల ఇతర పదవులనూ పొందగలిగారు. వీళ్లంతా విలాసవంతంగా జీవిస్తూ అపార వనరుల్ని కలిగిన ఈ రాష్ట్రాన్ని దళారీ పెట్టుబడిదార్లకూ, బహుళజాతి కంపెనీలకూ లాభాల్ని దోచిపెట్టే ఆకర్షణీయమైన కేంద్రంగా దిగజారుస్తున్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలారు. దళారీ బూర్జువాలకూ, సామ్రాజ్యవాదులకూ సేవలు చేయడంలో నిండా మునిగి ఉన్న ఈ దోపిడీవర్గ పార్టీల నాయకులందరూ మళ్లీ

తమనే ఎన్నుకోవాలని ఇప్పుడు ప్రజల ముందుకు వస్తున్నారు. ప్రజల సమస్యల్ని పట్టించుకోని ఈ నాయకులకు మనం ఓట్లెందుకెయ్యాలి? ఓట్లతో సమస్యలేవీ పరిష్కారం కావు. ప్రజా వ్యతిరేక వ్యవస్థను ధ్వంసం చేయకుండా మన బతుకులో మార్పు రాదు. అందుకే ఈ బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని మేం కోరుతున్నాం.

## ఎన్నికలతో దరిద్రం పోదు - సమస్యలు తీరవు

పార్లమెంటరీ వ్యవస్థలో భాగమైన గ్రామ పంచాయితీ నుండి లోక్‌సభ వరకూ, పాలనా సంస్థలన్నింటికీ ప్రతి ఐదేళ్లకొకసారి ఎన్నికలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికల్లో గెలిచేవాళ్లంతా భారత రాజ్యాంగం ప్రకారం తమ విధుల్ని నిర్వహిస్తామని ప్రమాణం చేస్తుంటారు. నిజానికి భారత రాజ్యాంగమే బూటకమైంది, ప్రజా వ్యతిరేకమైంది. జనవరి 26, 1950 నుండి అమలులోకి వచ్చిన ఈ రాజ్యాంగాన్ని ఇప్పటికే ఓ వందసార్లు సవరించారు. ఇప్పుడు రాజ్యాంగాన్ని సమీక్షించాలనే ప్రతిపాదనలు కూడా చేస్తున్నారు. ఎన్నిసార్లు సవరణలూ, సమీక్షలూ చేసినా దాని అసలు స్వభావం మాత్రం మారదు. ఎందుకంటే విధానసభలకూ, లోక్‌సభకూ 'ఎన్నికైన' ప్రతినిధులే చట్టాలు చేస్తున్నారు; రాజ్యాంగ సవరణలు చేస్తున్నారు; సమీక్షిస్తాం అంటున్నారు. వీళ్లంతా దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గ ప్రతినిధులే కాబట్టి దీన్ని ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా సవరిస్తారని ఎవరూ ఊహించలేరు. బ్రిటిష్‌వాడి రాజ్యాంగం మూసలో తయారైన భారత రాజ్యాంగాన్ని సవరణలతో, సమీక్షలతో మౌలికంగా మార్చడం సాధ్యం కాదు. ఈ రాజ్యాంగం దోపిడీ వర్గాల ప్రయోజనాల కోసమే తయారైంది. చట్టసభలకు ఎన్నికయ్యామని చెప్పుకుంటున్న నాయకులు ప్రజలను మోసం చేయడానికి ఇది నిజమైన ప్రజాస్వామ్య పాలన అంటూ బుకాయిస్తున్నారు. వీరి నిజస్వరూపాన్ని అర్థం చేసుకొని ఎన్నికల బూటకత్వాన్నీ, ప్రజాస్వామ్యం పేరుతో సాగుతున్న ప్రజావ్యతిరేక దుర్మార్గ పాలనను ఎండగట్టాలి. రాజ్యాంగ సవరణలతో మన బతుకు మారదు. ఈ రాజ్యాంగాన్నే సమూలంగా ధ్వంసం చేసి ప్రజా రాజ్యాంగాన్ని సృష్టించుకుందాం. ఎన్నికల ద్వారా ఇది సాధ్యమయ్యేది కాదు.

దండకారణ్యాం అనుభవాన్ని పరిశీలిస్తే ఎన్నికలలో నిలబడేదీ, గెలిచేదీ ఏ వర్గాల వాళ్లో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. కుట్రు రాజకుటుంబానికి చెందిన శిశుపాల్ షా, ప్రతిభా షాలు; గడ్చిరోలిలో అహిరి రాజ కుటుంబానికి చెందిన విశ్వేశ్వరరావు, సత్యవన్ మహారాజు, ధర్మారావు బాబాలు; ప్రజావ్యతిరేక, భూస్వామ్య, మాంజీ కుటుంబాలకు చెందిన మహేంద్ర కర్మ, బలిరాం కశ్యప్, మన్కురాం సోడి, అరవింద్ నైతాం తదితరులు; గడ్చిరోలిలో ఉయికే, బస్తర్‌లో కోవాసి, వడెట్టివార్, పవార్, విక్రం ఊసెండి, సోహన్ పొట్టావి లాంటి తెగ పెత్తందార్లు; నరేష్ పుగలియా, శాంతారాం పొద్దూకే వంటి వ్యాపార వర్గాల వాళ్లు - వీళ్లే విధానసభలకూ, లోక్‌సభకూ ఎన్నికవుతున్నారు. వీరి తండ్రులూ, తాతలూ ఒకప్పుడు బ్రిటిష్ పాలకులతో అంటకాగిన వాళ్లేనన్న విషయం మనందరికీ స్పష్టంగా తెలుసు. వీళ్లకు ఓట్లేసి గెలిపిస్తే వీళ్లు దోపిడీ వర్గాలకే ఊడిగం చేస్తున్న విషయం మనం అనుభవంలో చూస్తున్నదే. కాబట్టి వీళ్లను గానీ, వీళ్ల ప్రతినిధులను గానీ మనం మన ఊళ్లలోకి రానివ్వవద్దు. వీళ్ల కల్లబొల్లి మాటలతో మోసపోయి ఓట్లెయ్యవద్దు.

## ఓట్ల పార్టీలన్నీ ఒకే గూటి పక్షులే!

మన దేశంలో లెక్కలేనన్ని ఓట్ల పార్టీలున్నాయి. ఇవన్నీ ప్రస్తుత పార్లమెంటరీ వ్యవస్థ ద్వారానే ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని చెబుతాయి. పార్లమెంటు వ్యవస్థ ఎంత బూటకమైందో, ఎన్నికవుతున్న ప్రతినిధుల వర్గస్వభావం ఏమిటో మనం పైన్నే చూశాం. అలాగే ఛత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల బరిలోకి దిగుతున్న రాజకీయ పార్టీల చరిత్రనూ, వాటి వైఖరులనూ సంక్షిప్తంగా అర్థం చేసుకోవడం కూడా అవసరం.

రాష్ట్రంలో ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ, బిజెపి, జాతీయవాద కాంగ్రెస్ పార్టీ, రివిజనిస్టులైన సిపిఐ-సిపిఎంలు అధికారం కోసం పోటీ పడుతున్నాయి. ఇంకా కొన్ని చిన్న చిన్న పార్టీలూ, కొందరు 'స్వతంత్ర' అభ్యర్థులూ కూడా పోటీలో ఉన్నారు. వీళ్లంతా తమ తమ జెండాలతో, వాగ్దానాలతో, మాయమాటలతో మన ముందుకు వస్తున్నారు. వీళ్లందరూ పరస్పరం తీవ్ర దూషణలకూ, ఆరోపణలకూ, విమర్శలకూ పాల్పడుతూ ఎవరికి వారే ఎదుటి వాణ్ని పక్కకు నెట్టేసి అధికారం చేజిక్కించుకోవాలని ఎగబడుతున్నారు. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే తంతే ఇది.

ఈ వ్యవస్థలో ఒకసారి ఎన్నికల్లో గెలిపించిన తర్వాత వారు ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేసినప్పటికీ వెనక్కి పిలిపించే హక్కు ఓట్లేసిన ప్రజలకు ఉండదు. ఇది బూటకపు ప్రజాస్వామ్యమనడానికి ఇంతకన్నా వేరే ఉదాహరణ అక్కర లేదు. అందుకే ఎన్నికలలో గెలిచిన ప్రతి వాడూ అవినీతి కుంభకోణాలకు పాల్పడడం, లంచగొండితనం, ప్రజలపై జులుం, దౌర్జన్యాలకు దిగడం, హత్యలు, లూటీలు, మాఫియా ముఠాలను నడపడం వంటివెన్నెన్నో చేస్తున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే అరాచకత్వం రాజ్యమేలుతున్నది. ఉదాహరణకు ప్రస్తుత 13వ లోక్‌సభలో ఉన్న 542 సభ్యులలో 348 మందిపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. వీరిలో 171 మందిపై హత్య, దొంగతనాలు, మహిళలపై అత్యాచారాలు వంటి తీవ్రమైన ఆరోపణలు కూడా ఉన్నాయి. 71 మందిని వాళ్ల దుర్మార్గ చరిత్ర కారణంగా ఎలాంటి బ్యాంకు అప్పులకూ అనర్హులని ప్రభుత్వమే ప్రకటింటించాల్సి రావడం వీళ్ల స్వభావాన్ని



ప్రత్యేక ప్రజాస్వామిక బస్తర్ కోసం
ఫిబ్రవరి 2001లో నారాయణపూర్‌లో ప్రజా ప్రదర్శన

అర్థం చేసుకోవడానికి ఇదో మచ్చుతునక మాత్రమే. అసలు తమ నేరాల్నే రికార్డులోకి ఎక్కనివ్వని ఘరానా నేరగాళ్లు మరెందరో ఉంటారని మనకు తెల్సిందే. వీళ్లే ప్రజా ప్రతినిధులుగా, ప్రజాస్వామ్య పరిరక్షకులుగా చెలామణీ అవుతుండడం మన దేశానికే తలవంపు. నిజానికి నిజాయితీ, చిత్తశుద్ధీ కల్గిన వాళ్లెవ్వరూ ఈ ఎన్నికల్లో పోటీకి నిలబడలేరు. ఒకవేళ నిలబడ్డా గెలవలేరు. గెలిచినా అంతిమంగా వారూ దోపిడీ వర్గాలకే ఉపయోగపడతారనీ చరిత్రలో ఇప్పటికే రుజువయ్యింది. మనం ఓట్లెయ్యడం అంటే ఇలాంటి నేరాలకూ, ఘోరాలకూ పాల్పడేవాళ్లకే తిరిగి పదవుల్ని కట్టబెట్టడం అవుతుంది - వాళ్లు వాటిని మరో ఐదేళ్ల పాటు కొనసాగించేందుకు మనం ఆమోదం తెలిపినట్టవుతుంది. కాబట్టి ఈ ఎన్నికలను బహిష్కరించి మొత్తం వ్యవస్థను సమూలంగా మార్చే పోరాటంలో భాగస్వాములు కావల్సిందిగా మేం కోరుతున్నాం.

ఈ మూడేళ్ల ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ పాలనలో ఇలాంటి నేరాలూ, ఘోరాలూ ఎన్నో జరిగాయి. ముఖ్యమంత్రిగా అజిత్‌జోగి నియామకం జరిగాక ఎన్నో అవినీతి కుంభకోణాలు వెలుగు చూశాయి. 'హంస్‌దేవ్ బాంగో' నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణంలో స్వయంగా అజిత్‌జోగియే 100 కోట్లు దిగమింగాడని పత్రికలు వివరాలతో సహా ప్రకటించాయి. ఇతడిపై గతంలో నమోదైన కోడార్ ప్రాజెక్టు అవినీతి కేసు ఇప్పటికీ నడుస్తోంది. తన ప్రత్యర్థులను హతమార్చడంలో, దాడులు చేయించడంలో జోగిది అందెవేసిన చేయి అని అతని మూడేళ్ల పాలనలో నమోదైన కేసులే తెలియజెపుతున్నాయి. తాజాగా జాతీయవాద కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగ్గీని హత్య చేయించడం, గతంలో నందకుమార్ సాయి కాళ్లు విరగ్గొట్టించిన కేసు, ఛగన్ ముందాడా, ప్రహ్లాద్ పటేల్, శివరాజ్ పటేల్, వి.సి. శుక్లాలపై దాడులు చేయించిన 'ఘనత' జోగిది. డబ్బూ, అధికారం, పలుకుబడీ దండిగా ఉన్న నాయకులకే ఈ గతి పట్టిందంటే కార్మికులూ, రైతులూ, విద్యార్థులూ, ఉద్యోగులూ, మహిళలూ, దళితులూ, ఆదివాసులూ వంటి సామాన్యుల పరిస్థితేమిటో తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఒక్క జోగీయే కాదు, మొత్తం అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులందరిదీ దాదాపు ఇదే చరిత్ర. నగర్నార్ ప్రజలపై అమలు చేసిన నిర్బంధం ఇందుకు ఒక సాక్ష్యంగా చరిత్రలో నిల్చిపోతుంది.

ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ అధికార కాంగ్రెస్ పార్టీకీ, ప్రధాన ప్రతిపక్షమైన బీజేపీకీ మధ్య ఉంటుందన్నది స్పష్టమే. గత పదేళ్లుగా ఇక్కడ అధికారానికి దూరంగా ఉన్న బీజేపీ ఎట్లాగైనా ఈ సారి గద్దెనెక్కాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. గత కొద్ది సంవత్సరాలుగా నెగెటివ్ ఓటు (anti-establishment vote)తో ప్రతిపక్షాలు అధికారంలోకి రావడం దేశంలో ఒక ప్రధాన ధోరణిగా మారింది. పాలకపక్షం తన పాలనలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతుండడంతో ప్రజల్లో సహజంగానే దాని పట్ల వ్యతిరేకత పెరుగుతోంది. ఈ వ్యతిరేకతను ఆసరా చేసుకొని ప్రతిపక్షాలు గెలవగల్గుతున్నాయి. ఒక బలమైన ప్రజా ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల ప్రతిపక్షాలు చాలా సార్లు సఫలం కాగల్గుతున్నాయి. ఇప్పుడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అన్ని రాష్ట్రాల్లోనూ అధికారం చేజిక్కించుకోవడానికి విపరీతమైన అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నది. అట్లాగే వచ్చే ఏడు లోక్‌సభకు జరుగబోయే ఎన్నికలకు ముందుగా ఇప్పుడు ఐదు రాష్ట్రాలలో జరిగే ఎన్నికలను భవిష్యత్ విజయానికి సూచికగా బీజేపీ, కాంగ్రెస్‌లు రెండూ భావిస్తున్నాయి.

ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా అధికధరలు, అవినీతి కుంభకోణాలు, ప్రభుత్వరంగ పరిశ్రమలనూ, ఇతర సంస్థలనూ బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టడం, కార్మికులను పనిలోంచి తీసెయ్యడం, రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలు మొదలైనవి నిత్యం వెలుగు చూస్తూనే ఉన్నాయి. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. అయితే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో హిందూ ఫాసిస్టు శక్తులు బహిరంగంగా మైనారిటీ మతాల ప్రజలను ఊచకోత కోస్తున్నాయి. గుజరాత్‌లో జరిగిన నరమేధం ఇందుకు ఒక ఉదాహరణ. కాంగ్రెస్ పార్టీ ఒకవైపు తాను లౌకికవాదినని చెబుతూనే హిందూ మతోన్మాదానికి సహకరిస్తున్నది, దాన్ని ప్రేరేపిస్తున్నది. అంతే కాదు, కాంగ్రెస్ తనదైన హిందుత్వ విధానాన్ని కూడా అమలు చేస్తున్నది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివాసులను హిందువులుగా మార్చడానికి ప్రభుత్వమే స్వయంగా పూనుకోవడం ఇందుకొక ఉదాహరణ. అట్లాగే జోగీ స్వయంగా రామకథలను నిర్వహించడం కాంగ్రెస్ తరహా హిందుత్వ విధానాలకు మరో తాజా ఉదాహరణ.

కాబట్టి ఈ పార్టీల్లో ఏది గెల్చినా వీళ్లు భూస్వామ్య, దళారీ బూర్జువా వర్గాల ప్రతినిధులుగానే వ్యవహరిస్తారనీ, భూస్వామ్య విధానానికీ, సామ్రాజ్యవాదానికీ విశ్వాసం గల కుక్కలా సేవ చేస్తారనీ వీళ్లు అనుసరిస్తున్న విధానాలను బట్టి స్పష్టంగానే తెలుసుకోవచ్చు. అట్లాగే ప్రజల ఆకాంక్షలను ఎన్నికల్లో సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నించే కొన్ని ఇతర చిన్న చిన్న పార్టీలు కూడా ఉన్నాయి. ఇవి కులం, జాతి లేదా తెగ ప్రాతిపదికన చెలామణి అవుతున్నాయి. ఇవి గెలిచినా ప్రజలకు ఒరగబెడుతున్నదేమీ లేదు. పైగా ఇవి అధికారం కోసం ప్రధాన రాజకీయ పార్టీల పొత్తులకు ఉపయోగపడుతూ తమ పబ్బం గడుపుకుంటున్నాయి. ఇక రివిజనిస్టుల ధోరణి చెప్పనవసరమే లేదు. ప్రజల్లో ఎర్రజండా పట్ల మిగిలిన అభిమానాన్నీ, సానుభూతినీ ఓట్ల రూపంలో సొమ్ము చేసుకోవడానికి ఇవి ఎన్నికల బరిలోకి దిగుతున్నాయి. ఇవి కూడా దివాళాకోరు రాజకీయాలను అనుసరిస్తూ ఇతర బూర్జువా పార్టీలకు తోకలుగానే వ్యవహరిస్తూ రకరకాల పొత్తుల్లో భాగస్వాములవుతున్నాయి. సిపిఐ, సిపిఎం రివిజనిస్టు పార్టీలు రెండూ కూడా బస్తర్ ప్రజల న్యాయమైన 'ప్రత్యేక బస్తర్ రాష్ట్ర' డిమాండ్‌ను వ్యతిరేకిస్తున్నాయి. అట్లాగే నగర్నార్ స్టీలుప్లాంటు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్న ప్రజల పక్షం వహించకుండా ఇవి తమ ప్రజా వ్యతిరేక స్వభావాన్ని స్పష్టంగా బైట పెట్టుకున్నాయి. సిపిఎం తాను అధికారం వెలగబెడుతున్న పశ్చిమబెంగాల్, త్రిపుర వంటి రాష్ట్రాలలో పచ్చి ఫాసిస్టు పాలనను నెలకొల్పి ఉక్కుపాదంతో అక్కడి ప్రజా ఉద్యమాలనూ, విప్లవోద్యమాన్నీ అణచివెయ్యడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇలా రివిజనిస్టు పార్టీలతో సహా పార్లమెంటరీ పార్టీలన్నీ కూడా ప్రజా వ్యతిరేకమైనవిగానే ఉన్నాయన్న విషయం స్పష్టమౌతున్నది. ఆదివాసులకు ప్రాతినిధ్యం వహిస్తున్నానని చెప్పుకునే గోండ్వానా గణతంత్ర పార్టీ కూడా ఈ ఎన్నికలలో పాల్గొంటున్నది. వీళ్లు ఎన్నికలలో పాల్గొని ఆదివాసులను ఉద్ధరిస్తామని చెప్పుకుంటున్నారు. గతంలో ఈ పార్టీ తరఫున గెల్చిన ఎమ్మెల్యేలు కొందరు డబ్బుకు ఆశపడి జోగి చంకలో దూరిపోయారన్న విషయం అందరికీ తెల్సిందే. వీళ్లు పైకి ఏం చెప్పినా ఆచరణలో అవకాశవాదానికి పాల్పడుతూ ప్రజలను పక్కదార్లు పట్టిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో పాల్గొంటున్న మరో చిన్న పార్టీ సిఎంఎం (ఛత్తీస్‌గఢ్ ముక్తి మోర్చా). ఒకప్పుడు కార్మికపోరాటాలు నడిపి ప్రజల్లో, ముఖ్యంగా కార్మికుల్లో



బస్తర్ బస్తర్‌వాసులదే !

పలుకుబడి సంపాదించిన ఈ పార్టీ ఇప్పుడు పూర్తిగా అవకాశవాద పార్టీగా, కార్మిక వ్యతిరేక పార్టీగా పతనమైంది. పైకి తానొక ప్రజాస్వామ్య సంస్థనని చెప్పుకుంటూ, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తున్నట్టు నటిస్తూ మరోవైపు ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలను పూర్తిగా మద్దతునిస్తున్నది. ఉదాహరణకు, దల్లీ-రాజహరాలో గనుల యాజమాన్యం అమలు చేస్తున్న యాంత్రీకరణను వేలాది మంది కార్మికులు వ్యతిరేకిస్తుండగా సిఎంఎం మాత్రం సమర్థిస్తున్నది. కాబట్టి ప్రజాస్వామ్య సంస్థలుగా చలామణి అవుతూ సారాంశంలో ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా నిలిచిన ఈ దివాళాకోరు పార్టీలను ఎండగట్టాలి. బూటకపు ఎన్నికలకు బహిష్కరిస్తూ ప్రజాయుద్ధాన్ని తీవ్రం చేయాలి.

## ఎన్నికలంటే ...
## మోసపు నినాదాలతో ఓట్లు రాబట్టుకోవడమే!

కొత్తగా ఏర్పడిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో, అభివృద్ధే తమ ఏకైక లక్ష్యంగా చెబుతూ ప్రతి రాజకీయ పార్టీ ప్రజలను మోసగిస్తున్నది. ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి కోసం 6,000 కిలోమీటర్ల రోడ్లను వేశానని చెబుతున్నది. కోట్ల కొద్ది డబ్బును ఖర్చు చేస్తూ అభివృద్ధికి రోడ్ల నిర్మాణమే రాచబాట అంటూ ప్రచారం చేస్తున్నది. రావ్‌ఘాట్ వరకు రైల్వేలైన్ వేయడం ద్వారా బస్తర్ అభివృద్ధి జరుగుతుంది అని అంటున్నారు. రాష్ట్రంలో విస్తారంగా ఉన్న ఖనిజ సంపదనూ, అటవీ సంపదనూ, జల వనరులనూ వినియోగించుకొని పారిశ్రామికీకరణ చేస్తామనీ, నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామనీ అంటున్నారు. ఇంకా చాలా రకాలుగా మాట్లాడుతున్నారు. ఈ మాటల్లో వాస్తవం ఏమైనా ఉందా?

రైతుల పంట పొలాలకు నీరందివ్వాలన్న స్పృహ ఏ పార్టీకీ లేదు. పండిన పంటలకు మద్దతు ధర లేక రైతులు తమ ధాన్యాన్ని మధ్య దళారులకు అడ్డికి పావుశేరు లెక్కన అమ్ముకుంటున్నారు. దీనిపై ఏ పార్టీ కూడా మాట్లాడదు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో ప్రజలు ఎలాంటి వైద్య సదుపాయాలకు నోచుకోక మలేరియా, డయేరియా వంటి అంటు రోగాలకు ప్రతి ఏడూ బలవుతూనే ఉన్నారు. దీనికి తాజా ఉదాహరణ, కుంట తాలూకాలోని పువ్వార్ అనే ఒక చిన్న గ్రామంలో గత జూలై నెలలో వారం రోజుల వ్యవధిలోనే 12 మంది కలరా సోకి మృత్యువాత పడ్డారు. ఇలాంటి గ్రామాలు ఏటా ఎన్నో ఉంటున్నాయి. చాలా గ్రామాల్లో స్కూళ్లు లేవు. బస్తర్‌లో ప్రభుత్వం తీసుకున్న మతిమాలిన నిర్ణయంతో ఉన్న స్కూళ్లు కూడా చాలా వరకు మూతపడ్డాయి. టీచర్లు లేరు. ఉన్నవాళ్లకు జీతాలు లేవు. ఈ మౌలిక సమస్యలను ఏ మాత్రం పట్టించుకోని ప్రభుత్వం ముఖ్యంగా కొద్ది కాలంగా అభివృద్ధికి ఏకైక పరిష్కారం టూరిజం అంటూ ప్రచారం చేస్తోంది.

ప్రభుత్వం అధికారికంగా ఇంకా ప్రకటించనప్పటికీ బస్తర్‌ను పర్యాటక రాజధానిగా మార్చివేసింది. ఇక్కడ అనేక పార్కులనూ, వన్యమృగ కేంద్రాలనూ నిర్మించడానికి ప్రయత్నిస్తోంది. ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించాలని చూస్తున్నది. గతంలో వీటి నిర్మాణాలు చేసినప్పుడు ఆ ప్రాంతంలోని అనేక గ్రామాలను ఖాళీ చేయించి ప్రజలను తరిమేసిన విషయం మనకు తెలిసిందే. ఇలా చేస్తూ అనేక స్థలాలను పర్యాటకుల వినోదాలకూ, విలాసాలకూ అనుగుణంగా తీర్చిదిద్దుతోంది. ఖరీదైన హోటళ్లు నిర్మిస్తోంది. బస్తర్ లాంటి ఆదివాసీ ప్రాంతాలలో పర్యాటక రంగం పెంపొందితే దాని వల్ల జరిగే అనర్థాల గురించి ప్రభుత్వానికి పట్టింపే లేదు. ఆదివాసీ యువతులను వేశ్యలుగా దిగజార్చే ఈ పర్యాటక పరిశ్రమను ప్రభుత్వం అభివృద్ధికి మూలమంత్రం అంటోంది. మిగతా పార్లమెంటరీ పార్టీలన్నీ కూడా ప్రభుత్వ విధానాలతో మౌలికంగా ఎక్కడా విభేదించడం లేదు. అన్నింటిదీ ఒకే దారి, ఒకటే గమ్యం. ఆదివాసీ ప్రజల జీవన విధానాన్నీ, సంస్కృతినీ నాశనం చేయడాన్ని అన్ని దోపిడీ పార్టీలూ ఆమోదిస్తున్నాయి. కాబట్టి వీరి మోసకారి మాటలకూ, నినాదాలకూ మనం బలికావద్దు. వీళ్లెవ్వరికీ ఓట్లెయ్యొద్దు.

## ప్రత్యేక బస్తర్ రాష్ట్రం గురించి మాట్లాడని వాళ్లకు ఓట్లడిగే హక్కు లేదు !

ఈరోజు అన్ని రాజకీయ పార్టీల దృష్టి విశాల బస్తర్ పైన్నే ఉంది. దంతెవాడ జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యంగా పాలకులు చెప్పుకుంటున్నారు. బస్తర్ లేకుండా ఛత్తీస్‌గఢ్ లేదని అంటున్నారు. *బస్తర్ బస్తర్‌వాసులదేననే* వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని దోపిడీ పాలకవర్గాలకు బస్తర్ ఛత్తీస్‌గఢ్‌లో కలిసి ఉండడం అవసరం. బస్తర్ అనేక అటవీ సంపదలకూ, ఖనిజ సంపదలకూ, జల వనరులకూ పుట్టినిల్లు. అందుకే అన్ని రాజకీయ పార్టీలు కూడా 'ప్రత్యేక బస్తర్' రాష్ట్రం ప్రతిపాదనను దృఢంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎందుకంటే ప్రత్యేక బస్తర్ రాష్ట్రం ఏర్పాటు వల్ల బస్తర్‌లోని సంపదలను విచ్చలవిడిగా దోచుకోవడంలో అనేక అడ్డంకులు ఏర్పడుతాయి. అయితే అన్ని పార్టీలూ

తమ్ము తాము బస్తర్ శ్రేయోభిలాషులుగా రుజువు పర్చుకోవడానికి రకరకాల ఎత్తులు వేస్తున్నాయి. బస్తర్ ప్రజల ఓట్లను రాబట్టుకోవడం కోసమే బస్తర్ ప్యాకేజీ వంటి సర్కస్ ఫీట్లు చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం 361 కోట్ల రూపాయల బస్తర్ ప్యాకేజీని ప్రకటించగా, రివిజనిస్టు పార్టీలు 1,000 కోట్ల ప్రత్యామ్నాయ ప్యాకేజ్‌ను ప్రకటించి ఓటర్ల దృష్టిని ఆకర్షించే చౌకబారు ప్రయత్నం చేస్తున్నాయి.

బస్తర్‌వాసుల అభీష్టానికి భిన్నంగా, వారి ఆకాంక్షలను కాలరాస్తూ దళారీ పాలకవర్గాలు బస్తర్‌ను బలవంతంగా ఛత్తీస్‌గఢ్‌లో కలుపుకున్నాయి. అందుకే నవంబర్ 1 బస్తర్ ప్రజల చరిత్రలో విద్రోహకర దినంగా నమోదైంది. బస్తర్ ప్రజల ప్రాంతం, భాషా, సంస్కృతీ, ఆర్థిక విధానం అన్నీ కూడా ప్రత్యేకంగా ఉన్నాయి. బస్తర్ ఎన్నడూ ఛత్తీస్‌గఢ్‌లో భాగంగా ఉండలేదు. చరిత్రలో బస్తర్‌వాసులెన్నడూ ఎవరికీ లొంగి జీవించలేదు. అందుకే మనం బస్తర్ బస్తర్‌వాసులదేనని నినదిద్దాం. ప్రత్యేక బస్తర్ రాష్ట్రాన్ని వ్యతిరేకించే పార్టీలన్నీ బస్తర్ ప్రజల ఓట్లడిగే నైతిక అర్హతను కూడా కోల్పోయాయి. కనుక ప్రత్యేక బస్తర్ రాష్ట్రం ఏర్పాటు గురించి మాట్లాడకుండా ఓట్ల కోసం ఎవ్వరూ రావద్దని మనం ప్రకటించాలి. బస్తర్ నేతలమని చెప్పుకుంటూ దళారీ పాలకవర్గాల్లో చేరిపోయి బస్తర్ ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న వారెవ్వరినీ మన పొలిమేరల్లోకి కూడా రానివ్వవద్దు.

## బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థకు అసలైన ప్రత్యామ్నాయం 'జనతన సర్కార్' (విప్లవ ప్రజా సమితి)

మన పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్], అలాగే మన సోదర పార్టీయైన ఎంసిసిఐ నాయకత్వాన పోరాడుతున్న దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలు పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరిస్తున్నారు. మన దండకారణ్యంలో కూడా గత 20 ఏళ్లకు పైగా ప్రజలు పార్లమెంటరీ ఎన్నికల్ని బహిష్కరిస్తున్నారు. ఉత్తర బస్తర్, బస్తర్, దక్షిణ బస్తర్, రాజ్‌నాంద్‌గాం, కవర్ధా, సర్గుజా తదితర జిల్లాల ప్రజలు అనేక సంవత్సరాలుగా దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడుతున్నారు. ఎన్నికలను బహిష్కరిస్తూ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో సాయుధ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. వెనుకబడిన గ్రామీణ ప్రాంతాలను ఆధారంగా చేసుకొని మన ఈ పోరాటం సాగుతోంది. అనేక పట్టణాల్లో కూడా ప్రజలు మన పార్టీ నాయకత్వంలో సంఘటితమవుతున్నారు. దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో మన పార్టీ నాయకత్వంలో మన ప్రజా గెరిల్లా సైన్యం (పిజిఏ) పోరాడుతోంది. గెరిల్లా సైన్యంలో వందలాది యువతీయువకులు చేరుతున్నారు. ప్రజల రాజ్యాధికార సంస్థయైన 'జనతన సర్కార్' (విప్లవ ప్రజా కమిటీ) చాలా గ్రామాల్లో నిర్మాణమవుతున్నది.

సాధారణంగా మన పోరాట ప్రాంతానికి బైట ఉండే ప్రజల్లో, ముఖ్యంగా బుద్ధిజీవులలో ఒక అనుమానం తలెత్తుతోంది – ఎన్నికలను బహిష్కరించి రాజ్యాన్ని లేదా ప్రభుత్వాన్ని ఎలా ఏర్పరుస్తారని. అయితే మన పార్టీ బహిష్కరించాలని చెబుతున్నది ఈ దోపిడీ వర్గాల బూటకపు ఎన్నికలను మాత్రమే. మనం ధ్వంసం చెయ్యాల్సింది ఈ దోపిడీ వ్యవస్థనూ, దాని రాజ్యాంగాన్నీ, దాన్ని రక్షిస్తున్న రాజ్యాంగ యంత్రాన్నీ కూడా. వీటి స్థానంలో ముందుగా గ్రామ స్థాయిలో విప్లవ ప్రజా కమిటీలను (జనతన సర్కార్) ఎన్నుకోవాలని మనం చెబుతున్నాం. గత ఎనిమిదేళ్లుగా దండకారణ్యంలో ఈ ప్రక్రియ కొనసాగుతున్న విషయం మనందరకూ తెల్సిందే. ప్రజల ప్రజాస్వామిక ప్రభుత్వానికి బీజ రూపాలివి. ప్రజాసభల ద్వారా వయోజనులందరూ స్వచ్ఛందంగా ఎన్నుకుంటున్న ప్రజా ప్రభుత్వ యూనిట్లు ఇవి.

దండకారణ్యంలో ఏర్పడుతున్న ప్రత్యామ్నాయ ప్రజా ప్రభుత్వ వ్యవస్థను నిర్మూలించడానికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని అమలు చేస్తున్నాయి. వేలాది మంది పోలీసు బలగాలతో, పారా మిలిటరీ బలగాలతో ఒక యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. విప్లవకారులనూ, ప్రజలనూ ఊచకోత కోస్తున్నాయి. అరెస్టులు, చిత్రహింసలు, జైళ్లు, దండుగలు, అత్యాచారాలు సర్వసాధారణమయ్యాయి. వీటన్నింటినీ భరిస్తూ మనం పోరాడుతూనే ఉన్నాం. బూటకపు ఎన్నికలు జరిగే ప్రతి సారీ ప్రభుత్వం నిర్బంధాన్ని అనేక రెట్లు పెంచి ఎలాగోలా ఓట్లు వేయించుకొని 'ప్రజాస్వామ్యాన్ని' నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నది. ఓట్లు వేయని వాళ్లందరినీ నక్సలైట్లుగా ముద్ర వేసి వేధింపులకు గురి చేస్తున్నది. అయినప్పటికీ మనం పోరాడుతూనే ఉన్నాం. పోలీసు నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూనే ఎన్నికలను బహిష్కరిస్తూ వస్తున్నాం.

ఈ మధ్య కాలంలో (సెప్టెంబర్ 2002 నుండి మార్చ్ 2003 వరకు) వందలాది మంది సర్పంచ్‌లు, పంచ్‌లు, జనపద్ అధ్యక్షులు, సభ్యులు ప్రజాశక్తికి తలొగ్గి రాజీనామాలు చేశారు. ఈ 'ప్రజాస్వామ్యాని'కి పట్టుకొమ్మలని చెప్పే పంచాయితీ రాజ్ వ్యవస్థ ధ్వంసమైందని ఢిల్లీ నుండి జగ్దల్‌పూర్, దంతెవాడల వరకు సర్కార్ ఆగమైంది. మీడియా గగ్గోలు పెట్టాయి. అయితే మరోవైపు ప్రజలు తమ వ్యవహారాలను తామెన్నుకున్న జనతన సర్కార్ నాయకత్వంలో నడుపుకున్నారు. అందుకే మనం పంచాయితీరాజ్ వ్యవస్థ మాకొద్దంటున్నాం. మొత్తం పార్లమెంటరీ వ్యవస్థే మాకక్కరలేదని అంటున్నాం. అందుకే ఈ బూటకపు ఎన్నికలను బహిష్కరించి పోరాటం ద్వారానే ప్రజా రాజ్యాధికారాన్ని సాధించుకుందాం. గ్రామగ్రామాన జనతన సర్కార్ సంస్థలను ఏర్పాటు చేసుకుంటూ వాటిని పటిష్టం చేసుకుందాం. గ్రామ స్థాయి నుండి ఉన్నత స్థాయికి ప్రజా రాజ్యాధికార అంగాలను విస్తృతపర్చుకుంటూ విముక్తి ప్రాంత నిర్మాణానికి బాటలు వేద్దాం. ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడి పోరాడి దోపిడీ రాజ్య వ్యవస్థ స్థానంలో నూతన ప్రజాతంత్ర వ్యవస్థను స్థాపించి మన దేశాన్ని భూస్వామ్య, సామ్రాజ్యవాద బంధనాల నుండి విముక్తి చేద్దాం.

- **ఛత్తీస్‌గఢ్ విధానసభకు జరిగే బూటకపు ఎన్నికలను బహిష్కరించండి!**
- **జనతన సర్కార్ సంస్థలను ఎన్నుకుందాం - వాటిని పటిష్టం చేసుకుంటూ విస్తరింపజేద్దాం!**
- **దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మల్చుకుందాం!**
- **ప్రభుత్వ నిర్బంధాన్ని ఓడిద్దాం - విప్లవ ప్రజా కమిటీలను కాపాడుకుందాం!**

*విప్లవాభివందనలతో...*

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

*సెప్టెంబర్ 2003* భాకపా (మా-లె) [పీపుల్స్‌వార్]

# ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రావతరణతో ప్రజలకేమీ ఒరిగిందీ లేదు!
# వాళ్ల నిజమైన ఆకాంక్షలు తీరిందీ లేదు!

మన ప్రియమైన భారతదేశం అనేక జాతులకు నిలయం. ఈ దేశంలో అనేక సంవత్సరాలుగా పలు జాతులు తమ న్యాయమైన డిమాండ్లపై పోరాడుతున్నాయి. వీటిలో కొన్ని విడిపోయే హక్కుతో సహా తమ స్వయం నిర్ణయాధికారం కోసం సాయుధ పోరాట మార్గాన సమరశీలంగా పోరాడుతున్నాయి. భాషాసమస్య పైనా, ప్రాంతాల మధ్య అసమానాభివృద్ధిని వ్యతిరేకిస్తూ తమ ప్రత్యేక అస్తిత్వాన్ని గుర్తించి అభివృద్ధికి తోడ్పడాలని కోరుతూ తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాడుతున్న ప్రాంతాలూ ఉన్నాయి. నాగా, కాశ్మీరీ మొదలైన జాతుల ప్రజాపోరాటాలు మొదటి కోవకు చెందినవి కాగా, ఝార్ఖండ్, విదర్భ, ఉత్తరాఖండ్, తెలంగాణా, ఛత్తీస్‌గఢ్, బస్తర్ తదితర ప్రాంతాల ప్రజల పోరాటాలు రెండవ రకానికి చెందినవి. వీరంతా ఈ దేశంలోనే తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలనీ, అలాంటి ప్రత్యేక రాష్ట్రంలోనే తమ ప్రాంతం అభివృద్ధికి నోచుకుంటుందనీ బలంగా ఆకాంక్షిస్తూ భారత పాలకవర్గాలతో దృఢంగా పోరాడుతున్నారు. ఈ పోరాటాలన్నీ న్యాయమైనవే. ఈ పోరాటాలన్నీ ప్రజల ఆకాంక్షలను వ్యక్తం చేస్తున్నందున ఇవన్నీ సమర్థనీయమైనవే.

*... తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలని బలంగా కోరుకుంటూ, ఒక రాష్ట్రంగా తాము అభివృద్ధి చెందగలమని దృఢంగా నమ్ముతూ, అందుకు కావలసిన అవకాశాలూ, హంగులూ అన్నీ మాకున్నాయంటూ విశాల బస్తర్ ప్రజానీకం కూడా పోరాటరంగంలో చేరిపోయారు...*

1947లో భారతదేశం ఒక 'స్వతంత్ర' దేశంగా ఉనికిలోకి వచ్చింది. 26 జనవరి 1950 నాడు భారత రాజ్యాంగం ఉనికిలోకి వచ్చింది. ఆ తర్వాత ఆరేళ్లకు అంటే 1956లో మన దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల పేరుతో నూతనంగా 18 రాష్ట్రాలు ఉనికిలోకి వచ్చాయి. జాతుల ప్రాతిపదికపైన రాష్ట్రాలను విభజించకుండా, ఆయా జాతుల ఆకాంక్షలను ఎత్తిపట్టకుండా స్వతంత్ర దేశ చరిత్రలో తొలి అన్యాయం జరిగిపోయింది. తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం ఉండాలని ఆనాటికే పలు విశాల ప్రజా సముదాయాలు బలంగా కోరుకుంటూ పోరాడుతూ వస్తున్న ప్రజల ఆకాంక్షలు కూడా నూతన రాష్ట్రాల అవతరణతో దెబ్బతిన్నాయి. భాషా రాష్ట్రాల పేరుతో చోటుచేసుకున్న రాష్ట్రాల సరిహద్దులు ప్రజల్లో చీలికలకు బీజాలు వేశాయి. ఒకే జాతి ప్రజలు పలు రాష్ట్రాల కింద విడగొట్టబడినారు. మరీ ముఖ్యంగా ఆ సందర్భంగా మన దేశంలోని లక్షలాది ఆదివాసీ ప్రజానీకం వంచించబడ్డారు. ఒక జాతిగా ఆవిర్భవిస్తున్న పలు ఆదివాసీ ప్రజానీకమంతా ఒకే విశాల ప్రాంతం వారైనా, ఒకే భాష మాట్లాడే వారైనా, ఒకే మానసికతతో, ఒకే ఆర్థిక విధానంతో అనేక సారూప్యతల మధ్య జీవిస్తున్న వారైనప్పటికీ నిర్లక్ష్యంగా చీల్చబడి ఆధిపత్య భాషల అణచివేతకు గురయ్యారు. ఇందుకు విశాల గోండ్వానా, ఝార్ఖండ్ ప్రజానీకమే సజీవ ఉదాహరణ. ఆనాడు భగ్నమైన ప్రజల ఆకాంక్షలు నేటికీ రగులుతూనే ఉన్నాయి. ఆ తర్వాత మరిన్ని కొత్త పోరాటాలు ముందుకు వచ్చాయి. బ్రిటిష్‌వాడు దేశాన్ని ఐదు ప్రావిన్స్‌లుగా (ప్రాంతాలుగా/రాష్ట్రాలుగా) విడగొట్టి పాలిస్తే, భారత పాలకవర్గాలు 18 రాష్ట్రాలుగా విభజించాయి. అయినా ఇంకా తమకంటూ ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని బలంగా కోరుకుంటూ పోరాడుతున్న ప్రాంతాలు భారత రాజకీయ చిత్రపటంపై ఏనాటికానాడు పెరుగుతూనే ఉన్నాయి. ఈ పోరాటాల ఫలితంగానే 2000లో ఝార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్‌లు నూతనంగా ప్రత్యేక రాష్ట్రాలుగా ముందుకు వచ్చాయి. నేటికీ ఇంకా తీవ్ర అసమానతలను ఎదుర్కొంటూ ఎలాంటి అభివృద్ధికీ నోచుకోకుండా పోయిన విదర్భ, తెలంగాణా, గోండ్వానా లాంటి ప్రాంతాలు ప్రత్యేక రాష్ట్రం కావాలని నినదిస్తూ పోరాట రంగాన నిలిచే ఉన్నాయి. వీరి సరసన ఇప్పుడు, తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలని బలంగా కోరుకుంటూ, ఒక రాష్ట్రంగా తాము అభివృద్ధి చెందగలమని దృఢంగా నమ్ముతూ, అందుకు కావలసిన అన్ని అవకాశాలూ, హంగులూ మాకున్నాయంటూ విశాల బస్తర్ ప్రజానీకం కూడా పోరాటరంగంలో చేరిపోయారు. ఏనాడో రగుల్కొన్న ఈ పోరాటాల కుంపటి తమ న్యాయమైన డిమాండ్లు సాధించేవరకు ఆరిపోయేది కాదు. ప్రజల నిజమైన ఆకాంక్షలను ఎవరూ శాశ్వతంగా వంచించలేరనడానికి ఈ ప్రాంతాలలో పెంపొందుతున్న ప్రజా పోరాటాలే గొప్ప సాక్ష్యం. ప్రజాస్వామిక, విప్లవ శక్తులన్నీ తమ డిమాండ్ల సాధనకై అచంచలంగా పోరాడుతున్న ప్రజల పక్షం వహించాలి. ఆ ప్రజా పోరాటాలన్నింటినీ నిర్ద్వంద్వంగా బలపరచాలి.




ఉత్తర్ బస్తర్ - డౌలాలో ప్రత్యేక బస్తర్ ర్యాలీ


మూడేండ్ల కింద మధ్యప్రదేశ్ రాష్ట్రాన్ని రెండుగా విడదీసి ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఏర్పర్చారు. నవంబర్ 1, 2000 నాడు నూతన ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రజానీకం గొప్పగా పండుగ జరుపుకున్నారు. మరోవైపు విశాల బస్తర్ ప్రజానీకం మాత్రం తమను బలవంతంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కలపకూడదని నిరసిస్తూ పెద్ద పెద్ద ర్యాలీలూ, ప్రదర్శనలూ జరిపారు. బస్తర్ ప్రజల న్యాయమైన డిమాండ్‌ను మా పార్టీ సమర్థిస్తూనే ఛత్తీస్‌గఢ్ ప్రజల ఆకాంక్షలను ఎత్తిపట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని ఆహ్వానించింది. అయితే నూతన రాష్ట్రం ఏర్పడినంత మాత్రాన ఎలాంటి కఠినమైన

పోరాటాలు లేకుండా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు. ప్రజలు తమ సమస్యలన్నింటిపైనా సమైక్యంగా పోరాడాల్సి ఉంటుందని కూడా మా పార్టీ స్పష్టం చేసింది. ఈ మూడేళ్ల ఛత్తీస్‌గఢ్ పాలన దీన్నే నిరూపించింది. ఈ మూడేళ్ల పాలనలో ఛత్తీస్‌గఢ్ ప్రజల ఏ ఒక్క మౌలిక సమస్యా పరిష్కారం కాలేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం ద్వారా అనేక సమస్యలు సమసితాయనీ, తమ జీవితాల్లో గొప్ప మార్పు వస్తుందనీ ఈ ప్రాంతంలోని ప్రజలు సహజంగానే కలలు కన్నారు. ముఖ్యంగా తమ పిల్లలకు ఉద్యోగాలు దొరుకుతాయనీ, తమ పంట పొలాలకు నీరందుతుందనీ, అపారమైన సహజ వనరులను కలిగి వున్న తమ ప్రాంతం తమ చేతిలో ఉండడం ద్వారా వాటిని వినియోగించుకొని జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవచ్చునీ, అట్లాగే తమ రాష్ట్రంలో పిల్లలకు తమ భాషయైన ఛత్తీస్‌గఢీలో చదువు చెబుతారనీ ఎంతగానో ఆశించారు. ఇంతేగాదు, ఉప్పిడి ఉపవాసాలతో జీవితాలు నెట్టుకరాలేక ప్రతి ఏటా పిల్లాపాపలతో సహా సుదూర ప్రాంతాలకు వలసపోతున్న లక్షలాది నిరుపేద రైతులూ, వ్యవసాయ కూలీలూ తమ బాధ తప్పుతుందనుకున్నారు. కానీ ఇవేవీ జరగలేదు. అయినా, ఇవన్నీ జరుగుతున్నట్టుగా, జరిగితీరుతాయన్నట్టుగా పాలకవర్గాలు ప్రజలకు మాత్రం హామీలు గుమ్మరిస్తున్నాయి. ఇప్పటికీ తమ ప్రభుత్వం అందుకు కట్టుబడి ఉన్నట్టుగానే ముఖ్యమంత్రి అజిత్ జోగి, అతడి మంత్రివర్గ సభ్యులు నిరంతరం ప్రకటిస్తున్నారు. సాధించిన ప్రగతిని గణాంక వివరాలతో సహా అందిస్తూ అన్ని రంగాలలో అత్యంత వెనుకబడిన ఒక రాష్ట్రం సమగ్ర అభివృద్ధిని సాధించాలంటే మూడేళ్ల కాలం సరిపోదనీ, మరెంతో సమయం అవసరమనీ అంటున్నారు. నిజమే, ఒక రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి మూడేళ్ల కాలం సరిపోకపోవచ్చు కానీ, ప్రభుత్వం అందిస్తున్న గణాంక వివరాలు మాత్రం దాని పోకడను స్పష్టంగానే తెలియజేస్తున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న చర్యలూ, పథకాలు అన్నీ ఏ వర్గాల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి? ఇది కీలకమైన ప్రశ్న!

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి కట్టుబడి ఉన్నానంటున్న జోగి ప్రభుత్వం గతంలో ఉన్న 58 ప్రభుత్వ శాఖలను పొదుపు పేరుతో 18కి తగ్గించింది. ఆ పేరుతోనే 30 ప్రభుత్వ కార్పోరేషన్‌లను కూడా రద్దు చేసింది. 60 వేల కోట్ల రూపాయల నూతన పెట్టుబడులతో పరిశ్రమలకు అనుమతినిచ్చాననీ, అనేక కుటీర పరిశ్రమలను పునరుద్ధరించాననీ అది చెప్పుకుంటున్నది. 6 వేల కిలోమీటర్ల నూతన రోడ్లు నిర్మించానని బుకాయిస్తోంది. రాష్ట్రంలో 4 పెద్ద, 7 మధ్యరకం, 37 చిన్న తరహా నీటి ప్రాజెక్టుల పని వేగంగా జరుగుతోందంటున్నది. 'గావ్-గంగ' పథకం ద్వారా 7 వేల గ్రామాలలో రక్షిత నీటి వసతి ఏర్పడిందంటున్నారు. రాష్ట్రంలో 33 వేల స్వయం సహాయక గ్రూపులుగా మహిళలు సమైక్యమై సశక్తీకరణలో పురోగమిస్తున్నారని అంటున్నారు. అనేక వైద్య కళాశాలలు, దంత కళాశాలలు, ఐ.టి.ఐ.లు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు నెలకొల్పినట్టు చెప్పుతున్నారు. ఇంతటితో ఆగకుండా జోగి తన 'విజన్ 2010' డాక్యుమెంటుని ప్రజల ముందుంచాడు. తిరిగి తనకే అధికారాన్ని కట్టబెడితే 2010 నాటికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందే రాష్ట్రాల్లో ఒకటి కాగలదని నమ్మబలుకుతున్నాడు – తన పగటికలను నిజమని ప్రజలను నమ్మమంటున్నాడు.

నూతనంగా ఉనికిలోకి వచ్చిన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నెలకొల్పిన అదనపు ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఇవాళ ఏ వర్గాల విద్యార్థులు చదువుకోగలుగుతున్నారు? నూతన రాష్ట్రంలో ఏర్పడుతున్న అనేక ప్రైవేటు పరిశ్రమలు ఎన్ని వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి? కోట్లాది రూపాయల పెట్టుబడితో విదేశీ టెక్నాలజీతో నిర్మిస్తున్న నగర్‌నార్ స్టీల్‌ప్లాంట్ మూడొందల మందికి మించి ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోతున్నది? నూతనంగా రాష్ట్రం ఉనికిలోకి వచ్చీ రాకముందే గంగ్రేల్ ప్రాజెక్ట్ కింది పొలాల రైతులు తమ పంట పొలాలకు నీళ్లివ్వాలంటూ మొత్తుకున్నా వినకుండా వాళ్ల నోళ్లల్లో దుమ్ముకొట్టి జోగి ప్రభుత్వం బిఎస్‌పి (భిలాయి స్టీల్ ప్లాంట్)కి నీళ్లందించి ఎవరిని ఉద్ధరించింది? తమ పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా పోవడంతో అప్పుల పాలైన వందలాది మంది ఛత్తీస్‌గఢ్ రైతులు ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆత్మహత్యలకు పాల్పడడం ఏ వర్గాల ప్రజల ఆకాంక్షలను సర్కార్ నెరవేర్చినట్టు తెలియజేస్తోంది? ఆర్‌టిసి ప్రైవేటీకరణతో వీధులపాలైన ఉద్యోగులు, 'సమాన పనికి సమాన వేతనం' కావాలంటూ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటున్న ఉపాధ్యాయులు, ఉమ్మడి మధ్యప్రదేశ్ ప్రభుత్వ కలం పోటుతో ఉద్యోగాలు కోల్పోయి నేటికీ దుర్భర జీవితాన్ని గడుపుతున్న దినసరి వేతన ఉద్యోగులు, సమస్యలతో సతమతమవుతున్న అన్ని శాఖల ప్రభుత్వోద్యోగులు, ఏటేటా కరువు వాత పడుతూ పొట్ట గడుపుకోవడానికి పిల్లాపాపలతో వలస పోకతప్పని లక్షలాది కుటుంబాలు, ఆదివాసుల జనాభా ఎక్కువగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అడవులపై ఎలాంటి హక్కు గానీ తాము సేకరించే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర గానీ

*... మా పార్టీ బస్తర్ ప్రజల న్యాయమైన డిమాండ్‌ను సమర్థిస్తూనే, ఛత్తీస్‌గఢ్ ప్రజల ఆకాంక్షలను ఎత్తిపట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని ఆహ్వానించింది. అయితే, నూతన రాష్ట్రం ఏర్పడినంత మాత్రాన, ఎలాంటి కఠినమైన పోరాటాలు లేకుండా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కావు ...*



పోలీసుల తుపాకులను లెక్కచేయకుండా ప్రత్యేక బస్తర్ కోసం వెల్లువెత్తిన జనం

నోచుకోని ఆదివాసులు – వీరందరి జీవితాల్లోకి తొంగి చూస్తే ఈ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని సులువుగానే అర్థం చేసుకోవచ్చు. ఐదు ఆదివాసీ తెగలు (బైగా, బైర్హొర్, కమార్, కొండకోర్వా, అబూజ్‌మాడియా) అంతరించి పోతున్నాయని ప్రకటించే ప్రభుత్వం వారి అస్తిత్వాన్ని కాపాడడానికీ, వారి ప్రగతికీ ఎలాంటి తక్షణ, దీర్ఘకాల చర్యలు చేపట్టకపోవడాన్ని బట్టి దాని ఆదివాసీ వ్యతిరేక స్వభావం స్పష్టంగా బైటపడుతున్నది. పొట్ట కట్టుకొని పొదుపు చేస్తూ 33 వేల స్వయం సహాయక గ్రూపుల్లో చేరిన పేద మహిళల బ్యాంకు డబ్బుతో బలుస్తున్నది పెట్టుబడిదార్లేనన్నది వాస్తవం. నేటికీ అనేక దైనందిన సమస్యలతో సతమతమవుతూ దుర్భర జీవితాన్ని గడుపుతున్న పీడిత వర్గాలా, సెక్షన్లా ప్రజానీకం కోసం ఈ ప్రభుత్వం ఏం చేసింది? కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని ప్రభుత్వం ఏ వర్గాల ప్రగతి కోసం ఖర్చు చేస్తోంది? సూటిగా చెప్పాలంటే రాష్ట్ర రాజధానియైన రాయపూర్‌ను శోభాయమానం చేయడానికీ, సంపన్న వర్గాలకు సకల సౌకర్యాలు సమకూర్చడానికీ, రాష్ట్రంలో పెంపొందుతున్న ప్రజా పోరాటాలనూ, ప్రజాస్వామ్య ఆలోచనలనూ అంతమొందించే ఉద్దేశ్యంతో పోలీసు బలగాలను అన్ని హంగులతో పటిష్టం చేసుకోవడానికీ మాత్రమే ఈ ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ విషయాలన్నీ నిత్యం జనం గమనిస్తున్నవే. తమ సమస్యలను పరిష్కరించడానికి ఎలాంటి శ్రద్ధా చూపని ప్రభుత్వం మరోవైపు దోపిడీ వర్గాల ప్రయోజనాలనూ, లాభాలనూ కాపాడుతున్నదని ఈ స్వల్ప కాలంలోనే వారు తెలుసుకోగలిగారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం ద్వారా తమ జీవితాలు బాగుపడుతాయనుకున్న వాళ్ల ఆశలు, ఆకాంక్షలు అన్నీ భగ్నమైనాయి. అవి పూర్తిగా భ్రమలేనని తేలిపోయింది. మోసానికీ, దుర్మార్గానికీ, దౌర్జన్యానికీ, అన్యాయానికీ, ఆధిపత్యానికి బలైన దాదాపు రెండు కోట్ల ఛత్తీస్‌గఢీ ప్రజల ముందుకు కొత్త రాష్ట్రంలో తొలిసారిగా జరుగనున్న ఎన్నికల సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల వాళ్లూ వస్తున్నారు. వీరిని గ్రామాల్లో అడుగుపెట్టనివ్వకుండా తన్నితరిమండి.

భారతదేశంలో 26వ రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ ఉనికిలోకి వచ్చినప్పటికీ ప్రజల ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు. రాజధాని నగరంలో లంపెనైజేషన్ పెరిగి భద్రత కరువైంది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం బహుళజాతి కార్పొరేషన్లకు ఎర్ర తివాచీ పరుస్తోంది. ఆదివాసీ కుగ్రామాల్లో జనం కనీసం మంచినీరైనా దొరకక విలవిలలాడుతున్నారు. ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తూ తెస్తున్న విదేశీ నిధులతో విశాల రోడ్లను నిర్మిస్తూ సంపన్న వర్గాలకే సౌకర్యాలు కల్పిస్తున్నది. ఇప్పటికే 32 వేలకు పైగా అప్పులు తెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుండి దారిద్ర్య నిర్మూలనకు 617 కోట్ల సహాయాన్ని బిచ్చమెత్తింది. అపారమైన ప్రకృతి సంపదలకు నిలయమైన ఛత్తీస్‌గఢ్‌లో ప్రజల దారిద్ర్యాన్ని తీర్చడానికి జోగి ప్రభుత్వానికి ప్రపంచ బ్యాంకు నుండి అప్పు తేవల్సివస్తున్నది! రాష్ట్రాన్ని పోలీసు బలగాలతో నింపేస్తూ ప్రజా పోరాటాలను నిరంకుశంగా అణచివేస్తోంది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఇప్పటివరకు జరిగిన 100కు పైగా ఎన్‌కౌంటర్లలో, బూటకపు ఎన్‌కౌంటర్లలో 10 మందికి పైగా విప్లవకారులను హతమార్చడాన్ని బట్టి ప్రభుత్వ ప్రజావ్యతిరేక స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చు. నూతనంగా ఉనికిలోకి వచ్చిన రాష్ట్రం గావడంతో సమకూరుతున్న పుష్కలమైన నిధులతో రాష్ట్రంలో అవినీతి కుంభకోణాలు అనేకం ఈ స్వల్పకాలంలోనే వెలుగు చూసాయి. లంచగొండితనానికి హద్దంటూ లేకుండా పోయింది. మరో ఐదేళ్ల పాటు లంచాలు మేయడానికి గాను అన్ని బూర్జువా పార్టీలు అధికారం కోసం పోటీ పడుతూ ప్రజల ముందుకు వస్తున్నాయి.

> *... మోసానికీ, దుర్మార్గానికీ, దౌర్జన్యానికీ, అన్యాయానికీ, ఆధిపత్యానికి బలైన దాదాపు రెండు కోట్ల ఛత్తీస్‌గఢీ ప్రజల ముందుకు, కొత్త రాష్ట్రంలో తొలిసారిగా జరుగనున్న ఈ ఎన్నికల సందర్భంగా అన్ని రాజకీయ పార్టీల వాళ్లూ వస్తున్నారు. వీరిని మన గ్రామాల్లో నుండి తన్ని తరిమేద్దాం. ...*

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయనీ, తమ బతుకు బాగుపడుతుందనీ ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైంది. రాష్ట్రం ఏర్పడినంత మాత్రాన ప్రస్తుత వ్యవస్థలో సమస్యలు పరిష్కారం కావని మరోసారి రుజువయ్యింది. ఐనప్పటికీ ప్రతి 5 సంవత్సరాలకొకసారి జరిగే ఎన్నికల సందర్భంగా అన్ని బూర్జువా రాజకీయ పార్టీల వాళ్లు ప్రజా సమస్యల పరిష్కారం అని మాయమాటలతో జనం ముందుకు వస్తూనే ఉన్నారు. ఏటేటా ఎన్నికల పేరుతో దేశ ప్రజలను మోసగిస్తున్నారు. కానీ వీరి మోసాలకు కాలం చెల్లిపోతోంది. ఏ పార్టీ పేరుతో, ఏ జండాతో వచ్చి ఓట్లడిగినా వారందరినీ నిలదీయండి – వారి ప్రజా వ్యతిరేక చర్యలను బహిర్గతపర్చండి – వారిని తన్ని తరమండి.

గత 20 ఏళ్లకు పైగా మన ఛత్తీస్‌గఢ్‌లోని విశాల ప్రాంతంలో విప్లవ రైతాంగ ఉద్యమం కొనసాగుతున్నది. బస్తర్ నుండి సర్గూజ వరకు వేలాది మంది రైతాంగం సంఘటితమై ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. వారంతా బూటకపు పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో కార్మిక-రైతాంగ మైత్రి పునాదిపై ప్రజా రాజ్యాధికారాన్ని నెలకొల్పడానికి సమరశీలంగా పోరాడుతున్నారు. విప్లవ ప్రజా సమితులను ఎన్నుకొని ప్రజలు బీజప్రాయంలో తమ అధికారాన్ని అనుభవిస్తున్నారు. ఇవి నిజమైన ప్రజాస్వామిక ప్రజా ప్రభుత్వ అంగాలు. వీటిని ఆదర్శంగా తీసుకొని సమస్త ఛత్తీస్‌గఢ్ ప్రజానీకం బూటకపు ఎన్నికలను బహిష్కరించి ప్రత్యామ్నాయ ప్రజా రాజ్యాధికార సంస్థలను నెలకొల్పుకోవాలని పిలుపునిస్తున్నాం. వీటికి ప్రజా గెరిల్లా సైన్యాన్ని అండగా నిలుపుకోండి. వేల సంఖ్యలో అందులో చేరిపోండి ! ✪



ప్రత్యేక ప్రజాస్వామిక బస్తర్ రాష్ట్రం సాధన విషయమై చర్చిస్తున్న ప్రజలు

# ప్రైవేటీకరణ పట్టాలపై పరుగెడుతున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం

ఒక దశాబ్ద కాలంకన్నా ముందు నుండే మన దేశంలో నూతన ఆర్థిక విధానాలు అమలవుతున్నాయి. ఇవి అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ బ్యాంకు ఆదేశాలపై, అవి విధించిన షరతులకు లోబడి 1991 నుండి అమలవుతున్నాయి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు లోబడి మన దేశంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని అమలుచేస్తున్నాయి. గతంలో స్వేచ్ఛా మార్కెట్ పేరుతో సామ్రాజ్యవాదులు అమలుచేసిన విధానాలనే మరింత కట్టుదిట్టమైన నియమాలతో నేడు ప్రపంచీకరణ పేరుతో అమలుచేస్తున్నారు. ఎలాంటి సరిహద్దులు లేవనీ, ఉత్పత్తిదారులు తమ సరకులను ప్రపంచ మార్కెట్టులో ఎక్కడైనా ఏ రక్షణ విధానాలకూ లోబడకుండా అమ్ముకోవడమే ప్రపంచీకరణ అసలు లక్ష్యం అని సామ్రాజ్యవాదులు ఘంటాపదంగా చెప్తుతున్నారు. అలాగే ప్రైవేటీకరణ విషయానికి వస్తే, ప్రభుత్వం కేవలం శాంతి-భద్రతల వ్యవహారాలను మాత్రమే చూసుకోవాలనీ మిగతాదంతా ప్రైవేట్‌పరం చేయాలంటున్నారు. విద్యా-వైద్యం వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల రూపకల్పన మొదలైన విషయాలలో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోకూడదని అంటూ, అదంతా ప్రైవేట్ వ్యక్తులకే అప్పచెప్పాలని ప్రైవేటీకరణ విధానం నిరంతరం ఒత్తిడి చేస్తోంది. సరళీకరణ విషయానికి వస్తే పరిశ్రమలు స్థాపించడంలో గానీ, ఉత్పత్తులు నిర్ణయించడంలో గానీ, అమ్ముకోవడంలో గానీ, ధరలు నిర్ణయించడంలో గానీ ప్రభుత్వం ఉదారంగా ఉండాలంటుంది. ప్రభుత్వ లైసెన్స్‌ల పేరుతో అనవసర జాప్యం జరుగుతోందనీ, అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తోందనీ అంటూ వాటన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలా, సామ్రాజ్యవాదులు తమ సంక్షోభ భారాన్ని ముఖ్యంగా వెనుకబడిన దేశాలపై మోపడంలో భాగంగా నూతన ఆర్థిక విధానాల పేరుతో వీటిని రుద్దుతున్నారు. ఫలితంగా, అసలే సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వెనుకబడిన దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ మరింత పతనమవుతున్నాయి. అయినా అనేక దేశాల ప్రభుత్వాలు అత్యంత విశ్వసనీయంగా సామ్రాజ్యవాదుల ఆర్థిక విధానాలను అమలు చేయడంలో పోటీ పడుతున్నాయి. మన దేశంలో ఇవి పదేళ్ల పాటు మొదటి విడత సంస్కరణలుగా అవి అమలవగా, గత నాలుగేళ్లుగా రెండవ విడత సంస్కరణల పేరుతో మరింత వేగంగా, బలంగా అమలవుతున్నాయి. సారాంశంలో రెండూ ఒక్కటే. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో అమలవుతున్న ప్రైవేటీకరణ విధానాలను చూద్దాం.

> *... పెద్ద ఎత్తున లాభాలను గడిస్తున్న బాల్కోను స్టెర్‌లైట్ అనే బహుళజాతి కంపెనీకి కారుచౌకగా, అంటే దాదాపు 5,500 కోట్ల రూపాయల విలువ చేసే బాల్కోను 551 కోట్లకే అమ్మడం దేశ పాలకుల దళారీ స్వభావానికి ఒక మచ్చుతునక ...*

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఉనికిలోకి వచ్చిన కొద్ది మాసాలకే 'బాల్కో' ప్రైవేటీకరణ సమస్య ముందుకు వచ్చింది. భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి చెందిన అల్యూమినియం పరిశ్రమ ఇది. వేలాది మంది కార్మికులకు ఉపాధిని కల్పిస్తూ, పెద్ద ఎత్తున లాభాలను గడిస్తున్న ఈ కంపెనీని స్టెర్‌లైట్ అనే బహుళజాతి కంపెనీకి కారుచౌకగా, అంటే దాదాపు 5,500 కోట్ల రూపాయల విలువ చేసే దాన్ని 551 కోట్లకే అమ్మడం దేశ పాలకుల దళారీ స్వభావానికి ఒక మచ్చుతునక. ఈ అమ్మకాన్ని జోగి ప్రభుత్వం మొదట వ్యతిరేకించింది. కార్మికులతో పాటు వీధుల్లోకి వచ్చి ఢిల్లీ సర్కార్‌ను దుయ్యబట్టింది. కానీ, చివరకు అది కార్మికులకు విద్రోహం చేసి స్వాభావికంగానే దళారీ పెట్టుబడిదారుల సరసన చేరిపోయింది. నిజానికి మన దేశంలో 1991లో నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టింది అప్పటి కాంగ్రెసు ప్రభుత్వమే. అది ఈనాటికీ ఎక్కడా, ఎప్పుడూ ఆ విధానాలను అడ్డుకోలేదు. కానీ కార్మికులను మోసం చేయడానికి, అధికార కుమ్ములాటలో భాగంగా అది ఎప్పుడైనా పైకి ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తున్నట్లు నటించినా అది నిజం కాదు. ఈ విషయాన్ని 'బాల్కో' వ్యవహారం ఛత్తీస్‌గఢ్‌లో రెండేళ్ల కిందటే చక్కగా నిరూపించింది.

రాష్ట్రం ఉనికిలోకి వచ్చిన తొలినాళ్ల నుండి నగర్‌నార్ స్టీల్ ప్లాంట్ ప్రజలకు ఒక జటిల సమస్య అయింది. మొదట ఈ ప్లాంటును హీరానార్‌లో నిర్మించ తలపెట్టారు. కానీ, అక్కడ ప్రజలు సమరశీల పోరాటం జరపడంతో ప్రభుత్వం దానిని అక్కడి నుండి నగర్‌నార్‌కు మార్చాల్సి వచ్చింది. ఇక్కడ కూడా ప్రజలు ఎంతో పట్టుదలగా, సమరశీలంగా పోరాడారు. దేశంలోని అనేక మంది ప్రజాస్వామికవాదులు, ఆదివాసుల శ్రేయోభిలాషులు, పర్యావరణవాదులు, విప్లవ సంస్థలు, ప్రజాస్వామిక సంస్థలు ఆ ప్రజలకు అండగా నిలిచారు. కానీ ప్రభుత్వం తన మొండి వైఖరిని విడిచిపెట్టలేదు. సరికదా, స్థానిక ప్రజలను, బాలింతలని కూడా చూడకుండా మహిళలనూ ఎందరినో జైల్లోకి తోసి, ప్లాంటు నిర్మాణాన్ని వ్యతిరేకించే వారెవరూ జగ్దల్‌పూర్ రావడానికి కూడా అనుమతించకుండా, క్రూర నిర్బంధం మధ్య పునాది రాళ్లను పాతింది. ప్రభుత్వం బస్తర్ వికాసానికి పారిశ్రామికీకరణే ఏకైక మార్గమనీ, నిరుద్యోగాన్ని రూపుమాపడానికి పారిశ్రామికీకరణే శరణ్యమనీ విశాల ప్రజానీకాన్ని, ముఖ్యంగా యువతను పక్కతోవ పట్టిస్తున్నది. దోపిడీ వర్గ పార్టీలన్నీ ఏక స్వరంతో ప్రైవేట్ పెట్టుబడిదార్లకూ, బహుళజాతి కార్పొరేషన్‌లకూ దేశంలోకి ఆహ్వానం పలుకుతున్నాయి. గడచిన మూడు సంవత్సరాలలో 65 వేల కోట్లకు పైగా విదేశీ పెట్టుబడులు నమోదయ్యాయంటే రాష్ట్రం ఏ మార్గంలో పయనిస్తుందో, దీని ప్రగతి ఎవరిపై ఆధారపడి ఉందో అర్థం చేసుకోవచ్చు. నగర్‌నార్‌లో భూములు కోల్పోయిన వారికి న్యాయమైన నష్టపరిహారం చెల్లిస్తామనీ, స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యతనిస్తామనీ ప్రకటించిన ఎన్ఎండిసి ఏడాది తిరక్కముందే మాటమార్చింది. మూడు వందల ఉద్యోగాలకు గాను మూడు లక్షల దరఖాస్తులు రావడంతో (17 మార్చి 2003) ఎవరికీ ఎలాంటి ప్రాధాన్యతా ఉండదని అంది. భూములు కోల్పోయినవారికి నష్టపరిహారం కూడా 50% తగ్గిస్తానని ప్రకటించి ప్రభుత్వం తన నిజ స్వరూపాన్ని తానే బైటపెట్టుకుంది.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో అపారమైన ఖనిజ సంపద, విశాలమైన అడవులు,

ఇతరత్రా సహజ వనరులనేకం ఉన్నాయి. వీటిలో అధిక భాగం విశాల బస్తర్‌లోనే ఉన్నాయి. మన దేశంలో ముఖ్యంగా అడవులు, కొండలతో కూడుకొని సహజ వనరులను కలిగివున్న ఆదివాసీ ప్రాంతాలే దారుణమైన దోపిడికి గురవుతున్న ప్రాంతాలని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇందుకు బస్తర్ ఏమాత్రం మినహాయింపు కాదు. అందుకే బస్తర్ సంపదలను కబళించడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి, టూరిజం అభివృద్ధి పేరుతో పెట్టుబడిదార్లకు అడిగిందే తడవుగా కావలసిన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తున్నది.

ఛత్తీస్‌గఢ్ అభివృద్ధిలో రోడ్ల నిర్మాణమే ప్రధానమై పోయింది. ప్రభుత్వం వందలాది కిలోమీటర్ల నూతన రోడ్లను నిర్మిస్తోంది. ఇప్పటికే 6 వేల కిలోమీటర్ల రోడ్ల పనులు పూర్తి కాగా, ఇంకా తాను రూపొందించిన 'మాస్టర్ ప్లాన్' ప్రారంభమే కాలేదంటున్నది. ముఖ్యంగా ఈ రోడ్లు రెండు ప్రాంతాలలో నిర్మాణమవుతున్నాయి – రాయపూర్ నగరంలో, బస్తర్ అడవుల్లో. దోపిడీ పాలకవర్గాలకు రాష్ట్ర రాజధానిని విశాలమైన రోడ్లతో శోభాయమానం చేయడం ఒక అవసరం కాగా, బస్తర్‌లో అపార వనరులను కొల్లగొట్టడానికి రోడ్ల వలను విసరడం మరో అవసరమైంది. వ్యూహాత్మకంగా చూస్తే బస్తర్‌లో నిర్మిస్తున్న రోడ్లు ఇక్కడి వనరులను కొల్లగొట్టడానికేనన్నది వాస్తవం. అట్లాగే, ప్రస్తుతం ఇక్కడ పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించడం ప్రభుత్వానికి తక్షణావసరం. విప్లవోద్యమాన్ని నిర్మూలించకుండా బస్తర్ సంపదలను కొల్లగొట్టడం అంత సులువు కాదని ప్రభుత్వానికి తెలుసు. ఈ నేపథ్యంలో అది కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగ పరుస్తూ బందూకుల పహరాతో బిఆర్‌ఓ సహాయంతో రోడ్లు నిర్మిస్తోంది. జనవరి 7, 2003 నాడు ప్రకటించిన 362 కోట్ల రూపాయల బస్తర్ పాకేజిలో సగానికి పైగా డబ్బు రోడ్ల నిర్మాణానికే కేటాయించడం కూడా ఈ వ్యూహంలో భాగమే.

> *... మన దేశంలో ముఖ్యంగా అడవులు, కొండలతో కూడుకొని సహజ వనరులను కలిగివున్న ఆదివాసీ ప్రాంతాలే దారుణమైన దోపిడికి గురవుతున్న ప్రాంతాలని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇందుకు బస్తర్ ఏమాత్రం మినహాయింపు కాదు ...*

ఇది ఇలా వుండగా, రాష్ట్రంలో నక్సలైట్ల సమస్యతో డజన్ల కొద్ది గనులు మూతపడి ఉన్నాయనీ, ఇది నిరుద్యోగాన్ని తీవ్రతరం చేస్తోందనీ అంటున్న ప్రభుత్వం అసలు విషయాన్ని మరుగుపరుస్తోంది. ప్రపంచబ్యాంకు నుండి అప్పులు తెస్తూ దాని ఆదేశాలను అమలు చేయకతప్పని ఏ ప్రభుత్వమైనా ఏటా 2% ఉద్యోగాలను తొలగించాల్సి ఉంటుందన్న విషయాన్ని కూడా అది చెప్పడం లేదు.

గత 30 సంవత్సరాలుగా, బస్తర్ నడిబొడ్డున ఉన్న బైలడిల్లా గనుల నుండి మేలి రకం ఇనుప ఖనిజాన్ని నేరుగా జపాన్ సామ్రాజ్యవాదులకు తరలిస్తూ రాయల్టీ రూపంలో కోట్ల రూపాయల విదేశీ మారకాన్ని సంపాదిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బస్తర్ ప్రజలను ఉద్ధరించింది ఏమీ లేదు. పైగా, ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ఆదివాసుల జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్నాయి. మరోవైపు గత 30-35 సంవత్సరాలుగా రావ్‌ఘాట్ ఇనుప గనులను తవ్వడానికి అనేక ఆటంకాల మధ్య తీవ్ర ప్రయత్నాలే జరుగుతున్నాయి. అయితే ఇంతకాలం బిఎస్‌పికి దల్లీ గనుల నుండి ముడి పదార్థం అందుతుండడంతో రావ్‌ఘాట్ తవ్వకాలు ఆలస్యమైనా నడిచింది. కానీ ప్రస్తుతం దల్లీ గనులు వట్టిపోయే స్థితికి చేరుకోవడంతో రావ్‌ఘాట్ గనుల తవ్వకం, రైల్వే లైన్ నిర్మాణ పనుల ప్రారంభం తక్షణ ఎజండా మీదకి వచ్చింది. ఇక్కడ 42 వేల కోట్ల టన్నుల మంచి విలువైన ఇనుప గనులున్నాయని అంచనా వేస్తున్నారు. వీటిని తవ్వి, బిఎస్‌పికి తరలించడమే తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వం ముందుంది. మరోవైపు బిఎస్‌పిలో ఏటేటా కార్మికులను తొలగిస్తూ దానిని ప్రైవేటుపరం చేయడానికి ప్రభుత్వం వేగిరపడుతోంది. ఒకనాడు లక్షమంది కార్మికులకు ఉపాధి దొరికిన బిఎస్‌పిలో సగానికి పైగా కార్మికుల్ని తొలగించడంతో ఇప్పుడు వారి సంఖ్య 40 వేలకు పడిపోయింది. ఇలా బిఎస్‌పి ప్రైవేట్‌పరం కాబోతుంది, ఆ కంపెనీకి ముడి పదార్థాన్ని అందించే రావ్‌ఘాట్ గనుల తవ్వకం పని చేపట్టనున్న ఎస్‌ఎఐఎల్ (స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా) ప్రైవేట్‌పరం కావడానికి కూడా పెద్ద సమయమేం పట్టదు. అలాగే రావ్‌ఘాట్ రైల్వే నిర్మాణ పని ప్రైవేట్ కంట్రాక్టర్లకు ఇచ్చి వేగంగా పూర్తి చేయాలని వేగిరపడుతోంది. ఈ రైల్వే నిర్మాణ పని బస్తర్ అభివృద్ధిలో భాగం అని ప్రభుత్వం, అన్ని దోపిడీవర్గ రాజకీయ పార్టీలూ దుష్ప్రచార దుమారాన్ని రేపుతున్నాయి. కానీ, నిజానికి ఈ గనుల ద్వారా, రైల్వే లైన్ నిర్మాణం ద్వారా, రోడ్ల ద్వారా లాభపడేది దళారీ పెట్టుబడిదార్లూ, బహుళజాతి కంపెనీలూ, బడా కాంట్రాక్టర్లేనన్నది వాస్తవం. అందుకే ప్రభుత్వం ఈ పనుల పరిపూర్తికి ఎక్కడా లేని శ్రద్ధాసక్తులను కనబరుస్తోంది.

ఇకపోతే దాదాపు గత 40 ఏళ్లుగా నడుస్తోన్న రోడ్డు రవాణా సంస్థను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మూసేసింది. ఇప్పటివరకు దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రీ సాహసించని తీరులో నూతన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బస్సులన్నింటినీ ప్రైవేట్‌పరం చేశాడు. ప్రైవేట్ పెట్టుబడిదార్ల సేవలో నిలువెల్లా మునిగిపోయిన అజిత్‌జోగి నష్టాల పేరుతో ఈ దుర్మార్గానికి ఒడిగట్టాడు. ఈ చర్యతో ఉద్యోగాలు కోల్పోయి వీధిన పడిన 2,734 మంది కుటుంబాలకు బడ్జెట్ నుండి 15 కోట్ల రూపాయలు కేటాయించి చేతులు దులుపుకున్నాడు. స్వచ్ఛంద సేవా విరమణ (విఆర్‌ఎస్) పథకం కింద వారికి మూడేళ్లలో మూడు కిస్తులుగా డబ్బులు ముట్టచెప్పడానికి సిద్ధపడినాడు. దీనితో ప్రైవేట్ కాంట్రాక్టర్లు ఇపుడు రాష్ట్రంలోని 117 రూట్లలో దాదాపు 300 బస్సులను నడిపిస్తూ ప్రయాణీకుల నుండి తమ చిత్తం వచ్చినట్లు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకొని సాధించుకున్న ఛత్తీస్‌గఢ్ ప్రజలకు గతంలో ఉన్న ప్రయాణ సౌకర్యం కూడా లేకుండా పోయి అధిక ఖర్చు, శ్రమలతో గ్యారంటీ లేని ప్రయాణాలు చేయాల్సి వస్తోందంటే ఇదంతా ప్రైవేటీకరణ మంత్రం జపిస్తున్న జోగి 'మహిమే'నన్న విషయాన్ని ప్రజలెన్నటికీ మరచిపోరు.

ప్రభుత్వం రాష్ట్రంలో 12,397 విద్యా సంస్థలను నిర్వహిస్తున్నదని జోగి సెలవిస్తున్నాడు. అయితే ఇందులో ఉన్నత విద్యా సంస్థలు, వృత్తి విద్యా కోర్సుల సంస్థలు మాత్రం లేవు. రాష్ట్రంలో మూడింట ఒకవంతు ఉన్న ఆదివాసీ పిల్లల కోసం పనిచేస్తున్న ఆశ్రమ పాఠశాలలు కూడా ఉన్నాయని లెక్కలతో సహా అందిస్తున్నాడు. రానున్న విధాన సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజల ఓట్లను ఆకర్షించడానికి ముఖ్యమంత్రి అసలు విషయాలను దాచిపెడుతూ తప్పుడు లెక్కలు అందిస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాడు. నిరంతరం ప్రైవేటీకరణ మంత్రాన్ని పఠించే జోగి విద్యా వ్యవస్థను కూడా ప్రైవేటు వ్యక్తులకే అప్పగించాడు. రాష్ట్రంలో

ఉన్నత విద్యా సంస్థలనూ, వృత్తి విద్యాకోర్సుల సంస్థలనూ ప్రభుత్వం నడపబోవడం లేదని స్పష్టం చేశాడు. అనేక ఆశ్రమ పాఠశాలలను తగ్గించేశాడు. బస్తర్, దక్షిణ బస్తర్ జిల్లాల్లో 533 ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలను మూసేసి 156 ఆశ్రమ పాఠశాలలను ప్రారంభించారు. ఒక్కో ఆశ్రమ పాఠశాలలో కేవలం 100 మంది విద్యార్థులకే వసతి కల్పిస్తారు. దీని ఫలితంగా వందలాది మంది విద్యార్థుల చదువు మధ్యలో నిలిచిపోవడమో లేదా వాళ్లు ప్రైవేట్ పాఠశాలలో చేరడమో జరుగుతున్నది. పాఠశాల విద్య గూర్చి గొప్పగా ఉపన్యాసాలిచ్చే జోగి, రాష్ట్రంలోని 28 వేల మంది శిక్షాకర్మీలకు తగిన వేతనాలు కూడా చెల్లించడం లేదు. విద్యను ఒక వ్యాపారంగా భావిస్తూ ప్రైవేట్‌పరం చేస్తున్న జోగి హయాంలో గురుజీలు అనేకమార్లు సమ్మెకు పూనుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్లపై నిరవధిక నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు జరుపుతున్నప్పటికీ జోగి ప్రభుత్వం మాత్రం వాళ్ల సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించడం లేదు. రేపటి రోజున వీరంతా ప్రైవేటీకరణ వేటుకు బలై వీధిన పడినా ఆశ్చర్య పోవలసిందేమీ ఉండదు.

ప్రజల వైద్య వ్యవస్థ తీరుతెన్నులు కూడా పాఠశాల విద్యకు భిన్నంగా ఏమీ లేదు. రాజధాని రాయపూర్ నుండి మామూలు పట్టణం వరకూ సౌకర్యవంతమైన, ఖరీదైన ప్రైవేటు ఆసుపత్రులెన్నో వెలుస్తున్నాయి. కానీ పేదలకు మాత్రం వైద్యం అందని ద్రాక్షపండు లాగే ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులు కుంటినడక నడుస్తున్నాయి. ఇందుకు బస్తర్‌ను ఒక పెద్ద ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇక్కడ 122 మంది డాక్టర్లను నియమిస్తామని బస్తర్ ప్యాకేజిలో ప్రకటించిన జోగి ప్రభుత్వం ఇప్పటికీ 65 మందిని మాత్రమే నియమించి రోగులను వారి మానాన వదిలేసింది. ప్రభుత్వాసుపత్రులు దాదాపు మూతబడే స్థితికి చేరుకుంటున్నందున ప్రజల ఆరోగ్యం ప్రైవేటు డాక్టర్ల దయాదాక్షిణ్యాలకు వదలివేయబడింది. వైద్యం ఒక పెద్ద వ్యాపారమైంది. డాక్టర్లు రోగుల ప్రాణాలతో చెలగాటమాడే కాంట్రాక్టర్లవుతున్నారు. ప్రభుత్వాలేమో వ్యాపారం చేయడం మా పనికాదని సెలవిస్తున్నాయి!

> *..వైద్యం ఒక పెద్ద వ్యాపారమైంది. డాక్టర్లు రోగుల ప్రాణాలతో చెలగాటమాడే కాంట్రాక్టర్లవుతున్నారు. ప్రభుత్వాలేమో వ్యాపారం చేయడం మా పనికాదని సెలవిస్తున్నాయి ...*

ఇవాళ రేపు ప్రభుత్వాలు నీళ్లతో కూడా వ్యాపారం చేస్తున్నాయి. జోగి హయాంలోనే శివనాథ్ నదీ జలాల అమ్మకం వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమైంది. నదీ జలాలను అమ్ముకోవడం ద్వారా ఆ ప్రాంతంలోని ప్రజలకు నీటిపై ఎలాంటి అధికారం లేకుండా పోతుంది. పంటలకు నీళ్లను తరలించడం గానీ, నీళ్లలో చేపలు పట్టుకోవడం గానీ మరేలాంటి అవసరాలు తీర్చుకోవడానికైనా ప్రజలు నీటి యజమానులకు డబ్బు చెల్లించాల్సిందే. ఇంతటి దారుణానికి ప్రభుత్వం ఒడిగట్టిందని అర్థం కాగానే ప్రజల కోపం కట్టలు తెంచుకుంది. అనేక చోట్ల సభలూ, ఊరేగింపులూ జరిపి నదీ జలాలను అమ్మడాన్ని తీవ్రంగా నిరసించారు. జోగి ప్రభుత్వం ఉమ్మడి ప్రభుత్వం నిర్ణయం ఇదని చెప్పి తప్పుకోవాలని చూసింది. కానీ నూతన రాష్ట్ర ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని ఎందుకు కొనసాగించిందో ప్రజలు స్పష్టంగానే తెలుసుకున్నారు. ఖారున్, జోంక్, శబరి, మహానది, కెలో నదుల నీటిని కూడా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమ్మివేసింది. గత సంవత్సరం ఒకవైపు గుజరాత్‌లో ముస్లింల నరమేధం కొనసాగుతుండగా మరోవైపు ప్రభుత్వం పార్లమెంటులో నీళ్లను ప్రైవేటు ఆస్తిగా పరిగణిస్తూ నూతన విధానాన్ని ఆమోదించింది. దళారీ పెట్టుబడిదార్ల, బహుళజాతి కార్పొరేషన్‌ల సేవలో మునిగిన ప్రభుత్వాలు, బూర్జువా రాజకీయ పార్టీలు తమ లాభాల కోసం, ఎలాంటి సిగ్గూ ఎగ్గూ లేకుండా ఎంతటి ఘోరానికైనా ఒడిగడతాయని నదీజలాల అమ్మకాల వ్యవహారాలు మనల్ని హెచ్చరిస్తున్నాయి.

నీళ్లనే అమ్ముకునే వాడికి విత్తనాలు అమ్ముకోవడం ఓ లెక్కా! 'ధాన్ కా కటోరా'గా పేరుగాంచిన ఛత్తీస్‌గఢ్ నుండి విత్తనాలను తరలించాలని సింజెంటా కంపెనీ చాటుమాటుగా చేసిన ప్రయత్నం బైటపడడంతో ప్రజలు అవాక్కయ్యారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో మూలమూల నుండీ సేకరించిన 20,000 వేల రకాల వరి వంగడాలు రాయపూర్‌లోని ఇందిరాగాంధీ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఉన్నాయి. వీటిని సేకరించిన ఘనత దేశభక్తుడైన వ్యవసాయ శాస్త్రజ్ఞుడు డాక్టర్ రిఛారియాకు దక్కుతుంది. ఈ వంగడాలను ఛత్తీస్‌గఢ్ రైతులు కష్టించి శ్రద్ధతో అభివృద్ధి చేశారు. వీటిలో అన్ని పరిస్థితులనూ, అన్ని రకాల వాతావరణాన్నీ తట్టుకునే అనేక రకాలున్నాయి – తక్కువ సమయంలో పండేవీ, ఎక్కువ సమయంలో పండేవీ, తక్కువ గడ్డినిచ్చేవీ, ఎక్కువ గడ్డినిచ్చేవీ, వరదలనూ, అనావృష్టినీ తట్టుకునేవీ, లోతు నీటిలో పండేవీ, చీడపీడలను తట్టుకునేవీ – ఎన్నెన్నో రకాల వరి వంగడాలను డాక్టర్ రిఛారియా సేకరించాడు. ఈ అమూల్య సంపదపై స్విట్జర్లాండ్‌కు చెందిన సింజెంటా కంపెనీ కన్ను పడింది. నాలుగు పేరుమోసిన కంపెనీలైన శాండోజ్, సిబా-గైగీ, అస్ట్రా, జెనెర్కాల విలీనంతో ఏర్పడిన బడా బహుళజాతి కంపెనీయైన సింజెటాకు పరిశోధన పేరుతో కొన్ని ప్రత్యేకమైన వరి వంగడాలను కట్టబెట్టే ఏర్పాట్లు చాలా రహస్యంగా పూర్తయ్యాయి. వీటిని ఉపయోగించుకొని సింజెంటా కొన్ని హైబ్రిడ్ వరి వంగడాల్ని అభివృద్ధిపర్చి వాటిని ప్రపంచ మార్కెట్‌లో అమ్ముకుంటుంది. అమ్మకం ద్వారా వచ్చే ఆదాయంలో ఒక భాగం విశ్వవిద్యాలయానికి ఇస్తుంది. కొన్ని నిధులు కూడా ఇస్తానని ఒప్పుకుంది. కొత్త హైబ్రిడ్ వంగడంపై పేటెంట్ హక్కు సింజెంటాకే ఉంటుంది. అంగీకార పత్రం కూడా సిద్ధమైంది, సంతకాలు పెట్టడమే తరువాయి. కానీ డాక్టర్ రిఛారియా నెలకొల్పిన దేశభక్తియుత వారసత్వాన్ని నిలబెడుతూ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన కొందరు శాస్త్రవేత్తలు ఈ కుట్రను బట్టబయలు చేశారు. ఈ అమ్మకాన్ని వ్యతిరేకించారు.

ఆ తర్వాత పలు ప్రజా సంఘాలూ, మేధావులూ తీవ్ర నిరసన తెలిపారు. ఇదంతా చూసి విశ్వవిద్యాలయం, సింజెంటాలు ఇరువురూ వెనక్కి తగ్గారు. జోగి ప్రభుత్వం ఈ ఉదంతం గురించి 'తనకేమీ తెలియద'ని తప్పుకుంది. జోగి ఓ వైపు ఈ ఉదంతంతో జరిగిన అవమానాన్ని దిగమింగుతూనే, తమ 'సంకుచిత' పరిధి నుండి బైటపడి ప్రపంచాన్ని పరిశీలించాల్సిందిగా ఛత్తీస్‌గఢ్ మేధావులకు ఉచిత సలహా ఇచ్చాడు. బహుళజాతి కంపెనీలు లేకుండా ఎవరికీ ఏ మేలూ జరగదని ఆయన ఉవాచ! ప్రజల నిరసన ఫలితంగా ఇప్పటి మట్టుకు ఈ కుట్ర భగ్నమైనప్పటికీ సింజెంటా చొరబాటు ప్రమాదం మాత్రం పూర్తిగా తొలగిపోలేదు. కవర్ధా జిల్లాలో నిరాటంకంగా సాగుతున్న సింజెంటా కార్యకలాపాలే ఇందుకు ఉదాహరణ. వ్యవసాయ ప్రధానమైన ఛత్తీస్‌గఢ్‌ను

బహుళజాతి వ్యవసాయ కంపెనీల జాగీరుగా మార్చాలని అజీత్‌జోగి ప్రయత్నిస్తున్నాడు.

ఛత్తీస్‌గఢ్‌లో నిక్షిప్తమై ఉన్న విలువైన ఖనిజ సంపదల నుండి ప్రభుత్వానికి చాలా ఆదాయం లభిస్తున్నది. ప్రభుత్వం ఈ ఆదాయాన్ని 1,000 కోట్ల రూపాయల వరకు పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నది. అందుకే అది ఆదరాబాదరగా రాష్ట్రంలోని ఖనిజ నిల్వలన్నింటినీ ప్రైవేట్ కంపెనీలకు కట్టబెడుతున్నది. దీనిలో భాగంగా ప్రస్తుతం కాంకేర్ జిల్లాలోని చార్‌గాంలో ఇనుప గనిని ప్రారంభించింది. రాష్ట్రంలో ప్రధానంగా బొగ్గు, సున్నపురాయి, ఇనుము, డోలమైట్, బాక్సైట్, తగరం మొదలైన విలువైన ఖనిజాల నిల్వలు విస్తారంగా ఉన్నాయి. వీటిని బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాలు శరవేగంగా జరుగుతున్నాయి.

భారతదేశ అడవులపై ప్రపంచ బ్యాంకు డేగ కన్ను పడింది. అన్ని రాష్ట్రాలలోని అడవులపై తన పట్టు పెంచుకోవడానికి ప్రపంచ బ్యాంకు రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్ల రూపాయిలను అందజేస్తోంది. దేశంలోని రాష్ట్రాలలో మధ్యప్రదేశ్ రాష్ట్రం విస్తారమైన అడవులను కలిగివుంది. పెద్ద ఎత్తున ఆదివాసులు నివసిస్తున్న అడవులివి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నపుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నుండి అడవుల నిర్వహణకు గాను 1,000 కోట్ల రూపాయలను అందుకున్నది. అడవుల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యం పేరుతో అన్ని రాష్ట్రాలలో ఏర్పరిచినట్లే ఇక్కడ కూడా వన సంరక్షణ సమితులను ఏర్పర్చారు. ఇవి ఎంతో చక్కగా పనిచేస్తున్నాయని తెగమెచ్చుకున్నారు. కానీ, చివరకు అడవుల నిర్వహణలో ఇవి విఫలమయ్యాయంటూ పెదవి విరిచారు. ఆదివాసులు పెద్ద ఎత్తున అటవీ భూములను ఆక్రమించారని చెబుతూ దేశంలోని లక్షలాది మంది ఆదివాసులను ఆ భూముల నుండి బేదఖలు చేయించాలని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. దీనితో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులను వారి భూముల నుండి బేదఖలు చేయిస్తున్నాయి. భారతదేశపు అడవులను సామ్రాజ్యవాదులు తొలి నుండీ కొల్లగొడుతూనే ఉన్నారు. గతంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు అటవీ సంపదను తరలించుకుపోతే ఇప్పుడు ప్రపంచ బ్యాంకు చాటున నూతన పథకాల పేరుతో సామ్రాజ్యవాదులు తరలించపూనుకుంటున్నారు. సమృద్ధమైన ఛత్తీస్‌గఢ్ అడవులను కబళించడానికి సామ్రాజ్యవాదులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అడవుల సంరక్షణ పేరుతో ప్రపంచబ్యాంకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అందిస్తున్న సహాయమంతా ఇక్కడి అడవులపై సామ్రాజ్యవాదుల భల్లూకపు పట్టును మరింత బిగించే ప్రయత్నంలో భాగమే.

... అడవుల సంరక్షణ పేరుతో ప్రపంచబ్యాంకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అందిస్తున్న సహాయమంతా ఇక్కడి అడవులపై సామ్రాజ్యవాదుల భల్లూకపు పట్టును మరింత బిగించే ప్రయత్నంలో భాగమే ...

ఇలా నూతన రాష్ట్రంలోని అన్ని రంగాలు ప్రైవేట్‌పరమవుతున్నాయి. చివరకు ప్రజల జననమరణాల రికార్డులను నమోదు చేసే కర్తవ్యాన్ని కూడా ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకే అప్పగించింది. జననమరణాలను నమోదు చేయించేవాళ్లు ఇకపై ప్రైవేట్ సంస్థలకు కోరినంత డబ్బు చెల్లించక తప్పదు.

మన దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ దేశంలోనే కాకుండా అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నుండి కూడా అప్పులు తేవడంలో పోటీపడుతున్నాయి. గతంలో కేవలం కేంద్రం మాత్రమే ఇలాంటి చర్యలకు పూనుకునేది. కానీ, ప్రస్తుతం రాష్ట్రాలు కూడా నేరుగానే అప్పులకు ఎగబడుతున్నాయి. విదేశీ సంస్థలు, అంతర్జాతీయ సంస్థలు సైతం కేంద్రం మధ్యవర్తిత్వం లేకుండానే రాష్ట్రాలకు నేరుగా అప్పులు మంజూరు చేస్తున్నాయి. అవి ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితులకు ఇది అద్దం పడుతున్నది. అలాగే అనేక సహజ వనరులతో విలసిల్లుతున్న రాష్ట్రాలను నేరుగా తమ గుప్పిట్లోనే పెట్టుకోవడానికి అవి ఉవ్విళ్లూరడాన్ని ఈ కొత్త పరిణామం తెలియజేస్తోంది. అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలూ ప్రవాస భారతీయులను ఆకర్షించడానికి కూడా తెగ తంటాలు పడుతున్నాయి. వారి నుండి పెద్దెత్తున పెట్టుబడులను రాబట్టడానికి ఆకర్షణీయమైన రాయితీలను ప్రకటిస్తున్నాయి. పన్నుల తగ్గింపు, మినహాయింపు, చౌకగా ముడిపదార్థాల సరఫరా, స్థలాలను కోరుకున్నచోట చెప్పిన రేట్లకు అప్పగించడం, మౌలిక సదుపాయాల రూపకల్పన, చట్టాల్లో వారు కోరిన మేరకు సవరింపులు మొదలైన అనేక రాయితీలు కల్పిస్తున్నారు. ఇందుకు గాను ముఖ్యమంత్రులూ, మంత్రులూ తరచుగా విదేశీ పర్యటనలు చేస్తున్నారు. ఇందులో ఛత్తీస్‌గఢ్ ఏమాత్రం వెనుకబడి లేదు. ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్లను (ఇ.పి.జడ్) ఏర్పర్చి బహుళజాతి కార్పోరేషన్‌లకు సరకులను చౌకగా అందిస్తున్నారు. ఇలా ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు లోబడి అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలూ కూడా దేశ, రాష్ట్రాల సంపదలను సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేస్తున్నారు.

ప్రభుత్వాలు యథేచ్ఛగా బహుళజాతి కార్పోరేషన్‌లను దేశంలోకి ఆహ్వానించడంతో అవి తమ లాభాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకోవడం కోసం ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. నకిలీ విత్తనాలు అమ్ముతూ రైతుల ఆత్మహత్యలకు కారణమవుతున్నాయి. అవి అమ్ముతున్న క్రిమిసంహారక మందులు పనిచేయక పోవడంతో పంట పొలాలు నాశనమై పోతున్నందున రైతాంగం అవే మందులను తాగి ప్రాణాలు తీసుకుంటున్నారు. తాజాగా కోక్-పెప్సి దారుణ ఉదంతాలు వెలుగు చూశాయి. అత్యధిక మోతాదులో క్రిమి సంహారక మందులను కలుపుతున్న ఈ పానీయాలను తాగడం ద్వారా ప్రజలు అనేక రోగాల పాలవుతున్నారు. ఈ దోపిడీ సంస్థలు మన దేశంలోకి చొరబడి స్థానిక మార్కెట్టును ఎంతో ప్రతికూలంగా ప్రభావితం చేస్తున్నాయి. వీటి ధాటికి తట్టుకోలేక స్థానిక కంపెనీలు మూతపడిపోతున్నాయి. ఇలా ఇవి అన్ని విధాలా హానికరంగా తయారైనాయి. ఇలాంటి సంస్థలను ప్రజానీకం వెనక్కి పంపించాలి. ఈ సంస్థలకు అనుమతిస్తున్న ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలి.

ఎన్నికల సమయంలో ఓట్లడగడానికి వచ్చే అన్ని రాజకీయ పార్టీల వాళ్లూ ఈ దేశంలోని బడా పెట్టుబడిదార్ల, బడా భూస్వాముల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను ఈడేర్చడానికి బద్ధులైనవాళ్లే. వీళ్లవరికి అధికార పగ్గాలు ప్రజలు అందజేసినా ఈ సామాజిక రుగ్మతలన్నింటినీ భరిస్తూ బ్రతకాల్సిందే. వారి లాభాల వేటలో మన జీవితాలు బుగ్గిపాలు కావలసిందే. కాబట్టి, ఎన్నికలను బహిష్కరించి ఈ దోపిడీ వర్గ రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పండి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గత 23 ఏళ్లుగా కొనసాగుతున్న ప్రజాయుద్ధంలో భాగస్వాములు కండి. అదే సరైన మార్గం – అదే ఏకైక మార్గం. భూస్వామ్య, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాదులకు అంతిమంగా గోరి కట్టే మార్గమదే ! ✪

# బస్తర్ ఛత్తీస్‌గఢ్‌లో భాగం కాదు !
# ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ విలీనానికి ప్రజలు ఆమోదం లేదు !

నవంబర్ 1, 2000 నాడు మధ్యప్రదేశ్ నుండి వేరుపడి ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది. ప్రత్యేక రాష్ట్రం కావాలన్న తమ చిరకాల ఆకాంక్ష తీరడంతో ఛత్తీస్‌గఢ్ ప్రజలు సహజంగానే చాలా సంతోషించారు. అయితే బస్తర్ ప్రజలు మాత్రం ప్రత్యేక బస్తర్ రాష్ట్రం డిమాండుతో తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. ప్రత్యేక బస్తర్ రాష్ట్రం ద్వారా తమ అడవులపైనా, భూములపైనా, గనులపైనా, తదితర సంపదలపైనా తమకు అధికారం దక్కుతుందనీ, ఆ విధంగా తమ సర్వతోముఖాభివృద్ధి జరుగగలదనీ ప్రజలు భావించారు. కానీ పాలకవర్గాలు ప్రజల ఆకాంక్షను కాలరాస్తూ బస్తర్‌ను ఏకపక్షంగా, బలవంతంగా ఛత్తీస్‌గఢ్‌లో విలీనం చేసుకున్నాయి. ఈ బలవంతపు విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటు సందర్భంగానూ, ఆ తర్వాత కూడా బస్తర్ ప్రజలు అనేక ర్యాలీలూ, సభలూ నిర్వహించి ఉద్యమాన్ని కొనసాగించారు. ఈ మూడు సంవత్సరాలలో ప్రతి నవంబర్ 1న ప్రత్యేక బస్తర్ రాష్ట్రం డిమాండుతో ప్రజలు బంద్ నిర్వహిస్తూనే వస్తున్నారు. ఈ పోరాటంలో భాగంగా అన్ని వర్గాలకూ చెందిన వేలాది మంది ప్రజలు నిరసన ప్రదర్శనలు, బంద్ తదితర కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమాలన్నింటిలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడం ఒక విశేషం.

ప్రజల నిరసన ప్రదర్శనలపైనా, ఊరేగింపులపైనా ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తూనే వస్తున్నది. ఈ విధంగా ప్రత్యేక బస్తర్ కోసం పోరాడుతున్న ప్రజల ఆకాంక్షలను అణచిపెట్టాలని ప్రయత్నిస్తున్నది. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న నిర్బంధాన్నీ, దౌర్జన్యకాండనూ లెక్కచేయకుండా బస్తర్ ప్రజలు పోలీసు బలగాలను ఎదిరిస్తూ తమ ఉద్యమాన్ని సాగిస్తూనే ఉన్నారు. ప్రత్యేక బస్తర్ డిమాండ్‌కు రోజురోజుకూ అధికాధికంగా ప్రజల మద్దతు లభిస్తున్నది.

అయినప్పటికీ పాలకవర్గాలు బస్తర్ ప్రజల ఈ న్యాయమైన డిమాండ్ పట్ల తమ వ్యతిరేక వైఖరినే అవలంబిస్తున్నాయి. బస్తర్‌లో నిక్షిప్తమై ఉన్న అపారమైన అటవీ, ఖనిజ సంపదలపై దోపిడీ పాలకులు ముందు నుండే కన్నేసి ఉంచారు. విశాల బస్తర్ అడవులలో లభించే అటవీ ఉత్పత్తులనూ, విలువైన కలప, ఖనిజ సంపదలను చేజిక్కించుకోవడం కోసమే వాళ్లు పథకం ప్రకారమే కుట్ర చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో భాగంగానే బస్తర్ అభివృద్ధి చెందగలదని బస్తర్‌వాసులకు మాయమాటలు చెప్పారు. బస్తర్ సంపదలపై బస్తర్‌వాసులకే అధికారం ఉంటుందనీ, ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటిస్తామనీ అనేక వాగ్దానాలు గుమ్మరించారు. బస్తర్‌లో ఉన్న విలువైన సంపదలను కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాను నింపుకోవచ్చనే తమ దురుద్దేశ్యాన్ని తెరమరుగు చేస్తున్నారు. అందుకే వాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనైనా సరే బస్తర్‌ను ఛత్తీస్‌గఢ్‌లో భాగంగానే ఉంచాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. బస్తర్ లేకుండా ఛత్తీస్‌గఢ్ ఎలా ఉంటుందని కూడా ప్రశ్నిస్తూ నంగనాచి కబుర్లు చెబుతున్నారు.

ఛత్తీస్‌గఢ్ ఏర్పాటు తర్వాత కూడా బస్తర్ ప్రజలను మోసగించే విధానాలు ఎడతెగకుండా అమలవుతున్నాయి. వాళ్లపై దోపిడీపీడనలు మరింత పెరిగిపోయాయి. మధ్యప్రదేశ్‌లో కన్నా ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ ద్వారా బస్తర్ బాగా అభివృద్ధి చెందగలదని పాలకవర్గాలు పలికిన పలుకులన్నీ బూటకమని ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా తెల్సిపోయింది. ఈ మూడేళ్ల పాలనలో ఇక్కడి నుండి వేల కోట్ల రూపాయల సంపదలను తరలించారు. దళారీ పెట్టుబడిదార్లూ, సామ్రాజ్యవాదులూ బస్తర్‌లోని అపార సంపదలను దోచుకోవడంలో మునిగిపోయారు. బస్తర్‌లో పెరుగుతున్న విప్లవోద్యమాన్నీ, ప్రజలలో పెరుగుతున్న చైతన్యాన్నీ దృష్టిలో పెట్టుకొని వీలైనంత త్వరగా బస్తర్ సంపదలను కొల్లగొట్టాలని చూస్తున్నారు. కానీ బస్తర్‌లో దోచుకున్న సంపదలలో ఒక్క శాతం కూడా బస్తర్ అభివృద్ధి కోసం ఖర్చు చేయడం లేదు. భూస్వామ్య, దళారీ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడీపీడనల మూలంగా బస్తర్ ప్రజలు దుర్భర దారిద్ర్యంతో, ప్రాథమిక సౌకర్యాల లేమితో బతుకులీడుస్తున్నారు.

> *... మధ్యప్రదేశ్‌లో కన్నా ప్రత్యేక ఛత్తీస్‌గఢ్ ద్వారా బస్తర్ బాగా అభివృద్ధి చెందగలదని పాలకవర్గాలు పలికిన పలుకులన్నీ బూటకమని ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా తెల్సిపోయింది ...*

చిన్న రాష్ట్రం ఏర్పాటు మూలంగా పరిపాలనాపరంగా సౌకర్యానికన్నా బస్తర్ విషయంలో మాత్రం మరింత దోచుకోవడానికే ఇది ఉపయోగపడింది. బస్తర్ ప్రజల మౌలిక సమస్యల మాట అటుంచి కనీస సమస్యలు కూడా నెరవేరలేదు. బస్తర్‌లో కరువు, నిరుద్యోగం మొదలైన సమస్యలు మరింత తీవ్ర రూపం దాల్చాయి. ఇక్కడి ముఖ్య సమస్యలలో ఒకటైన నీటిపారుదల వ్యవస్థలో అభివృద్ధి ఏమీ జరుగలేదు. విద్య, ఆరోగ్యం వంటి కనీస అవసరాలు కూడా ఈ మూడేళ్లలో పెద్దగా నెరవేరలేదు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటు జరిగినప్పటికీ మునుపటి స్థితిలో పెద్ద మార్పేమీ రాలేదు. మంత్రులూ, ఎమ్మెల్యేలూ చేసే బూటకపు అభివృద్ధి ప్రచారాన్ని పక్కకు పెడితే ఆచరణలో జరిగిన అభివృద్ధి మాత్రం ఏమీ లేదు. ప్రభుత్వం ప్రకటించిన అభివృద్ధి పథకాల ద్వారా, కోట్లాది రూపాయల భారీ ప్రాజెక్టుల ద్వారా, ప్రభుత్వం అమలు చేసిన బూటకపు సంస్కరణ కార్యక్రమాల ద్వారా నిజానికి లాభపడింది రాజకీయ నాయకులూ, మంత్రులూ, అధికార్లూ, కాంట్రాక్టర్లే. బస్తర్‌లో సాధారణ ప్రజల జీవితంలో జరిగిన అభివృద్ధేమీ లేదు. బస్తర్‌లో ఉన్న 28 లక్షల జనాభాలో నూటికి 90 మంది ఇప్పటికీ కూడు, గుడ్డ, నీడ వంటి ప్రాథమిక అవసరాలు తీరక బతుకుల్ని నెట్టుకొస్తున్నారు. విద్యార్థుల, ఉద్యోగుల, కార్మికుల, మహిళల సమస్యలలో తగ్గుదల ఏమీ లేదు. పని, జీతం, భద్రత వంటి వీళ్ల ముఖ్య సమస్యలు ఇప్పటికీ తీరలేదు. విద్యా ఉద్యోగుల సమస్యలు దినదినం తీవ్రంగా పరిణమిస్తున్నాయి. గిట్టుబాటు ధరలు, బ్యాంకుల నుండి అప్పులు, విత్తనాలు, పురుగు మందులు వంటి సమస్యలు రైతులను పట్టి పీడిస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కాంగ్రెస్

పాలించిన ఈ మూడేళ్లలో బస్తర్ ప్రజల సమస్య ఒక్కటి కూడా పరిష్కారం కాలేదు; పైగా అవి తీవ్ర రూపం దాల్చాయి.

బస్తర్‌కు ప్రత్యేక అధికారాలు, ప్రత్యేక కేటాయింపులు, అటవీ ఉత్పత్తులపైనా ఖనిజాలపైనా హక్కు వంటి వాగ్దానాలు బస్తర్ ప్రజలను మోసగించడం కోసం చేసినవే తప్ప అమలు చేయడానికి మాత్రం కావు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యకలాపాలతో బస్తర్ ప్రజల అస్తిత్వమే ప్రమాదంలో పడుతోంది. బాగా ప్రచారం చేసిన గ్రామ పంచాయితీ వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిపోయింది. వనధన సమితులు ప్రభుత్వ జేబుసంస్థలుగా మారాయి. బస్తర్‌లోని ఇనుప ఖనిజం, బాక్సైట్, కోరండం మొదలైన విలువైన ఖనిజ సంపదలను సామ్రాజ్యవాదులకు కట్టబెట్టే ప్రక్రియ చాలా వేగంగా కొనసాగుతున్నది. ఇంతే కాకుండా, జోగి ప్రభుత్వం బస్తర్‌లో టూరిజం పరిశ్రమకు బాగా ప్రోత్సాహాన్నిస్తున్నది. నగర్నార్ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా అక్కడ స్టీలు ప్లాంటు స్థాపిస్తున్నది. రావ్‌ఘాట్ రైల్వేలైనును నిరుద్యోగ సమస్యకు ఏకైక పరిష్కారంగా చూపుతూ ప్రచారం చేస్తున్నది. నిజానికి ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలన్నింటితోనూ బస్తర్ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవనంపై పాలక వర్గాల, సామ్రాజ్యవాదుల దాడి రోజురోజుకూ పెరిగిపోతున్నది.

ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మొట్టమొదటి సారి విధానసభకు ఎన్నికలు జరుగబోతున్నాయి. రాజకీయ పార్టీల నాయకులు మరోసారి బస్తర్ అభివృద్ధి అంటూ పాచిపాటే పాడుతూ బస్తర్ ప్రజల ముందుకు వస్తున్నారు. బూటకపు వాగ్దానాలతో ప్రజలను మోసగించి అధికారం చేజిక్కించుకోవడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం కూడా తన పరిపాలనా వ్యవస్థను ఉపయోగించి అనేక ప్రకటనలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. ఈ రాజకీయ పార్టీల బూటకపు ప్రచారానికి బస్తర్ ప్రజలు మోసపోరాదు.

ప్రత్యేక బస్తర్ రాష్ట్ర డిమాండును ఎస్ఎఎఫ్, సిఆర్‌పిఎఫ్, తదితర బలగాలతో అణచివేసే కుట్ర జరుగుతోంది. ప్రజల ప్రజాస్వామిక హక్కులన్నింటినీ క్రూరంగా అణచివేస్తున్నారు. ప్రజలపై నిర్బంధాన్ని అమలు చేస్తున్న దోపిడీ వర్గాల పార్టీలే ఇప్పుడు ఓట్ల పేరుతో ప్రజల ముందుకు వస్తున్నాయి. అందుకే బస్తర్ ప్రజలు తమ డిమాండ్ పూర్తి కానంత వరకు ఓట్లు వేయమని చెప్పి దృఢంగా బహిష్కరించాలి. ఓట్లడుగ వచ్చేవాళ్లకు తగిన బుద్ధి చెప్పాలి. వాళ్ల అవకాశవాద దోపిడీ రాజకీయాల్ని ఎండగట్టాలి. ప్రత్యేక బస్తర్ రాష్ట్ర డిమాండును వ్యతిరేకించే నాయకులను తన్ని తరిమేయాలి. బస్తర్ నేతలమని చెప్పుకుంటూ బస్తర్ ప్రజలకు ద్రోహం చేసి బస్తర్‌ను ఛత్తీస్‌గఢ్‌లో విలీనం చేసి అధికారంలో భాగస్వాములైన వాళ్లను ఊళ్లల్లో అడుగు పెట్టనివ్వొద్దు. ప్రజా ప్రతిఘటనతో ప్రభుత్వ బలగాలను ఎదిరించాలి. మన డిమాండును పోరాడి సాధించుకోవాలి.

ఛత్తీస్‌గఢ్, బస్తర్‌ల మధ్య రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, భాషా సంబంధమైన విషయాలలో సారూప్యత ఉందని పాలకవర్గాలు చేస్తున్న ప్రచారంలో నిజం లేదు. బస్తర్‌ను ఛత్తీస్‌గఢ్‌లో భాగమని చెప్పడం చరిత్రను వక్రీకరించడమే అవుతుంది. వీరోచిత పోరాటాలతో, త్యాగ సాంప్రదాయాలతో కూడిన బస్తర్ ప్రజల చరిత్రను తోసిరాజనడమే అవుతుంది. చరిత్రలో బస్తర్ ఎప్పుడూ ఛత్తీస్‌గఢ్‌లో భాగంగా లేదు. బస్తర్ ప్రజలు ప్రత్యేకమైన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల మధ్య అభివృద్ధి చెందారు. ఈ పరిస్థితులు ఛత్తీస్‌గఢీ ప్రజల పరిస్థితులకు భిన్నమైనవి కూడా.

బస్తర్‌లో అపార సంపదలూ, సమృద్ధమైన ఆర్థిక వనరులూ, ప్రత్యేకమైన భూభాగం, విశిష్టమైన జన సముదాయాలు, వినూత్నమైన సంస్కృతి నెలకొని ఉన్నాయి. ఇది ఒక ప్రత్యేక రాష్ట్రంగా మన గలిగిన ప్రాంతం. మణిపూర్, త్రిపుర, గోవా వంటి చిన్న రాష్ట్రాలతో పోలిస్తే దేనిలోనూ బస్తర్ వెనుకబడి లేదు. ఒక ప్రత్యేక రాష్ట్రంగా మనగలగడానికి అవసరమైనవి అన్నీ ఉన్నాయిక్కడ. అందువల్ల ప్రత్యేక రాష్ట్రం సాధించుకోవడం వల్ల బస్తర్ ప్రజలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందగల అవకాశాలు మెరుగవుతాయి. దీనితో బస్తర్ ప్రజలకు తమ సంపదలపై హక్కు లభిస్తుంది. ఈ డిమాండ్ న్యాయమైనదీ – ఆచరణయోగ్యమైనదీ కూడా.

పై డిమాండును సాధించుకోవడం కోసం విశాల బస్తర్ ప్రజానీకం ఒక ఉమ్మడి వేదికలో సంఘటితం కావాల్సి ఉంది. బస్తర్ అంతటా ప్రత్యేక బస్తర్ డిమాండును ప్రచారం చేయాలి. ఈ డిమాండ్‌పై కలిసి రాగల శక్తులన్నింటినీ కూడగట్టాలి. బస్తర్‌లోని కార్మిక-కర్షకులనూ, విద్యార్థి-మేధావులనూ, ఉద్యోగులనూ సమీకరించి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం విశాల పునాదిపై పోరాటాన్ని కొనసాగించాలి. ఈ సందర్భంగా బూర్జువా రాజకీయ నాయకుల ద్రోహానికి బలికాకుండా బస్తర్ ప్రజలు తమ స్వాతంత్ర్యేచ్ఛనూ, పోరాటశీల వారసత్వాన్నీ నిలబెట్టుకోవాలి. ఈ క్రమంలో ఎస్ఎఎఫ్, సిఆర్‌పిఎఫ్ తదితర పాశవిక సాయుధ బలగాలు అమలు చేసే నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రతిఘటనను పెంపొందించాలి. పాలకవర్గాల కుట్రలను భగ్నం చేస్తూ ప్రత్యేక బస్తర్ రాష్ట్రాన్ని సాధించి బస్తర్ ప్రజ తమ ఆకాంక్షను నెరవేర్చుకోగలదని ఆశిద్దాం. ✪

*శ్రద్ధాంజలి*

## ప్రజాసంగ కార్యకర్త కామ్రేడ్ తాతి సోములుకు విప్లవ జోహార్లు!

పశ్చిమ బస్తర్ డివిజన్ గంగలూర్ ఎల్‌జిఎస్ పరిధిలోని తుమ్మనార్ గ్రామం విప్లవోద్యమానికి పట్టుగొమ్మలుగా నిలిచిన వందలాది గ్రామాలలో ఒకటి. ఈ గ్రామంలోని ఎక్కువ మంది ప్రజలు వివిధ ప్రజాసంఘాలలో సంఘటితమయ్యారు. ఈ గ్రామ ప్రజల ముద్దుబిడ్డే తాతి సోములు. కామ్రేడ్ తాతి సోములు మొదటి నుండి గెరిల్లా దళంతో సంబంధంలో ఉంటూ పార్టీ అప్పగించిన ప్రతి పనినీ తప్పక నెరవేరుస్తూ ఉండేవాడు. విప్లవ రాజకీయాలతో ఆయన ప్రభావితుడయ్యాడు. గ్రామంలో డికెఎంఎస్‌లో చేరి, తర్వాత దాని కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికై చురుగ్గా పని చేశాడు. గ్రామంలో ప్రజాసంఘాల నాయకత్వంలో జరిగే సమిష్టి, సహకార పనులన్నింటిలో అతడు ముందుపీఠిన నిల్చేవాడు. ఫిబ్రవరి 28 న అకస్మాత్తుగా అనారోగ్యం పాలు కావడంతో ఆయన అమరుడైనాడు. ఆయన మరణంతో పశ్చిమ బస్తర్ డివిజన్ విప్లవోద్యమం ఒక అంకితభావం గల కార్యకర్తను కోల్పోయింది. ఆయన కనుమూసిన తర్వాత గ్రామ ప్రజలంతా మృతదేహంపై ఎర్రజెండా కప్పి విప్లవకర సాంప్రదాయాలకు అనుగుణంగా అంత్యక్రియలు జరిపారు. కామ్రేడ్ తాతి సోములుకు విప్లవ జోహార్లర్పిద్దాం - ఆయన కలలు గన్న సమసమాజాన్ని స్థాపించడానికి శక్తివంచన లేకుండా పాటు పడదాం. ✪

# ప్రజా పోరాటాలపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ నిర్బంధకాండ

కొత్తగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పాటు కావడంతో తమ సమస్యలు ఎన్నో పరిష్కారం అవుతాయని ప్రజలు ఆశించారు. ముఖ్యంగా యువతీయువకులు నిరుద్యోగ సమస్య రూపుమాసిపోతుందని ఊహించారు. ఛత్తీస్‌గఢ్‌లోని విలువైన వనరుల్ని ఉపయోగించుకొని రాష్ట్రం అభివృద్ధిపథంలో ముందుకుపోతుందని ప్రజలు భావించారు. కానీ మూడేళ్లు కూడా నిండకుండానే తమ ఆశలన్నీ అడియాసలేనని ప్రజలు గ్రహించారు. తనకు తాను ఆదివాసీగా చెప్పుకునే ముఖ్యమంత్రి అజీత్‌జోగి పాలనలో తమ మౌలిక సమస్యలలో ఏ ఒక్కటీ పరిష్కారం కాదని ప్రజలకు తేటతెల్లమైంది.

మధ్యప్రదేశ్ ప్రభుత్వం మొదలు పెట్టిన నూతన ఆర్థిక విధానాలు, నూతన రాష్ట్రం ఏర్పాటు తర్వాత గతంతో పోలిస్తే వేగంగానూ, విస్తృతంగానూ అమలవుతున్నాయి. ఈ మూడేళ్ల కాలంలో పలు బహుళజాతి కార్పొరేషన్లతో రాష్ట్ర ప్రభుత్వం అనేక ఒప్పందాలు కుదుర్చుకుంది. దల్లీ-రాజహరా, కువ్వేమారి, బైలాడిల్లా గనులను ప్రైవేట్‌పరం చేయాలనీ, విశాఖ టన్నెల్ ప్రాజెక్టును నిర్మించాలనీ, నగర్నార్ స్టీలు ప్లాంటు, బోధ్‌ఘాట్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం మొదలైనవి పూర్తి చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. రోడ్లను ప్రైవేటుపరం చేస్తున్నది. వీటన్నింటి కోసం ఆదివాసులను వారి భూముల నుండి బేదఖలు చేయడానికీ, పర్యావరణానికి నష్టం కలిగించడానికీ కూడా సిద్ధపడుతోంది. ప్రజా సంక్షేమ కార్యక్రమాల నుండి క్రమంగా వైదొలుగుతున్నది. పరిశ్రమలనే కాదు, ఆఖరుకు నదీ జలాలను కూడా ప్రైవేటుపరం చేస్తున్నది.

వీటి ఫలితంగా బాల్కో, ఎస్ఇసిఎల్, ఆర్‌టిసి తదితర సంస్థలకు చెందిన వేలాది మంది కార్మికులు వీధిన పడ్డారు. ప్రజానీకం నీటిని కూడా కొనుక్కొని తాగాల్సిన దుస్థితిలో ఉంది. పాలకులు ప్రైవేటీకరణ విధానాలతో ఇక్కడి ఖనిజ సంపదలనూ, సహజ వనరులనూ సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గత మూడు సంవత్సరాలుగా కరువు కోరల్లో చిక్కుకుపోయింది. 'ధాన్ కా కటోరా'గా పేరుగాంచిన ఈ రాష్ట్రంలోని రైతులకు పొట్ట చేతబట్టుకొని దూరతీరాలకు వలసపోక తప్పడం లేదు. తరచుగా పెరుగుతున్న ధరలతో నిత్యావసరాలు తీర్చుకోలేని పేద రైతాంగం తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించకపోవడంతో తీవ్ర సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి స్థితిలో ప్రజల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోని కాంగ్రెస్, బిజెపి తదితర పాలకవర్గ పార్టీలు ఎన్నికల్లో గెలవడానికి తీవ్రంగా పోటీ పడుతున్నాయి.

సామ్రాజ్యవాద ప్రపంచీకరణలో భాగమైన నూతన ఆర్థిక విధానాలు ఉద్యమ ప్రాంతాల్లో కూడా వేగంగా అమలవుతున్నాయి. నిజానికి ఈనాడు దేశంలోని ఆదివాసీ ప్రాంతాలన్నీ ఈ దాడిని తీవ్రంగా ఎదుర్కోవల్సి వస్తున్నది. అపారమైన సహజ వనరులకు నిలయమైన అనేక ఆదివాసీ ప్రాంతాలు సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదార్ల పెట్టుబడులకు లక్ష్యాలుగా ఉన్నాయి. ఇక్కడి జల వనరులనూ, భూగర్భ నిక్షేపాలనూ, అటవీ సంపదనూ కొల్లగొట్టడంలో భాగంగా వారు ప్రభుత్వంతో అనేక ఒప్పందాలు చేసుకుంటున్నారు. తమ పెట్టుబడులను ఈ ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరోవైపు ఇక్కడి అందమైన ప్రకృతి దృశ్యాలనూ, సాంప్రదాయ కళలనూ మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ ఆదివాసీ గూడాలను ఖాళీ చేయిస్తూ జాతీయపార్కులనూ, వన్యమృగ సంరక్షణా కేంద్రాలనూ నిర్మిస్తున్నారు. ప్రజల జీవితాలను పర్యాటకుల డాలర్లకు బలిపెడుతున్నారు. టూరిజాన్ని అభివృద్ధిపర్చి డాలర్లను సంపాదించాలని ప్రభుత్వం కలలు కంటుందే తప్ప దానితో ఎదురయ్యే విపరీత పరిణామాలతో దానికి పనిలేదు. ప్రజలు నిరాశ్రయులు కావడం, వేశ్యావృత్తి పెచ్చుపెరిగిపోవడం, విశృంఖల సామ్రాజ్యవాద సంస్కృతి చొరబాటు ఫలితంగా ప్రజా సంస్కృతి దెబ్బతినడం లాంటివెన్నో సమస్యలు ముందుకు వస్తాయి. సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం మౌలిక సదుపాయాలపై రాష్ట్ర ప్రభుత్వం విపరీతంగా ప్రజాధనం వెచ్చిస్తూ రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నది. పైగా వీటినే అభివృద్ధి పథకాలంటూ గొప్పగా ప్రచారం చేస్తున్నది. వీటన్నిటి ఫలితంగా ప్రజల జీవితాలు అస్తవ్యస్తమవుతాయి. వారి జీవితావసరాలన్నింటినీ మార్కెట్ ప్రభావితం చేస్తుంది. వారి సాంస్కృతిక జీవనంపై దుర్మార్గమైన దాడి జరుగుతుంది. ప్రపంచీకరణలో భాగంగా ముమ్మరమవుతున్న నూతన ఆర్థిక విధానాల చెడు ఫలితాలు ఇలా ఉన్నాయి. ఇంకొక వైపు రాజ్య హింసను ఆసరా చేసుకొని హిందూ ఫాసిజం, క్రైస్తవం ఆదివాసులను మతమార్పిడి చేయడంలో పోటీ పడుతున్నాయి.

పైన వివరించినట్టు రాష్ట్ర ప్రజలు తీవ్రమైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. అన్ని సెక్షన్ల ప్రజలు తమ మౌలిక సమస్యల పరిష్కారం కొరకు పోరాడుతున్నారు. ఇక్కడ దండకారణ్యంలో మన పార్టీ పీపుల్స్‌వార్ నాయకత్వంలోనూ, అట్లాగే రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో ప్రజలు విడిగా కూడా పోరాడుతున్నారు. గడచిన 33 నెలల కాలంలో ప్రజా పోరాటాల పరిస్థితి ఏ విధంగా ఉందో కింద వివరంగా చూద్దాం.

నవంబర్ 1, 2000 నాడు మధ్యప్రదేశ్ నుండి విడిపోయి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడింది. ఇందులో బస్తర్‌ను బలవంతంగా కలుపుకున్నారు. ఆ తర్వాత కూడా బస్తర్ ప్రజల వీరోచిత పోరాట వారసత్వాన్ని దెబ్బతీయడానికి పాలకవర్గాలు బస్తర్‌ను మొదట మూడు, ఆ తర్వాత రెండు – మొత్తం ఐదు జిల్లాలుగా విభజించారు. బస్తర్‌ను ఛత్తీస్‌గఢ్‌లో కలపడాన్ని వ్యతిరేకిస్తూ వేలాది మంది బస్తర్ ప్రజలు బ్లాక్, తాలూకా కేంద్రాలన్నింటిలో ఊరేగింపులూ, సభలూ జరిపారు. అయినప్పటికీ బస్తర్ ప్రజల అభిప్రాయాలను లెక్కచేయకుండా జోగి ప్రభుత్వం బస్తర్‌ను బలవంతంగా ఛత్తీస్‌గఢ్‌లో కలిపి ఉంచింది. అలాగే బస్తర్‌ను ఐదు జిల్లాలుగా విడగొట్టింది. ఈనాటికీ ప్రజలు ప్రతి సంవత్సరం నవంబర్ 1న బంద్ జరుపుతూ, నిరసన తెలుపుతూ ప్రత్యేక బస్తర్ డిమాండ్‌ను ముందుకు తెస్తూనే ఉన్నారు. వీటిని విఫలం చేసేందుకు ప్రభుత్వం సాయుధ బలగాల్ని మోహరించి ప్రజలపై దాడులకు పాల్పడుతున్నది.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఏర్పడిన కొద్ది రోజులకే రాష్ట్ర ప్రభుత్వం రైతులపై దాడితో తన నిర్బంధ కార్యకలాపాలను ప్రారంభించిందని చెప్పుకోవచ్చు.

రాయ్‌పూర్‌కు సమీపంలోని లాఖోలిలో రైతులు వర్షాలు లేక ఎండిపోతున్న తమ పంటపొలాలకు గంగ్రేల్ ప్రాజెక్టు నుండి నీరు వదలాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన జరపగా ప్రభుత్వం పోలీసులను దింపి లాఠీచార్జ్ చేయించింది. రైతుల డిమాండ్‌ను పెడచెవిన బెట్టి పంటపొలాలకు నీళ్లొదలకుండా భిలాయ్ స్టీలు ప్లాంటుకే నీళ్లందించి జోగీ తన రైతు వ్యతిరేక స్వభావాన్ని చాటుకున్నాడు.

2000లో హీరానార్‌లో స్టీలుప్లాంటు ఏర్పాటు చేయడం కోసం అక్కడికి దగ్గర్లోని 10 గ్రామాల ప్రజలను వెళ్లగొట్టి వాళ్ల భూముల్ని కాజేయాలని ప్రభుత్వం తలపెట్టింది. దీనికి వ్యతిరేకంగా నిలబడ్డ ప్రజలపై పోలీసులు దాడి చేశారు. అయినా ప్రజలు చెక్కుచెదరకుండా నిలబడి దృఢంగా వ్యతిరేకించడంతో ప్రభుత్వం ప్లాంటును నగర్నార్‌కు తరలించింది. అయితే ఇక్కడ కూడా ప్రజలు ఈ ప్లాంటు నిర్మాణాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. పోలీసు బలగాలు ప్రజలపై తీవ్రమైన దాడులకు పాల్పడి ఆఖరుకు వృద్ధులూ, పిల్లలూ అని కూడా చూడకుండా విపరీతంగా కొట్టి అనేక మందిని జైలుపాలు చేశాయి. చాలా మంది విద్యార్థుల్ని కూడా అరెస్టు చేసి జైల్లో నిర్బంధించిన కారణంగా వాళ్లు పరీక్షలు రాయలేకపోయారు. నగర్నార్ ప్రాంత ప్రజలను పక్కదారి పట్టించడానికి ప్రభుత్వం పలు బూటకపు సంస్కరణ కార్యక్రమాలు కూడా అమలు చేసింది. అయితే భూములు కోల్పోవడమన్న వాళ్ల ముఖ్య సమస్య మాత్రం పరిష్కారం కాకుండా ఇప్పటికీ అట్లాగే మిగిలిపోయింది.

నగర్నార్ స్టీలు ప్లాంటు కోసం కరెంటూ, నీళ్లూ అందించడానికి గాను బోధ్‌ఘాట్ ప్రాజెక్టు నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బోధ్‌ఘాట్ ప్రాజెక్టు పూర్తయితే దాదాపు 50 గ్రామాలు ముంపుకు గురవుతాయి. వందలాది ఎకరాల అటవీభూములు నాశనమవుతాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా గతంలో మన పార్టీ నాయకత్వంలో ప్రజలు పోరాడారు. ప్రజా ప్రతిఘటనతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. అయితే ఇప్పుడది నిర్బంధంగా పూర్తి చేయడానికి సిద్ధమైంది. ప్రజలకు జరిగే నష్టాల సంగతి దానికెందుకు?

గతంలో బిజెపి ప్రభుత్వం రావ్‌ఘాట్‌లో గనులు ప్రారంభించడం కోసం ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని అమలు చేసింది. ఈ గనులు ప్రారంభమైతే దాదాపు 30 గ్రామాలు ఖాళీ చేయాల్సి ఉంటుంది. వందలాది ఎకరాల అడవులు నాశనమవుతాయి. ఇక్కడ ప్రవహించే చిన్నాపెద్దా నదులన్నీ కలుషితమవుతాయి. దీనితో దూరంలోని గ్రామాలపై కూడా దుష్ప్రభావం పడుతుంది. అందుకే రావ్‌ఘాట్ ఖదాన్ విరోధీ కమిటీ నాయకత్వంలో ప్రజలు అనేక ర్యాలీలూ, సభలూ జరిపారు. రావ్‌ఘాట్ కొండపైకి తెచ్చిన యంత్రాలను తగులబెట్టారు. ప్రజల తీవ్ర ప్రతిఘటనను అణచడానికి గనికి సమీపాన 70 మంది ఎస్ఏఎఫ్ జవాన్లతో ప్రత్యేక క్యాంపును కూడా ఏర్పాటు చేశారు. ఇప్పుడు జోగి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనైనా రావ్‌ఘాట్ గనుల్ని ప్రారంభించాలని సంకల్పించింది. దల్లీ-రాజహరా, రావ్‌ఘాట్‌ల మీదుగా బైలడిల్లా వరకు రైల్వేలైను ప్రతిపాదన కూడా ప్రభుత్వం తెస్తున్నది. దీన్ని బస్తర్ అభివృద్ధికి మూలమంత్రంగా ఆకాశానికెత్తుతున్నారు. అయితే దీనితో ఇక్కడి ప్రజలకొరిగేదేమీ లేదు, పైగా వాళ్లు తమ పొలాలనూ, ఇల్లూవాకిళ్లనూ కోల్పోవల్సివస్తుంది. అయితే బహుళజాతి కంపెనీల ప్రయోజనాలే పరమావధిగా పెట్టుకున్న జోగి ప్రభుత్వానికి ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులతో పనేమిటి?

గత జూలై నెలలో శిక్షా గారంటీ గురూజీలు 'రాజీవ్‌గాంధీ శిక్షా మిషన్‌ను నిలిపివేయొద్ద'న్న తమ ఏకైక డిమాండ్‌తో సమ్మె చేశారు. కానీ ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్లైనా లేదు. ఆగస్టు 5 నుండి రాష్ట్రంలోని 28 వేల మంది విద్యా ఉద్యోగులు (శిక్షాకర్మీలు) 'సమాన పని - సమాన వేతనం' అన్న తమ డిమాండ్‌తో రాష్ట్రమంతటా నిరాహారదీక్ష ప్రారంభించారు. వందలాది ఉద్యోగులు ఆమరణ నిరాహారదీక్ష కూడా ప్రారంభించారు. వీరిలో అనేక మంది ఆరోగ్యం క్షీణించిపోయింది. పోలీసులు వీరిని బలవంతంగా ఎత్తుకొని పోయి ఆసుపత్రులలో చేర్పించారు. విద్యా ఉద్యోగుల సమ్మెకు అన్ని పార్టీల వాళ్లూ, అన్ని సెక్షన్ల ప్రజలూ తమ మద్దతును తెలిపారు. విద్యా ఉద్యోగులు గత సంవత్సరం కూడా ఇదే డిమాండ్‌పై సమ్మె చేశారు. పోయిన సంవత్సరం రాయపూర్‌లో ధర్నా చేస్తున్న విద్యా ఉద్యోగులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. అయినప్పటికీ వాళ్లు తమ ఆందోళనను కొనసాగించారు. జోగి వాళ్ల దగ్గరికి వచ్చి వాళ్ల డిమాండ్లను పరిశీలిస్తానని వాగ్దానం చేసి ఆందోళనను విరమించేలా చేశాడు. కానీ సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ఈ సంవత్సరం కూడా వాళ్లు సమ్మెకు పూనుకోవల్సి వచ్చింది. విద్యారంగంలో బహుళజాతి కంపెనీ ప్రవేశానికి జోగి ఏర్పాట్లు చేస్తున్నాడు. విద్యను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే రెగ్యులర్ ఉపాధ్యాయుల నియామకం చేయకుండా ఎప్పుడుపడితే అప్పుడు తీసేయడానికి వీలుగా తాత్కాలిక టీచర్లను నియమించే పద్ధతిని అనుసరిస్తున్నాడు.



దుష్ట థానేదారు అమృత్ కెర్కెట్టను శిక్షించాలని కోరుతో నారాయణపూర్‌లో ప్రజా ప్రదర్శన

పెరుగుతున్న విప్లవోద్యమాన్నీ, ప్రజల చైతన్యాన్నీ అణచడానికి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం నారాయణ్‌పూర్, బీజాపూర్‌లను పోలీసు జిల్లాలుగా ప్రకటించింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా బీజాపూర్‌లో వేలాది మంది ప్రదర్శన జరిపారు. నారాయణ్‌పూర్‌లో ర్యాలీ కోసం కదిలిన వేలాది ఆదివాసులను పోలీసులు బెదిరించి చెల్లాచెదురు చేశారు. ర్యాలీకి ఒకరోజు ముందు పోలీసులు రాత్రి సమయంలో ఏకపక్షంగా కాల్పులు జరిపి యుద్ధ వాతావరణాన్ని నెలకొల్పారు. ర్యాలీలను అడ్డుకొని ప్రజల ప్రజాస్వామిక హక్కుల్ని నేలరాయాలనే దుష్ట తలంపుతోనే పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారు. అయినప్పటికీ ప్రజలు ర్యాలీని నిర్వహించారు. పోలీసు జిల్లా ఏర్పాటుకు తమ నిరసన తెలిపారు. అట్లాగే మాడ్ డివిజన్‌లోని సోన్‌పూర్ గ్రామంలో పోలీసు స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ దాదాపు 3,000 మంది ర్యాలీ తీశారు.

విద్యా, వైద్య రంగాలలో నెలకొన్ని సమస్యలపై ఉత్తర బస్తర్, మాడ్ డివిజన్లలో ప్రజలు ఆగస్టు 2002లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సమస్యలపై ఏర్పడిన ఐక్య కార్యాచరణ సమితి నాయకత్వంలో 25 వేల మంది ప్రజలు నారాయణ్‌పూర్‌లో ప్రదర్శన జరిపారు. ఓర్చాలో కూడా వేలాది మంది ప్రజలు ర్యాలీ తీసి తమ సమస్యల్ని పరిష్కరించాలని అధికార్లను డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలలో విద్యార్థులూ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కానీ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం పట్ల ఏ మాత్రం శ్రద్ధ కనబర్చలేదు.

2001లో దక్షిణ-పశ్చిమ బస్తర్ డివిజన్లలో విద్యార్థుల సమస్యలపై వేలాది విద్యార్థులూ, వారి తల్లిదండ్రులూ తాలూకా, బ్లాక్ కేంద్రాలలో ర్యాలీలు జరిపారు. 2002లో కరువుతో సతమతమవుతున్న ప్రజలు ఈ కరువుకు పాలకుల నిర్లక్ష్యమే కారణమని అంటూ అనేక చోట్ల ప్రదర్శనలు జరిపారు. దక్షిణ బస్తర్ ప్రజలు పొరుగున ఉన్న ఆంధ్ర గ్రామాలలో కొందరు భూస్వాములపై కరువుదాడులు చేసి ధాన్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఆంధ్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న గ్రామాల ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. గొల్లపల్లి, కిష్టారం మొదలైన సంతలను బలవంతంగా బంద్ పెట్టించి ప్రజలకు నిత్యావసర వస్తువులు దొరకకుండా చేశారు. దీనికి వ్యతిరేకంగా సంతల్ని మళ్లీ ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 31, 2002 నాడు సీతానగరం సంతలో ప్రదర్శన నిర్వహిస్తున్న 2,000 మంది ప్రజలపై ఆంధ్ర పోలీసులు విచ్చలవిడిగా జరిపిన కాల్పుల్లో ఒక యువతి ప్రాణాలు కోల్పోగా మరెందరో గాయపడ్డారు.

పోయిన సంవత్సరం ప్రజలు దోపిడీ ప్రభుత్వ అంగాలలో పని చేస్తున్న సర్పంచ్, సచివ్‌లపై వత్తిడి తెచ్చి రాజీనామాలు చేయించారు. వీళ్లెవ్వరూ ప్రజల కోసం పని చేయడం లేదు. దీనితో తన పాలనా వ్యవస్థలు పునాదులు కదిలిపోవడంతో పాలకవర్గాలు హడలిపోయాయి. ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి వందలాది మంది ప్రజలను అరెస్టు చేయించి జైళ్లల్లో పడవేసింది.

పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో ఉధృతంగా సాగుతున్న ప్రజా పోరాటాలైనా కానివ్వండి, లేదా జోగి ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగా వివిధ సెక్షన్ల ప్రజలలో పెల్లుబుకుతున్న పోరాటాలైనా కానివ్వండి, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం వాటిని అణచివేసే విధానాన్నే అనుసరిస్తూ వస్తున్న విషయం రాష్ట్రం ఏర్పాటు తర్వాత గడచిన రెండున్నర సంవత్సరాల అనుభవం ద్వారా స్పష్టమవుతున్నది. విద్యా ఉద్యోగులు రెండు సార్లు పెద్ద ఎత్తున జరిపిన ఆందోళన పట్ల ప్రభుత్వం మొండి వైఖరినే చేపట్టింది. విద్యా ఉద్యోగులను మూడు రోజులలోగా పనిలోకి రాకపోతే ఉద్యోగం లోంచి తొలగిస్తానని హెచ్చరిక కూడా చేసింది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సమ్మె హక్కు వంటి కనీస ప్రజాస్వామిక హక్కును కూడా కాలరాచివెయ్యాలని ప్రయత్నిస్తున్నది. సామ్రాజ్యవాదం ముందర మోకరిల్లిన జోగి ప్రజా పోరాటాల్ని ఉక్కుపాదంతో అణచాలని ప్రయత్నిస్తున్నాడన్నది స్పష్టం. బహుళజాతి కంపెనీల మద్దతు లేకుండా ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందజాలదని జోగి బాహాటంగానే సెలవిస్తున్నాడు! అజీత్‌జోగి అనుసరిస్తున్న ఇలాంటి విధానాల ఫలితంగా రానున్న రోజుల్లో సామ్రాజ్యవాద దోపిడీ మరింత పెచ్చరిల్లిపోవడం ఖాయం. దీనికి వ్యతిరేకంగా పెల్లుబికే ప్రజా పోరాటాలను జోగీ ప్రభుత్వం క్రూర నిర్బంధం ద్వారా అణచివేయడానికి ప్రయత్నిస్తుందన్నది కూడా స్పష్టమే.

పైన పేర్కొన్న ప్రజా పోరాటాలలో కొన్ని మన పార్టీ - పీపుల్స్‌వార్ నాయకత్వంలో జరిగినవి కాగా, మరి కొన్ని వివిధ ప్రజా సంఘాల నాయకత్వంలో జరిగాయి. ప్రభుత్వం వీటిని అణచివెయ్యడానికి తీవ్రంగా ప్రయత్నిస్తూనే మరోవైపు కొన్ని కంటితుడుపు సంస్కరణలను కూడా అమలు చేసింది. ఉద్యమ ప్రాంతాలలో బస్తర్ ప్యాకేజి, సర్గూజ ప్యాకేజి తదితర పేర్లతో కోట్లాది రూపాయల పథకాలను ప్రకటించింది. మరోవైపు ఉద్యమాన్ని అణచివెయ్యడానికి రాష్ట్ర ప్రభుత్వం 1,450 కోట్ల యాక్షన్‌ప్లాన్‌ను కేంద్రం ఆమోదం కోసం పంపింది. కేంద్రం నుండి 2,500 సిఆర్‌పి బలగాలను రప్పించి బస్తర్‌లో మోహరించింది. ఇతర రాష్ట్రాలతో సమన్వయం ఏర్పాటు చేసుకొని దాడులను తీవ్రతరం చేస్తున్నది. నిర్బంధ క్యాంపెయిన్లను పెంచింది. ఉద్యమ ప్రాంతాలలో వందలాది మందిని అరెస్టు చేయిస్తున్నది. ప్రజల ఇండ్లు కాలబెట్టడం, మహిళలపై అత్యాచారాలు వంటి చర్యలు పోలీసులకు నిత్యకృత్యమయ్యాయి. పౌర, ప్రజాస్వామిక హక్కుల్ని ఘోరంగా కాలరాచివేస్తున్నారు. ప్రజలకు శాంతియుతంగా ప్రదర్శన జరిపే హక్కు కూడా లేకుండా చేస్తున్నారు. లాఠీచార్జ్, కాల్పులు వంటి సంఘటనలు మామూలయ్యాయి. తీవ్ర నిర్బంధం నడుమ కూడా ప్రజలు పోరాట పతాకాన్ని ఎత్తిపడుతున్నారు. నిర్బంధాన్ని గేలి చేస్తూ తమ డిమాండ్ల సాధన కోసం ప్రజలు మరింత సమరశీలంగా పోరాడడానికి సిద్ధమవుతున్నారు.

ప్రస్తుత దోపిడీ వ్యవస్థను మార్చకుండా పై సమస్యలలో ఏ ఒక్కటి కూడా పరిష్కారం కాదు. అందుకే అన్ని పీడిత వర్గాల ప్రజలు కలిసికట్టుగా, సరైన నాయకత్వంలో పోరాటాలు కొనసాగించాలి. ఈ వ్యవస్థను సమూలంగా మార్చి వేసి నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడే మన సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయి. ఈ విషయాన్ని గుర్తించి పీడిత సెక్షన్ల ప్రజలంతా సంఘటితం కావాలి. పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వాన ఈ వ్యవస్థను మార్చడానికి సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో విశాల ప్రజానీకం సంఘటితమై ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడమే నేటి ఆవశ్యకత. అప్పుడే ప్రజా ఉద్యమాలపై దోపిడీ పాలకవర్గాలు అమలు జరుపుతున్న నిర్బంధదాడిని ఎదుర్కొని ఓడించగలం — ప్రజల ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని స్థాపించగలం. ✪

# మా ఎన్నికల విజయానికి మహిళలు సాధనం కారు !
# అణచివేతతో మహిళలను పోరాటంలోకి రాకుండా అడ్డుకోలేరు !

ఏ సమాజంలోనైనా స్త్రీ-పురుషులు సమానంగానే ఉంటారు. సమాజంలో స్త్రీ-పురుషుల సమతుల్యత దెబ్బతినకుండా కాపాడడంలో ఇదొక ప్రకృతి వరంగానే చెప్పుకోవచ్చు. కానీ, వెర్రితలలు వేస్తున్న భూస్వామ్య, సామ్రాజ్యవాద సంస్కృతి ఫలితంగా ప్రస్తుత సమాజంలో పురుషులతో పోలిస్తే స్త్రీల నిష్పత్తి క్రమంగా పడిపోతున్నది. మన దేశంలో గడచిన రెండు దశాబ్దాల జనాభా లెక్కల వివరాలను అధ్యయనం చేయడం ద్వారా ఈ విషయం సులభంగానే అర్థమవుతుంది. ప్రతి వెయ్యిమంది పురుషులకు 830 మంది మాత్రమే మహిళలున్న రాష్ట్రాలు కూడా ఉన్నాయంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో తెలుసుకోవచ్చు. ముఖ్యంగా వరకట్నాల సమస్య, సమాజంలో మహిళను రెండవ శ్రేణి పౌరురాలుగా చూడడం, అత్యాచారాలు, అవమానాలు, మూఢ నమ్మకాలు లాంటి అనేక సామాజిక రుగ్మతల మూలంగా మహిళలు హత్యలకు గురవుతున్నారు. గర్భస్థ శిశు హత్యలు, శిశు హత్యలు అధిక మవుతున్నాయి. పుట్టగానే పెంటకుప్పల పైననో, మరుగు ప్రదేశాలలోనో, డ్రైనేజి కాలువల్లోనో లేదా పేవ్‌మెంట్ల పైనో రహస్యంగా వదలివేయడంతో నూరేళ్ళు నిండిపోతున్న పాపలెందరో! వీళ్ల లెక్కలు ప్రభుత్వ రికార్డుల్లో వెతికితే దొరికేవి కావు. ఇక వయసొచ్చిన మహిళల ఆత్మహత్యలు, అమ్మకాలు, అత్యాచారాలు, పెళ్లయిన స్త్రీల పై జరుగుతున్న హత్యా ప్రయత్నాలు/హత్యలెన్నో రోజూ పత్రికల్లో వెలుగు జూస్తున్నాయి. వెలుగులోకి రాకుండా పోతున్నవే అధికం. ఏ ప్రభుత్వమూ వీటిని అరికట్ట పూనుకోవడం లేదు. బ్రిటిష్‌వాడి కాలం నుండి నేటి వరకు గడచిన 150 ఏళ్ల భారత దేశ చట్టాల చరిత్రను చూస్తే స్త్రీ-పురుష సమానత్వంపై, సమస్యలపై చేసిన చట్టాలు అనేకం అగుపడుతాయి. కానీ, అవి ఈ పితృస్వామ్య వ్యవస్థలో అమలుకు నోచుకోకుండా పోతున్నాయి. ఇందుకు చట్టాలు చేస్తున్న వారూ, వారి వ్యవస్థే అసలు కారణం. దేశంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు తమ అధికారాలనూ, పదవులనూ దుర్వినియోగం చేస్తూ సాగిస్తున్న దారుణాలు కోకొల్లలు. అంజనా మిశ్రా (ఒరిస్సా) నుండి మధుమితా శుక్లా (యుపి), మికీ మెహతా (ఛత్తీస్‌గఢ్), జెనీ (ఉత్తరాఖండ్)ల దాకా ఎందరో మహిళలు పితృస్వామ్యానికి బలయ్యారు. ఇక విద్యాలయాల్లో, విశ్వవిద్యాలయాల్లో లంపెన్ విద్యార్థుల, ప్రొఫెసర్ల, ఉపాధ్యాయుల కామానికి బలవుతున్న విద్యార్థినులెందరో!



బూటకపు ఎన్నికలను బహిష్కరిస్తూ ప్రజాయుద్ధం కొనసాగిస్తామని నినదిస్తున్న బస్తర్ మహిళలు

గత దశాబ్ద కాలంగా స్త్రీలను లోబరుచుకోవడానికి పాలక వర్గాలు తీవ్రమైన ప్రయత్నాలే చేస్తున్నాయి. ఈ ప్రయత్నాలు అంతర్జాతీయంగానూ, మన దేశంలోనూ కన్పిస్తాయి. ఆడ శిశువులను కన్నవారికి ఆర్థిక సహాయం నుండి మొదలై వితంతువులకు పెన్షన్‌ల వరకూ లెక్కలేనన్ని పథకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. ఇక ప్రత్యేక మహిళా సంవత్సరం, బాలికల సంవత్సరం, ప్రత్యేక దశాబ్దం వంటివి ప్రకటించడం చాలా కాలంగా ఒక ఆనవాయితీగానే ప్రపంచవ్యాప్తంగా సాగుతూంది. ఏటేటా అంతర్జాతీయ మహిళా దినాన్ని పాటించని బూర్జువా పార్టీయే లేదంటే అతిశయోక్తి ఎంత మాత్రం కాదు. ఆ సందర్భంగా గ్రామ పంచాయితీ నుండి పార్లమెంటు వరకూ, సర్పంచ్ నుండి ప్రధాన మంత్రి వరకూ, ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు పోటీపడుతూ నిర్వహించడం పెరుగుతున్నది. ఇకపోతే రివిజనిస్టు పార్టీలైతే (సిపిఐ, సిపియం) మహిళా దినాన్ని సాధించిన ఘనత తమదేనని ఉపన్యాసాలు దంచేస్తూంటాయి. ఇంకా విచిత్రం ఏమంటే సంఘ్ ముఠాకు చెందిన సంస్థలు కూడా మహిళా దినం పాటించడంలో ముందుంటున్నాయి. కానీ, పైన పేర్కొన్న ఏ ఒక్క పార్టీ గానీ, ఏ ఒక్క సంస్థ గానీ నిజాయితీగా స్త్రీ-పురుష సమానత్వాన్ని కోరుకోవడం లేదు. వీటి ఆచరణ ఎక్కడా ఆ విధంగా ఉండడం లేదు. ఇక మతాల విషయానికి వస్తే అన్ని మతాలు బోధించే నీతి సూత్రాలలో స్త్రీ పురుషుడి అధీనంలోనే ఉండాలి. అతనికి లోబడే ఉండాలి. అతనికి సేవలు చేయాలి. ఆమె పాతివ్రత్యం పాటించాలి – మగాడికి ఇలాంటివి అక్కరే లేదంటాయి. ఇటువంటి అభిప్రాయాలతో, ఆచరణతో, నీతి బోధనలతో వారు సాధించేది స్త్రీ-పురుష సమానత్వం కాదు సరికదా స్త్రీ పతనం, పురుషుడి భోగ్యం.

మరీ ఈ మధ్య కాలంలో ‘అధికారంలో స్త్రీల భాగస్వామ్యం’, ‘స్త్రీల సశక్తీకరణ’ల గూర్చి తెగ ప్రచారం జరుగుతోంది. గ్రామ పంచాయితీ నుండి పార్లమెంట్ వరకు అధికారంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్ బలంగానే ముందుకు వస్తున్నది. ఇప్పటికి గ్రామ పంచాయితీ వ్యవస్థలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారు. పై స్థాయి చట్టసభలలో (విధానసభ - పార్లమెంటు) రిజర్వేషన్‌ను ఆమోదించడం లేదు. గత 5-6 సంవత్సరాలుగా ప్రతి పార్లమెంటు సమావేశాలలో అధికార పక్షం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టడం, దానిపై చర్చ జరగడం, చివరకు ఓటింగ్‌కైనా నోచుకోకుండా ఉపసంహరించుకోవడం అనే ప్రహసనం ప్రతి ఏడూ జరుగుతున్నది. అధికారంలో మహిళల భాగస్వామ్యం పట్ల పార్లమెంటు పురుష పుంగవులకు ఎంత నిజాయితీ ఉందో దీని ద్వారా బాగా తెలుసుకోవచ్చు. దీనిపై దేశ, రాష్ట్ర రాజధాని నగరాల్లో మళ్లీ ఆయా పార్టీల మహిళా నేతలందరూ ఖండనమండనలతో ర్యాలీలు జరపడం పీడిత మహిళల సానుభూతిని

ఓట్ల రూపంలో కొల్లగొట్టడానికేనన్నది స్పష్టం. దేశంలో ప్రగతిశీల, ప్రజాస్వామ్య, విప్లవ సంస్థలనూ, వ్యక్తులనూ ఉగ్రవాదం పేరుతో అణచడానికి గాను, ప్రపంచ ప్రజల నంబర్ వన్ శత్రువైన అమెరికా సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష నిర్దేశకత్వంలో ఫాసిస్టు పోటా చట్టాన్ని తేవడానికి పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచిన వాజ్‌పేయి ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిలున్లు ఆమోదింపజేయడానికి మాత్రం కుంటి సాకులు చెప్పడాన్ని బట్టి దానికి ఈ బిల్లు పట్ల ఎంత గౌరవం ఉందో స్పష్టమవుతోంది.

ఇకపోతే మహిళా సశక్తీకరణ కూడా ఒక పెద్ద మోసం. దేశం మొత్తం మీద లక్షలాది మంది మహిళలను స్వయం సహాయ గ్రూపుల్లోకి సమీకరిస్తున్నారు. వీరిలో అత్యధిక శాతం పేద మహిళలే. రోజంతా కష్టపడి సంపాదించిన కూలి డబ్బుల్లో నుండి కొంత భాగాన్ని వీరు పొదుపు చేయాల్సి వస్తోంది. కడుపు మాడ్చుకొని డబ్బు పొదుపు చేస్తున్న మహిళలు స్వయంసహాయక గ్రూపుల్లో నిలువుదోపిడికి గురవుతున్నారు. బ్యాంకులలో దాచుకుంటే వీరి డబ్బులకు రెట్టింపు లభిస్తుందని వీరిలో ఆశలు రేపుతున్నారు. దీనితో ఈ గ్రూపుల్లోని మహిళలు తాము కూడబెట్టిన డబ్బులన్నీ బ్యాంకులో జమ చేయడం ద్వారా భూస్వామ్య, దళారీ పెట్టుబడిదార్లకూ, బహుళ జాతి కార్పొరేషన్‌లకూ, స్టాక్ మార్కెట్లకూ, ప్రభుత్వానికీ ఎలాంటి శ్రమా లేకుండా కోట్లాది రూపాయల బ్యాంకు పెట్టుబడి సమకూరుతున్నది. అందుకే అన్ని ప్రభుత్వాలూ, పార్టీలూ వీటిని ఎంతగానో ప్రోత్సహిస్తున్నాయి. జులై 2003లో దంతెవాడ జిల్లాలోని కటేకళ్యాణ్‌లో జరిగిన ఒక మహిళా సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయం సహాయక గ్రూపులను తెగ పొగిడాడు. ఆదివాసీ మహిళలు తనకు తల్లులనీ, అక్కా చెల్లెలనీ, బిడ్డల్లాంటి వాళ్లనీ మెచ్చుకుంటూ చారిత్రకంగా వారి గొప్పతనాన్నీ, త్యాగాలనూ కీర్తించాడు. చివరకు, ఈసారి కూడా తన పార్టీనే ఎన్నుకుంటే దంతెవాడను రాష్ట్రంలోనే నంబర్ వన్ జిల్లాగా తయారు చేస్తానని చెప్పాడు. మహిళల పట్ల అతడి సానుభూతి వెనుక ఇదీ లోగుట్టు!

గత కొద్ది సంవత్సరాలుగా అనేక పోరాటాల ద్వారా దేశవ్యాప్తంగా మహిళల్లో నూతన చైతన్యం పెరుగుతోంది. అన్ని రంగాల్లో వారి భాగస్వామ్యం గతంతో పోలిస్తే ఎక్కువగానే ఉంటున్నది. అందుకే వారిని ఆకర్షించడానికీ, వారిని లోబర్చుకోవడానికీ పాలకవర్గాలు కొత్త కొత్త రూపాల్లో కుట్రలు చేయడం కూడా పెరిగింది. ఆ కుట్రల్లో భాగమే ఈ నూతన పథకాలూ, నూతన బిల్లులూ-చట్టాలూ. ఈ పథకాలూ చట్టాలూ ఏవైనా ఏడ్చే కళ్ల నీళ్లు తుడుస్తాయేమో గానీ, ఏడ్పుకు కారణాలనూ, మూలాన్నీ మాత్రం రూపుమాపలేవు. మహిళల్లో పెరుగుతున్న పోరాట చైతన్యాన్ని పక్కదారి పట్టించడానికి వారిని ఎన్నికల వైపు ఆకర్షిస్తున్నారు. జనాభాలో సగభాగమైన మహిళల ఓట్లను ఎవరు సొమ్ము చేసుకోగలిగితే వారి విజయం గ్యారంటీ అన్న విషయం అన్ని రాజకీయ పక్షాల వారికీ బోధపడింది. అందుకే వారు జరిపే సభలకు, ర్యాలీలకూ మహిళలను పెద్ద సంఖ్యలో చేరవేయడానికి అనేక పాట్లు పడుతున్నారు. సామ్రాజ్యవాదుల నమ్మినబంటైన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'మహిళా జన్మభూమి' అంటూ మరో అడుగు ముందుకు వేసి ప్రత్యేక మహిళా కార్యక్రమాలు చేపట్టడం రానున్న ఎన్నికల భాగోతానికి రిహార్సల్ మాత్రమే తప్ప మరేమీ కాదు. ప్రస్తుతం దేశంలో ముఖ్యంగా విప్లవ పోరాటాలు సాగుతున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు నాయుడు తరహాలోనే వ్యవహరిస్తున్నారు.

ఎన్నికల చట్టాల్లో జరిగిన సవరణ ద్వారా దేశంలో లక్షల సంఖ్యలోనే మహిళలు పంచాయితీలకు ఎన్నికవుతున్నారు. గతంలో పురుషులు అధికారం చెలాయించిన స్థానాలకు ఇప్పుడు మహిళలు ఎన్నికవుతున్నారు. అలా ఎన్నికైన మహిళలలో అధిక శాతం గతంలో అధికారం చెలాయించిన పురుషుల కుటుంబాల వాళ్లే. సాధారణంగా భర్తల స్థానంలో భార్యలు ఎన్నికవుతున్న ఘటనలే ఎక్కువ కానవస్తాయి. మహిళలు పేరుకే ఎన్నికవుతున్నారు తప్ప అసలైన అధికారం పురుషుల చేతుల్లోనే ఉంటున్నది. నిర్ణయాలన్నీ పురుషులు చేస్తుంటే ఎన్నికైన స్త్రీలు కేవలం సంతకాలకే పరిమితమవుతున్నారు. పంచాయితీ సంస్థలకు ఎన్నికైన మహిళలకు అనుభవం కోసం 1996లో బెంగుళూర్‌లో శిక్షణా తరగతులు నిర్వహించారు. అక్కడ హాజరైన వారిలో భర్త చేతిలో వీపు చిట్లిన వారూ, తలలు సైతం పగిలి కనబడకుండా కొంగు కప్పుకున్న వారూ ఎందరో ఉన్నారని పత్రికలు రాశాయి. వీరి దీన పరిస్థితికి జాలిపడాల్సిందే. అధికారంలో భాగస్వామ్యం ప్రచారానికే తప్ప నిజంగా మహిళలకు అధికారంలో పాలుపంచుకోవడానికి కాదని గుర్తు పెట్టుకోవాలి. వీరు చెప్పే మహిళా సశక్తీకరణ, అధికారంలో భాగస్వామ్యం వైనం ఇదీ!

స్త్రీపురుషుల మధ్య నిజమైన సమానత్వాన్ని, రాజకీయ అధికారంలో పురుషులతో పాటు సమాన భాగస్వామ్యం, మహిళలను ఎట్టి పరిస్థితుల్లో రెండవ శ్రేణి పౌరులుగా చూడడానికి వీలు లేదని గట్టిగా నినదిస్తూ మహిళా విముక్తికై పోరాడుతున్న బస్తర్ ప్రాంత మహిళలపై పాలకవర్గాలు తీవ్రమైన అణచివేతను అమలుచేస్తున్నాయి. ఈ బూటకపు ఎన్నికల్లో మేం పాల్గొని ఓట్లేసేది లేదని అణచివేత చర్యలతో మమ్మల్ని పోరాటంలోకి రాకుండా అడ్డుకోలేరని నినదిస్తూ గత 22 ఏళ్లుగా ఎన్నికలు బహిష్కరిస్తున్నారు. నిర్బంధాన్ని సాయుధంగా ప్రతిఘటిస్తున్నారు. పోరాటాలను అణచివేయడానికి ఇక్కడ తిష్టవేసిన వేలాది మంది పోలీసులు ప్రజలను హింసిస్తున్నారు. ఇక్కడున్న రాష్ట్ర పోలీసులు సరిపోవడం లేదనీ, ముఖ్యంగా రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మార్చ్ 2003లో రెండున్నర వేల మంది అర్ధసైనిక బలగాలను ఢిల్లీ నుండి



పోలీసుల తుపాకులను లెక్కచేయకుండా ప్రత్యేక బస్తర్ కోసం వెల్లువెత్తిన జనం

రప్పించారు. వీళ్లు సృష్టిస్తున్న భయోత్పాతానికి ఊళ్లకు ఊళ్లే ఖాళీ అవుతున్నాయి. వీళ్లు మహిళలపై అత్యాచారాలకు ఒడిగడుతున్నారు. ప్రజలను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. రానున్న విధానసభ ఎన్నికల్లో ఎలాగైనా వీరందరిచే ఓట్లు వేయించాలన్న దుష్ట తలంపుతోనే పరమ దారుణమైన హింసాదౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. అయినా మాకు ఓట్లేసేది లేదనీ, మా నిర్బంధానికి జడిసేది లేదని మహిళలు నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నారు. తమ గ్రామాల్లో నిలుపుకుంటున్న ప్రజా రాజ్యాధికార సంస్థ (జనతన సర్కార్) లను పటిష్టం చేసుకోవడానికి దండకారణ్యా మహిళలు కృత నిశ్చయంతో ఉన్నారు. భారత మహిళా లోకానికి దారి చూపిస్తున్నారు. బస్తర్ మహిళలపై అమలవుతున్న రాజ్య హింసను అర్థం చేసుకోవడానికి ఈ కింద పేర్కొన్న ఘటనలను చూడండి –

* జానో ఊసెండీ నారాయణపూర్‌లో ఉంటూ పరాల్‌భాట్‌లో టీచర్ ఉద్యోగం చేసేది. 2001 చివర్లో గోపనీయ సైనికుల నల్లదండు ముఠా దారికాచి ఆమెను పట్టుకొని సామూహిక బలాత్కారం జరిపి హత్య చేసింది. దీన్ని కప్పిపుచ్చుకోవడం కోసం నక్సలైట్లు చంపారని పోలీసులు తప్పుడు ప్రచారం చేశారు.
* ఇంద్రావతి ఏరియాలోని వెడమ గ్రామంలో ఏప్రిల్ 2003లో సిఆర్‌పిఎఫ్ జవాన్లు కెఎఎంఎస్‌కు చెందిన మహిళలపై అత్యాచారం చేశారు.
* కొండగాం ఏరియా రాజవేడ గ్రామానికి చెందిన శాంతి అనే అమ్మాయి దళంలో కొంతకాలం పని చేసి వెనక్కి వెళ్లి గ్రామంలో ఉంటూ అరెస్టయ్యింది. ఆమె బెయిలుపై విడుదలై వస్తుండగా బేనూర్ పోలీసులు స్టేషన్‌లో నిర్బంధించి ఉంచుకొని ఒక గోపనీయ సైనికునికి కట్టబెట్టారు. వాడు శాంతిని కొన్ని రోజులు వాడుకొని పెళ్లిచేసుకోనని చెప్పి విడిచిపెట్టాడు. ఇపుడీమెను పోలీసులు తమ ఇష్టానుసారం వాడుకుంటున్నారు.
* దక్షిణ బస్తర్‌లో 2000లో ఆంధ్ర నుండి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కిష్టారం ఏరియా కర్రెగుండం అనే గ్రామంలోకి ఒక గూఢచారి వస్తే వాన్ని గెరిల్లాలు మట్టుబట్టారు. ఆ తరువాత 50, 60 మంది ఆంధ్ర పోలీసులు కర్రెగుండం గ్రామంలో క్యాంపు పెట్టి మహిళలూ, ముసలివాళ్లూ అనే తేడా కూడా చూడకుండా విపరీతంగా కొట్టారు.తెలుగు భాష రాని ఆరుగురు ఆదివాసీ మహిళలను అరెస్టు చేసి ఆంధ్రాకు తీసుకెళ్లి తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపారు. ఆ తరువాత బెయిల్‌పై ప్రజలు విడిపించుకున్నారు.
* 2002లో డిసెంబర్‌లో కరువు దాడుల సందర్భంగా ఆంధ్ర పోలీసులు ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ గ్రామాల్లో దాడులు చేసి ఇక్కడి 5, 6 గ్రామాల ప్రజలను అరెస్టు చేయడమేగాక, ఆంధ్ర నుండి ఛత్తీస్‌గఢ్‌లో సంతలకు వచ్చే షాహుకార్లను పోటా కింద నిర్బంధిస్తామని బెదిరించి ఇక్కడకు రాకుండా చేసారు. దీనికి నిరసనగా వేలాదిమంది మహిళలు, పురుషులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి వాపస్ వస్తున్న సమయంలో ఆంధ్ర పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో 16 ఏళ్ల సోమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.
* 2003లో జేగుర్‌గొండ ఏరియాలోని తిప్పురం అనే గ్రామంలో సిఆర్‌పిఎఫ్ జవాన్లూ, రాష్ట్ర పోలీసులూ కలిసి దాడిచేసి గ్రామస్థులను అరెస్టు చేసి తీసుకెళుతుంటే మహిళలు అడ్డుకున్నారు. దీనితో రెచ్చిపోయిన పోలీసులు మహిళల భుజాలపై తుపాకులు మోపి కాల్పులు జరిపారు. అయినా మహిళలు "కాల్చండి చూద్దాం" అంటూ ఎదిరించారు. దీనితో గాలిలోకి 5 తూటాలు కాల్చి వెళ్లిపోయారు.
* 2003 మే నెలలో పోలీసులు జేగురుగొండ రేంజిలోని కలాండేర్ అనే గ్రామంలో ఇద్దరు మహిళలపై అత్యాచారం చేశారు.
* జూన్ 2003లో కర్రెగుండంలో సిఆర్‌పిఎఫ్ జవాన్లు ఒక ఇంటిపై దాడి చేసి తండ్రిని బయట కట్టిపడేసి ఇంట్లోనే ఇద్దరు అక్కాచెల్లెళ్లపై అత్యాచారం చేశారు.
* 2001లో దక్షిణ బస్తర్‌లోని ఆవపెల్లి రేంజి నేంద్ర అనే గ్రామంలో తెల్లవారుజామున 4 గంటల సమయంలో 50 మంది పోలీసులు దాడిచేసి కొందరు గ్రామస్థులు అరెస్టు చేసి తీసుకెళుతుంటే అడ్డుపడిన మహిళలను విపరీతంగా కొట్టారు. ఆ తర్వాత ఇండ్లల్లో చొరబడి డబ్బు, కోళ్లు ఎత్తుకెళ్లారు. ఏడుగురు మహిళలను అరెస్టుచేసి జగదల్‌పూర్ జైలుకు పంపారు.
* 2002లో కలకత్తా మీటింగ్‌కు వెళ్లి వస్తున్న వాళ్లను రైలుదిగి వస్తుండగా ఒక ఇన్ఫార్మర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు అరెస్టు చేశారు. ఆ తరువాత ప్రజలు వారిని విడిపించుకున్నారు. అయితే పోలీసులతో కుమ్మక్కైన సర్పంచ్ వీరిలోంచి చుక్కి అనే మహిళను స్టేషన్‌లో ఇంకా పని ఉందని విడవకుండా అక్కడే ఆపాడు. ఆ తర్వాత ఆమెను ఒంటరిగా తీసుకొస్తూ అడవిలోకి వచ్చాక అత్యాచారం జరిపాడు.
* 2003 మే 5న ఉత్తర బస్తర్ డివిజన్ కోయిలీబేడా ఏరియాలోని ప్రతాప్‌పూర్ రేంజి మల్‌మెట్ట గ్రామంపై 50 మంది స్థానిక పోలీసులూ, సిఆర్‌పిఎఫ్ జవాన్లూ కలిసి దాడి చేసి కెఎఎంఎస్‌కు చెందిన బిసొంతిని అరెస్టు చేసి విపరీతంగా కొట్టారు. [అయితే పక్క గ్రామం వరకు తీసుకువెళ్లేసరికి మూడు గ్రామాలు – మెస్పి, మల్‌మెట్ట, దొడిగెర్ఘోర్‌లకు చెందిన సుమారు 50 మంది మహిళలు జమయ్యి పోలీసులను అడ్డుకొని ఆమెను విడిపించుకున్నారు. ఆ తరువాత వాపసు పోతున్న పోలీసులపై పిజిఏ సెకండరీ, బేస్ బలగాలు కలిసి అంబుష్ చేసాయి.]

పై ఘటనలు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇంకా ఎన్నో రకాలుగా నేడు బస్తర్ మహిళలు పోలీసుల నిర్బంధం-అత్యాచారాలకు గురవుతున్నారు. జోగి సర్కార్ పోలీసులూ, కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని 24 పార్టీల ఎన్‌డిఏ ప్రభుత్వం పంపిన సిఆర్‌పిఎఫ్ బలగాలూ కలసి బస్తర్ మహిళలకు కల్పిస్తున్న భద్రత ఇదీ! ఇంకో పక్క ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లాగే జోగీ సర్కార్ కూడా హైటెక్ తరహాలో "మహిళా భీమా పథకం; మహిళా సంక్షేమ పథకాలు; మహిళా సంరక్షణ సమితి" వంటి పలు పేర్లతో రకరకాల పథకాలు అమలుచేస్తున్నది. ఎందుకంటే వచ్చే ఎన్నికల్లో మహిళల ఓట్లు దండుకోవడం ఒక అవసరం కాగా, మరో పక్క ఎల్ఐసి (తక్కువ తీవ్రత గల సంఘర్షణ) వ్యూహంలో భాగంగా పోరాటాల తీవ్రతను తగ్గించేందుకు పలు రకాల పథకాలు అమలు చేస్తున్నాడు. అయినప్పటికీ ఇవి ఆదివాసీ మహిళల మౌలిక సమస్యలను పరిష్కరించేవి కావు. ఇవి పెరుగుతున్న పెటీ బూర్జువా, మధ్యతరగతి వర్గాల్ని ఆకర్షించే పథకాలే తప్ప మరేం కావు. బైలడిల్లాలో దగాపడ్డ ఆదివాసీ మహిళలు వ్యభిచార ఊబిలోకి దించబడిన సంగతి అందరికీ తెలిసినదే. ప్రభుత్వం నేడు టూరిజం పరిశ్రమను ప్రోత్సహించడం వల్ల జరిగే విపత్తు ఏమిటో కూడా తేలిగ్గానే ఊహించవచ్చు. ఇలాంటి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలనూ అణచివేత చర్యలనూ 'క్రాంతికారీ ఆదివాసీ మహిళ' ప్రతిఘటిస్తూ సాటి మహిళలందరినీ కూడగడ్తూ ప్రజాయుద్ధంలో మరో ఛుంకాల్‌కు 'అక్కుమ్' మోగిస్తుంది. ఇది తథ్యం...

*శ్రద్ధాంజలి*

# విప్లవాశయాన్ని సాధిస్తామని ప్రతిన బూనుతూ దండకారణ్యం ఎల్లెడలా జరిగిన అమరవీరుల వారం

భారత విప్లవాన్ని పురోగమింపజేసే క్రమంలో అమరులైన విప్లవయోధులందరికీ నివాళులర్పిస్తూ, వాళ్ల ఆశయాల్ని పరిపూర్తి చేస్తామని శపథం చేస్తూ జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు దండకారణ్యంలోని అన్ని డివిజన్లలో అనేక చోట్ల అమరవీరుల వారం జయప్రదంగా ముగిసింది. ఈ సందర్భంగా అనేక చోట్ల సభలు, ఊరేగింపులు జరిగాయి. మన దేశంలో గత సంవత్సరం అమరవీరుల వారం నుండి ఇప్పటి వరకు మన పార్టీ, మన సోదర పార్టీయైన ఎంసిసిఐల నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధంలో అమరులైన వందలాది అమరులనూ; పెరూ, నేపాల్, ఫిలిప్పీన్స్, టర్కీ మొదలైన దేశాలలో ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా జరుగుతున్న విభిన్న విప్లవాల క్రమంలో అమరులైన వందలాది, వేలాది కామ్రేడ్స్ త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఉత్తరాన కోయిలిబేడ నుండి దక్షిణాన కుంట ప్రాంతం దాకా, భైరంగఢ్ నుండి పశ్చిమాన గడ్చిరోలి దాకా అమరుల త్యాగాల్ని గుర్తు చేసుకుంటూ అనేక చోట్ల సభలూ, ఊరేగింపులూ తదితర కార్యక్రమాలు జరిగాయి. చాలా చోట్ల అమరుల స్మృతిలో స్తూపాలు వెలిశాయి.



*మా నెత్తుటి కోనేటిలో*
*నవలోకం వికసించును*

ఎప్పటి లాగానే ఈ యేడు కూడా అమరుల వారాన్ని విఫలం చేయడానికి శత్రువు పడరాని పాట్లు పడ్డాడు. అనేక చోట్ల దాడులు చేశాడు. నిర్బంధాన్నీ, గస్తీనీ, కూంబింగ్ కార్యకలాపాలనూ ముమ్మరం చేశాడు. ప్రజలు ఓ వైపు శత్రు నిర్బంధం నుండి ఆత్మరక్షణ కోసం జాగ్రత్తలు తీసుకుంటూనే అమరులకు నివాళులర్పించారు. అమరుల వారం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరగడానికి గాను శత్రువు ఆక్రమణ దాడుల్ని ప్రతిఘటించడానికి పిజిఏ సైనికులు సర్వసన్నద్ధంగా ఉన్నారు. ప్రజాయుద్ధ క్రమంలో నేలకొరిగిన వీరులకు నివాళులర్పించడానికి కూడా ప్రజలు ఆత్మరక్షణా యుద్ధం తప్పనిసరి అని గుర్తిస్తున్నారు. ఓ వైపు శత్రువుతో పోరాడుతూనే మరో వైపు పోరాటంలో అసువులు బాసిన వీరయోధులకు నివాళులర్పించడంలో నిజానికి వైరుధ్యమేమీ లేదు; దీనిలో అసంపూర్తిగా మిగిలిన అమరుల ఆశయాన్ని పూర్తి చేసే కర్తవ్యం పట్ల నిబద్ధతే వ్యక్తమవుతుంది.

దినపత్రికల్లో వచ్చిన వార్తల ప్రకారం, అమరవీరుల వారం చివరి రోజైన ఆగస్టు 3న గడ్చిరోలి డివిజన్‌లో పేంద్రి పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులకూ, పిజిఏ సైనికులకూ మధ్య కాల్పులు జరిగాయి. పత్రికల వార్తల ప్రకారం ఈ కాల్పులలో కొందరు పోలీసులు గాయపడ్డారు. *(అయితే పిజిఏ తరఫు నుండి దీనికి సంబంధించిన రిపోర్టు అందాల్సి ఉంది.)* మరోవైపు బస్తర్ ప్రాంతంలో రెండు సిఆర్‌పిఎఫ్ బెటాలియన్లు మొహరించిన తర్వాత నిర్బంధం బాగా పెరిగింది. ముఖ్యంగా గత ఎండాకాలంలో సిఆర్‌పిఎఫ్, స్థానిక పోలీసులు కలిసి సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో అనేక చోట్ల అమరవీరుల స్తూపాలను కూల్చివేశారు. కొన్ని గ్రామాల్లో ప్రజలను కొట్టీ, బెదిరించీ బలవంతంగా స్తూపాల్ని కూలగొట్టించారు. మరి కొన్ని చోట్ల ప్రజలు తమ విముక్తి కోసం ప్రాణాలర్పించిన అమరుల జ్ఞాపకంలో నిర్మించుకున్న స్తూపాల్ని కూలగొట్ట నిరాకరించారు. అమరుల స్తూపాలను కూలగొట్టి ప్రజల పోరాటశక్తిని నిర్వీర్యం చేయగలమని పోలీసులు భ్రమపడుతున్నారు. అయితే ఇందుకు పూర్తిగా విరుద్ధంగా జరుగుతున్నది. పోలీసులు స్తూపాల్ని కూలగొట్టిన ప్రతి చోటా ప్రజలు మళ్లీ నిర్మించుకుంటున్నారు. పోలీసులు చేస్తున్న ఇటువంటి దురాగతాల వల్ల ప్రజల్లో క్రోధం పెల్లుబుకుతోంది. వాళ్లలో పోరాట సంకల్పం పెరుగుతున్నది.

దండకారణ్యం అంతటా జరిగిన అమరవీరుల వారం కార్యక్రమాలకు సంబంధించి మాకు వివిధ డివిజన్ల నుండి అందిన కొన్ని రిపోర్టులను సంక్షిప్తంగా కింద ప్రచురిస్తున్నాం.

## మాడ్ డివిజన్

కుత్తూల్ ఏసి పరిధిలో కొడ్డిలేర్ గ్రామంలో సంఘం ఆధ్వర్యంలో సంస్మరణ సభ జరిగింది. మొత్తం 69 మంది మహిళలతో సహా 150 మంది ప్రజలతో పాటు పిజిఏ ప్రధాన బలగాలు కూడా ఈ సభలో పాల్గొన్నాయి. మొదట ఎర్రబ్యానర్లు, ఎర్ర జండాలు పట్టుకొని ఊరేగింపుగా నినాదాలు ఇస్తూ స్తూపం వద్దకు చేసుకున్నారు. గ్రామ సంఘ నాయకుడు ఎర్రజండాను ఎగురవేసాడు. తర్వాత రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరులకు జోహార్లు అర్పించి సభను ప్రారంభించారు. ప్లటూన్-5 సభ్యురాలు కా. పాయికి అధ్యక్షత వహించగా గ్రామ సంఘ నాయకుడు మాట్లాడాడు. అమరులను పేరుపేరునా గుర్తుచేసి జోహార్లు చెప్పాడు. వారంతా పేదప్రజల కోసం ప్రాణాలు అర్పించారనీ, వారి త్యాగ సాంప్రదాయాన్ని కొనసాగించాలనీ, వాళ్లు చూపిన బాటలో నడవాలనీ, అదే నిజమైన నివాళి అవుతుందనీ మాట్లాడాడు. ఈ దోపిడీ వ్యవస్థను కూలదోస్తూ పోరాట ప్రాంతాల్లో విప్లవ ప్రజా కమిటీలను నిర్మిస్తూ, ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించి అమరులు కన్న కలలను నిజం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ తన ఉపన్యాసాన్ని ముగించాడు. మరో సంఘ సభ్యుడు మాట్లాడుతూ పోరాడితేనే పీడిత ప్రజలకు విముక్తి దొరుకుతుందనీ, అమరుల మార్గంలో సాగాలనీ అన్నాడు. ఈ సభలో సిఎన్‌ఎం సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ప్రజలకుఎంతో విప్లవ స్ఫూర్తినిచ్చాయి.

నేల్‌నార్ గ్రామంలో భూంకాల్ అమరవీరుల స్మృతిలో 35 అడుగుల

ఎత్తుతో స్థూపాన్ని నిర్మించి స్మారక సభ జరుపుకున్నారు. 10 గ్రామాల నుండి 700 మంది ప్రజలు రాగా ఈ సభ చాలా ఉత్సాహంగా జరిగింది. ఆనాటి భూమ్‌కాల్ అమరులను స్మరించుకొని వారి పోరాట వారసత్వాన్ని ఎత్తిపడుతూ నేడు సాగుతున్న ప్రజాయుద్ధంలో భాగం కావాలనే స్ఫూర్తితో సభ ముగిసింది.

కోహ్‌కమెట్ట ఎల్‌జియస్ పరిధిలో అనేక గ్రామాలలో ప్రజలు సభలు జరిపి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కోహ్‌కమెట్ట గ్రామంలో 6 గ్రామాల నుండి 4, 5 వందల మంది ప్రజలు పాల్గొనగా స్మారక సభ జరుపుకున్నారు. గడచిన ఏప్రిల్‌లో పోలీసులు గ్రామ పెద్దల ద్వారా ప్రజల్ని బెదిరించి ఉన్న స్థూపాన్ని కూలగొట్టించారు. అయితే ప్రజలు పెద్దలను తగిన బుద్ధి చెప్పి పట్టు విడవకుండా మళ్లీ కట్టుకున్నారు. మళ్లీ నిర్మించిన స్థూపాన్ని జులై 28 నాడు ఆవిష్కరించి, జెండా నెగురవేసి స్మారకసభ జరుపుకున్నారు. బెచ్చ గ్రామంలో 3 గ్రామాల ప్రజలు జులై 28న అమరవీరుల స్మారక సభ జరుపుకున్నారు. కుంద్ల, కాన్నార్, భాసింగ్, కీహ్‌కాడ్, ఇర్కుబట్టి తదిర గ్రామాలలో విప్లవ సాంప్రదాయాలతో అమరుల స్మారక సభలు జరిగాయి. స్థానిక సిఎన్‌ఎం కళాకారులు పాటలు పాడారు. అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకుపోతామని ప్రతిన బూనుతూ ఈ సభలన్నీ విజయవంతంగా ముగిసాయి.

కోహ్‌కమెట్ట ఏరియాలోని ఆకబేడ గ్రామంలో ప్రజలందరూ కలసి పోలీసు నిర్బంధాన్ని లెక్క చేయకుండా అమరుల స్థూపాన్ని నిర్మించారు. వ్యవసాయ పనుల వత్తిడి ఉన్నప్పటికీ, భారీ వర్షాలలో సైతం ప్రజలు తమ బతుకులు మారాలని నెత్తురు ధారపోసిన తమ ముద్దుబిడ్డల సంస్మరణలో స్థూపం నిర్మించడం కోసం ఎంతో శ్రమించారు. ఇటుకలు, కంకర లాంటివి అన్నీ స్వయంగా మోసారు. ప్రకృతి సహకరించకపోవడంతో రెండు సార్లు మధ్యలో కూలిపోయినప్పటికీ ప్రజలు పట్టు విడవకుండా శ్రమించి స్థూప నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఆగస్టు 3న స్థూపాన్ని ఆవిష్కరించి స్మారకసభను జరుపుకున్నారు. ఈ సభలో నారాయణపూర్ పట్టణానికి దగ్గర్లోని గ్రామాల ప్రజలు కూడా పాల్గొన్నారు. ఈ సభ ప్రారంభానికి ముందు పిజిఏ ప్రధాన బలగాలైన ప్లటూన్లూ, ప్రజలూ కలసి బ్యానర్లూ, జెండాలూ పట్టుకొని నినాదాలు చేస్తూ సిఎన్‌ఎం పాటలతో సైనిక కవాతు చేస్తూ స్థూపం వద్దకు చేరుకున్నారు. ఆ రోజంతా ఆకబేడ గ్రామం అమరులను స్మరించుకుంటూ చేసిన నినాదాలతో మారుమోగిందంటే అశ్చర్యం లేదు. 800 మంది మహిళలతో సహా మొత్తం 2,500 మంది ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేశారు.

సంఘ నాయకుడు జెండా ఎగురవేయగా పిఎల్-5 నుండి కా. బాబూరావు స్థూపావిష్కరణ చేసాడు. పిఎల్-1 నుండి కా. కమలాకర్ పిజిఏ జెండా, పార్టీ జెండాలను ఎగురవేసి మాట్లాడాడు. పిమ్మట గ్రౌండులో సభ జరుపుకున్నారు. కా.బాబూరావు అధ్యక్షత వహించగా కా. కమలాకర్ జులై 28 ప్రాముఖ్యతను వివరించాడు. అమరుల త్యాగాన్ని స్మరించుకుంటూ వాళ్ల ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరాన్ని చెప్పాడు. ముగింపుగా కా.బాబూరావు మాట్లాడుతూ మాడ్‌లో అమరులైన కామ్రేడ్ల ఆదర్శాల గురించి మాట్లాడాడు. అమరులకు శ్రద్ధాంజలి ఘటించడంతో సభ ముగిసింది.

## దక్షిణ బస్తర్ డివిజన్ (గోండీ భాషలో)

దక్షిణ బస్తర్ త మూండు ఏరియా లొప్పో శహీద్ సప్తాహ్ శహీదీర ఏజతె 28 జూలై తించో 3 ఆగస్తు ఎవనల్ మానెమాత్తోర్.

28 జూలై దియ్యా నర్కుమే జనత శహీదీర దియ్యా మానెమాయల తమ నాటె నాటె స్థూపం బనా కీత్త జాగతె జమ ఆసి అమర శహీదీర ఆశయ్‌తున్ మున్నె ఒయనీకి, ఓర సప్న తున్ నిజం కీయనీకి కిరియ కీత్తోర్. 28 జూలై త మైదె మున్నెనే డిఏకెఎంఎస్, కెఏఎంఎస్ తోరు గుల్లె కాల్పి 50 ప్రచార దళం వెండె రేంజ్ కమిటీతోరు 28 జూలై శహీద్ సప్తాహ్‌త ప్రచార్ పూర ఏరియా లొప్పో కీత్తోరు.

కిష్టారం ఏరియాతె ఎలమాగోడో 450 మూల్, బుర్‌లంక 3,000, పాలచెలమ 2,000, కోమామాం 480, ఆలెకెనే గొల్లపల్లి ఏరియాతె వెంజెల్ 1,200, తుంగవాడ్ 500, మాయిత 200. వెండె కుంట ఏరియాతె నేండ్ర 300, చింతగుప్ప 250 ఆలెకెనే దోర్నపాల్ ఏరియా తె 2,000 మూల. ఆలెకెనే బాసగూడెం ఏరియా లొప్పో జగుర్‌గొండ ఎల్‌జిఎస్ తె పెద్ద బోడికెల్‌తె కా. సుఖ్‌దేవ్ నా స్థూపం బనాకీత్తోర్. అగ 5,000 మూల్, పామేడ్ ఎల్‌జిఎస్ త ఎర్రపాడ్ 2,500, మల్లెపాడ్ 2,000, వెండె ఊసూర్ ఎల్‌జిఎస్ తె లింగాపురం తె 300 మూల్ జనత మీటింగ్ తె వాత్తోరు.

ఇవు గుల్లె మీటింగ్ లొప్పో జనతన సర్కార్ ఆలెకెనె జనతా నర్గె సంఖ్యా లొప్పో శామిల్ ఆత్తోర్. జన సంగటన్ వెండె జనతన సర్కార్ నేతృత్వతె గుల్లె జరగముంత. నేండు 28 జూలై జనత ఒండు సాంప్రదాయ్ లెక్క ఓర బత్‌కాడ్ లొప్పొ ఒండు బాట ఇదు 28 జూలై ఆసోర్ మంత.

## పశ్చిమ బస్తర్ డివిజన్

భైరంగఢ్ ఏరియాలో డిఏకెఎంఎస్, కెఏఎంఎస్ రేంజ్ కమిటీల నాయకత్వంలో 20 ప్రచార దళాలు దాదాపు 45 రోజుల పాటు ప్రచార క్యాంపెయిన్ నిర్వహించాయి. ఏరియాలోని విద్యార్థులు రోడ్లపైనా, స్కూలు భవనాలపైనా శత్రు నిర్బంధాన్ని ఎదిరిస్తూ అమరవీరుల వారాన్ని జరుపుకోవల్సిందిగా ప్రజలను కోరుతూ నినాదాలు రాశారు. ప్రతి టౌన్ సెంటర్లోనూ పోస్టర్లు వేశారు. భైరంగఢ్, మాట్వాడ, బీజాపూర్‌లలో అప్పటికప్పుడు తాత్కాలిక స్థూపాల్ని ఏర్పాటు చేశారు. అయితే శత్రువు అమరవీరుల జ్ఞాపకాల్ని సైతం నిర్మూలించాలనే విఫల ప్రయత్నంలో భాగంగా ఈ స్థూపాల్ని వెంటనే తొలగించాడు. జూలై 28 నాడు దాదాపు అన్ని గ్రామాల ప్రజలు తమ తమ గ్రామాలలో గల అమరవీరుల స్థూపాల వద్ద సమావేశమై అమరులకు నివాళులర్పించారు. ఆ తర్వాత ఏరియాలో పెద్ద సభలు దాదాపు 10 జరిగాయి. వీటిలో 5, 6 గ్రామాల చొప్పున ప్రజలు హాజరయ్యారు. ఈ మొత్తం సభల్లో 8 వేలకు పైగా ప్రజలు పాల్గొని అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకుపోతామని శపథం చేశారు. వీరిలో దాదాపు మూడున్నర వేల మంది మహిళలున్నారు. ప్రజా ప్రభుత్వ సంస్థలైన 'జనతన సర్కార్' ఏర్పడిన చోట జరిగిన సభల్లో ప్రజలు మరింత ఉత్సాహంగా పాల్గొని పోరాటంలో అమరులైన వీరులందరికీ జోహార్లు తెలిపారు.

ఈ సభలలో ప్రసంగించిన వక్తలు ప్రధానంగా నేడు బస్తర్‌లో సిఆర్‌పి బలగాల రాక తర్వాత కొనసాగుతున్న నిర్బంధ క్యాంపెయిన్‌ను ప్రతిఘటిస్తూ ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోవల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. శత్రు నిర్బంధాన్ని ఓడిస్తామనీ, సిఆర్‌పి బలగాలను పారదోలుతామనీ, అమరుల ఆశయాలను సాధిస్తామనీ ప్రజలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ✪

# ప్రజాయుద్ధ వీరుడు కామ్రేడ్ భాస్కర్‌కు అరుణారుణ జోహార్లు!

దండకారణ్య ఉద్యమాన్ని నిర్మూలించేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రోజురోజుకూ నిర్బంధాన్ని తీవ్రతరం చేస్తున్నది. ఉద్యమ ప్రాంతాలలో పెద్ద ఎత్తున ఎస్ఏఎఫ్‌ను మోహరించడంతో పాటు కేంద్రాన్ని సిఆర్‌పి బలగాలను పంపించాలని కోరుతున్నది. ఉక్కుపాదంతో ఉద్యమాన్ని అణచివెయ్యాలని అది తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాశవిక దమనకాండను తిప్పికొట్టేందుకు పిజిఏ దక్షిణ సబ్-జోనల్ కమాండ్ తన పరిధిలోని ముర్దొండ వద్ద పోలీసులపై దాడి చేయాలని నిర్ణయించింది. ప్రయాణీకుల బస్సులలో రాకపోకలు సాగించే పోలీసులపై దాడి చేసి వారిని లొంగదీసుకొని ఆయుధాల్ని గుంజుకోవాలనీ, లొంగిపోవడానికి సిద్ధం కాని పక్షంలో ప్రజల్ని బస్సులోంచి దిగి పొమ్మని కోరి ఆ పిమ్మట వాళ్లను హతమార్చాలని పిజిఏ పథకం సిద్ధం చేసింది. ఈ పథకంలో భాగంగా ఫిబ్రవరి 2, 2003 నాడు పిజిఏకు చెందిన రెండు ప్లటూన్లు బాసగూడెం నుండి జగ్దల్‌పూర్ వెళ్లే బస్సులో ఆరుగురు పోలీసులు వస్తున్నారని సమాచారం అందగానే ముర్దొండ గ్రామానికి సమీపంలో ఒక బ్రిడ్జి వద్ద మాటు గాచాయి. ముందుగా బస్సును ఆపి పోలీసులను లొంగిపోవల్సిందిగా పిజిఏ గెరిల్లాలు కోరారు. అయితే పోలీసులు విర్రవీగుతూ బస్సులో నుండే ఫైరింగ్ ప్రారంభించారు. ఆ తర్వాత పిజిఏ గెరిల్లాలు ప్రజలందరినీ బస్సు దిగిపోయి తమతో సహకరించాల్సిందిగా కోరారు. వెంటనే దాదాపు 40 మంది స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ అందరూ క్షణాల్లో దిగిపోయి తప్పుకున్నారు. అయితే ఇది గమనించిన పోలీసులు ఒక మహిళనూ, ఆమె ముగ్గురు ఆడపిల్లలనూ బలవంతంగా ఆపుకొని మానవ కవచాలుగా వాడుకున్నారు. ప్రజలందరూ వెళ్లిపోయారని భావించి పిజిఏ సైనికులు దాడి ప్రారంభించారు. ఈ దాడిలో ఎస్ఏఎఫ్‌కు చెందిన ఒక కంపనీ కమాండర్, ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మట్టిగరిచారు. మరో ఇద్దరు స్వల్ప గాయాలతో తప్పుకుని పారిపోతూ జరిపిన కాల్పుల్లో పిఎల్-4 సెక్షన్ డిప్యూటీ కమాండర్ కామ్రేడ్ భాస్కర్ (ముచ్చకి జోగా) అమరుడైనాడు.

కా. భాస్కర్ (ముచ్చకి జోగాల్) దక్షిణ బస్తర్ జిల్లా సుక్మ తాలూకా చీంద్‌గఢ్ బ్లాక్‌లోని టిటో అనే గ్రామంలో పుట్టాడు. భూములు లేక కడు పేదరికంలో మగ్గుతున్న వీరి కుటుంబం 1980లో కుంట తాలూకాలో బతకడానికి వలస వచ్చారు. అక్కడ రిజర్వ్ అడవిలో బాలన్‌తోంగ్ అనే గ్రామాన్ని కొత్తగా ఏర్పాటు చేసుకొని అటవీ భూముల్ని సేద్యం చేసుకోసాగారు. అప్పటికి జోగ వయస్సు 8-9 సంవత్సరాలు. ఇక్కడ కూడా బతుకు భారం కావడంతో ఆయనను తల్లిదండ్రులు కిష్టారం రేంజ్ బూర్గులంక గ్రామంలో ఓ ధనిక రైతు వద్ద జీతం కుదిర్చారు. భాస్కర్ యుక్తవయస్సు వచ్చేదాకా ఇదే గ్రామంలో జీతం చేస్తూ వచ్చాడు. ఈ గ్రామంలో ఉండగానే కుంట ప్రాంత గెరిల్లా దళంతో పరిచయాలు ఏర్పడడం, తను సంగంలో సభ్యుడిగా చేరడం అన్నీ సహజంగానే జరిగిపోయాయి. తను జీతం ఉన్న ధనిక రైతు కుటుంబమే ఆయనకు ఇష్టం లేని పెళ్లి చేసింది. అయితే ఆయన పెళ్లిని వ్యతిరేకించి కొద్ది కాలం తర్వాత విడాకులు ఇచ్చి బాలన్‌తోంగ్‌లో తన తల్లిదండ్రుల వద్ద ఉండసాగాడు. అదీ కుంట ప్రాంత గెరిల్లా దళం తిరిగే గ్రామమే కావడంతో ఆయన డిఏకెఎంఎస్‌లో పనిని మునుపటి లాగానే కొనసాగించాడు.

ఆంధ్రప్రదేశ్ సరిహద్దున ఉన్న ఈ గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో ఖమ్మం జిల్లా మల్లంపేట గ్రామం ఉంటుంది. మల్లంపేట రివిజనిస్టు సిపిఎంకు కంచుకోటగా ఉంటుందని చెప్పొచ్చు. సిపిఎం భద్రాచలం డివిజనల్ కమిటీ సభ్యుడు శ్యామల వెంకటరెడ్డి ఈ ఊరివాడే. వీడొక పేరుమోసిన భూస్వామి. విప్లవోద్యమంపై కత్తిగట్టిన ఈ ప్రజాశత్రువును ఖతం చేయాలని పార్టీ 1984లోనే నిర్ణయించింది. వీడు తన రక్షణ కోసం గ్రామంలో ఆంధ్ర పోలీసులతో క్యాంపును ఏర్పాటు చేసుకున్నాడు. వెంకటరెడ్డి ఇటు ఛత్తీస్‌గఢ్‌లోనూ, అటు ఆంధ్రలోనూ గ్రామాలపై దౌర్జన్యాలను కొనసాగిస్తూ మన పార్టీని వేళ్లూనుకోకుండా చేయాలని విశ్వ ప్రయత్నం చేశాడు. పోలీసులతో కుమ్మక్కై పాశవిక నిర్బంధకాండను అమలు జరిపాడు. వీడిని ఖతం చేయడానికి చేసిన అనేక ప్రయత్నాలు విఫలమవడంతో వీడు మరింత విర్రవీగుతూ ఎదురులేని మొనగాడిగా నిలిచాడు. 1996లో వీడి పీడ విరగడ చేయడం కోసం పార్టీ దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ ఒక యాక్షన్ టీంను ఏర్పాటు చేసింది. అందులో కా. భాస్కర్ కూడా ఒక సభ్యుడు.

ఈ టీం సభ్యులు వాడి పొలంలోనే కూలీలుగా చేరి వాడు పొలాన్ని చూడడానికి రాగా అదను చూసుకొని నరికి చంపారు. ఆ తర్వాత నినాదాలు చేసుకుంటూ వెనక్కి వచ్చారు. ఈ ప్రజా పీడకుణ్ని హతమార్చడంలో కా. భాస్కర్ చాలా చొరవగా, ధైర్యంగా తన వంతు పాత్ర నిర్వహించాడు. ఆ తర్వాత స్థానిక పార్టీ కమిటీ అతనిని పూర్తి కాలం కార్యకర్తగా రావాలని కోరగా ఎలాంటి వెనుకాముందాట లేకుండా దళంలో చేరిపోయాడు. స్థానిక కుంట దళంలో దాదాపు 15 నెలల పాటు పనిచేశాడు. ఆ తర్వాత 1998 ఫిబ్రవరిలో దక్షిణ బస్తర్ డివిజన్‌లో ప్రారంభించిన ప్రత్యేక గెరిల్లా దళం (ఎస్‌జిఎస్) లోకి సభ్యుడిగా ఎంపిక చేశారు. అదే సమయంలో జరిగిన తాళ్లగూడెం రెయిడ్‌లో కా. భాస్కర్ చొరవగా పాల్గొన్నాడు. జూన్ 1999లో ఎస్‌జిఎస్ అంతా పిఎల్-2లో భాగం కాగా కా. భాస్కర్ ప్లటూన్ సభ్యుడైనాడు. పార్టీ 9వ కాంగ్రెస్ తర్వాత పిజిఏను బలోపేతం చేసుకునే కర్తవ్యంలో భాగంగా ప్లటూన్‌ల సంఖ్యను పెంచాలని పార్టీ నిర్ణయించింది. ఆ విధంగా కొత్తగా ఏర్పడిన పిఎల్-4లో కా. భాస్కర్ సెక్షన్ డిప్యూటీగా బాధ్యతల్ని స్వీకరించాడు. ఆ తర్వాత ఒరిస్సాలో మోటు పోలీసు స్టేషన్‌పై జరిగిన రెయిడ్‌లో కూడా ఆయన చొరవగా పాల్గొన్నాడు. పిఎల్-2 సభ్యుడిగా ఉంటూ ఉత్తర బస్తర్ డివిజన్‌లో బజరంగబలి వద్ద జరిగిన ఆంబుష్‌లోనూ, దక్షిణ బస్తర్‌లో తర్రెం వద్ద జరిగిన ఆంబుష్‌లోనూ కా. భాస్కర్ చురుగ్గా పాల్గొన్నాడు.

పేదరికంలో పుట్టి పెరిగిన భాస్కర్ ఇంటి దగ్గర చదువుసంధ్యలకు నోచుకోలేదు. పొట్టగడవడమే కష్టంగా ఉన్న పరిస్థితుల మధ్య జీవించిన భాస్కర్ ఎక్కువ కాలం జీతం ఉంటూ తన కుటుంబాన్ని పోషించాడు. ఈ నేపథ్యంలో దళంలోకి భర్తీ అయిన కా. భాస్కర్ ఆ తర్వాత విప్లవ జీవితంలో కూడా కష్టాలను చిరునవ్వుతో భరిస్తూ, వాటిని ఎదుర్కోవడంలో పోటీ పడేపడేవాడు. ప్లటూన్‌లో బరువులు మోయడంలో, కష్టించి పనిచేయడంలో ఇతర కామ్రేడ్లకు ఆదర్శంగా మెలిగేవాడు. గెరిల్లాగా మారిన తర్వాతనే ఆయన అక్షరాల్ని నేర్చుకోవడం ప్రారంభించాడు. మిలిటరీ క్యాంపుల్లో, రాజకీయ తరగతుల్లో తన అవగాహనను పెంచుకోవడం కోసం బాగా ప్రయత్నించేవాడు. దండకారణ్యంలో మన పార్టీ చేపట్టిన దిద్దుబాటు ఉద్యమంతో ఆయన బాగా ప్రభావితం అయ్యాడు. తనలోని తప్పుల్ని లోతుగా గుర్తించి వాటిని ఆత్మవిమర్శ చేసుకున్నాడు. పార్టీలో జరుగుతున్న తప్పులనూ, వాటికి గల సైద్ధాంతిక పునాదినీ లోతుగా అర్థం చేసుకొని వాటిని వదిలించుకోవడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన బలంగా అభిప్రాయపడ్డాడు. ఈ క్యాంపెయిన్ జరిగి నెల రోజులు కూడా తిరగకుండానే కామ్రేడ్ భాస్కర్ అమరుడు కావడం బాధాకరమైనదే. ఆయన ఆశించినట్టుగా పార్టీనీ, పిజిఏనూ బలంగా మల్చుకుంటూ, తప్పుల నుండి పాఠాలు నేర్చుకుంటూ ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. కా. భాస్కర్‌కు డికెఎస్‌జెడ్‌సి వినమ్రంగా జోహార్లర్పిస్తోంది. ఆయన ఆశయాన్ని కొనసాగిస్తామని శపథం చేస్తోంది. ✪

# తెలంగాణా ప్రజలారా! మీరొంటరిగా లేరు!

***తెలంగాణాలో ఫాసిస్టు చంద్రబాబు నాయుడు కొనసాగిస్తున్న దారుణ నిర్బంధకాండను ఖండించండి!***

**తెలంగాణాలో సాగుతున్న ప్రభుత్వ హింసకు వ్యతిరేకంగా నవంబర్ 1 నుండి 7 వరకు నిరసన వారం పాటిద్దాం!**

ప్రియమైన ప్రజలారా,

తెలంగాణా నెత్తురోడుతోంది. మానవ రక్తం రుచి మరిగిన గ్రేహౌండ్స్ మూకల ఉక్కుపాదాల కింద పల్లెలూ, అడవులూ, పంటపొలాలూ అన్నీ నలిగిపోతున్నాయి. పోలీసు కూంబింగులు, ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, సోదాలు, చిత్రహింసలు, అమరత్వాలు ప్రజల రోజువారీ జీవితంలో భాగమైనాయి. వీరుల రక్తం ఏరులుగా పారుతోంది. ఒక్క సంవత్సర కాలంలోనే పద్మక్క, రామకృష్ణ, అనపురం కొమురయ్య, రమణారెడ్డి, లలితక్క –మరెందరో ప్రజా నాయకులు, తెలంగాణా ప్రజల ముద్దుబిడ్డలు పోలీసు తూటాలకు బలైపోయారు. ఒక్క మాటలో చెప్పాలంటే నేడు తెలంగాణా యుద్ధభూమిగా, హద్దులు లేని రాజ్యహింసకు వేదికగా మారింది. సామ్రాజ్యవాదుల కావలి కుక్కైన చంద్రబాబు తెలంగాణాలో విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించి తన దళారీ దోపిడీ విధానాలను ఎదురు లేకుండా కొనసాగించవచ్చని కలలు కంటున్నాడు. తెలంగాణాలో విప్లవోద్యమాన్ని అణచివేయడం ద్వారా దేశంలో పలు చోట్ల సాగుతున్న విప్లవోద్యమం వెన్ను విరచగలనని భ్రమ పడుతున్నాడు. తెలంగాణా ప్రజల్ని భూస్వామ్య, సామ్రాజ్యవాద దాస్యం కాడి కింద బలవంతంగా అణచిపెట్టాలని ప్రయత్నిస్తున్నాడు. అసలు తెలంగాణా ఎప్పుడైనా తలవంచిందా? తెలంగాణా బిడ్డలు నెత్తురు ధారపోయని రోజు చరిత్రలో ఒక్కటైనా ఉందా?



చంద్రబాబు ప్రభుత్వ ఫాసిస్టు హత్యాకాండకు బలైన కామ్రేడ్ పద్మ (రజిత)

## ఏనాడూ తలవంచని వీర తెలంగాణా !

ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాన ఉన్న 10 జిల్లాలతో కూడుకుని ఉన్నదే తెలంగాణా ప్రాంతం. భారత విప్లవోద్యమ చరిత్రలో తెలంగాణాకు ఒక ప్రముఖ స్థానం ఉంది. తెలంగాణా ప్రజలు 1940 దశకం నుండీ, మధ్యమధ్యన కొన్ని విరామాలు ఉన్నప్పటికీ, దోపిడీపీడనలకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సంఘర్షిస్తూనే ఉన్నారు. 1940లో తమ ప్రాంతంపై తమకే అధికారం కావాలని కొమురం భీం నాయకత్వంలో నైజాంకు వ్యతిరేకంగా జరిగిన జోడెన్‌ఘాట్ ప్రాంత పోరాటం చారిత్రక ప్రాముఖ్యతను సంతరించుకుంది. 1946-51 మధ్య తెలంగాణా ప్రజానీకం కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్ర మహాసభల నాయకకత్వంలో సాగించిన వీర తెలంగాణా విప్లవ రైతాంగ పోరాటం చరిత్రలో ఒక గొప్ప పోరాటంగా రక్తాక్షరాలతో నిలిచిపోయింది.

నిజాం పాలనకు వ్యతిరేకంగా 1928లో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. తెలంగాణాలో 1930 నుండి కమ్యూనిస్టు పార్టీ పని చేయడం ప్రారంభించింది. కానీ పార్టీపై నిషేధం ఉండడంతో ఆంధ్ర మహాసభతో కలిసి పని చేసింది. ఆంధ్ర మహాసభ ‘సంగం’గా గ్రామీణ ప్రాంతంలో విస్తృతంగా వ్యాపించింది. 1942 నాటికి కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగా పనిచేసే అవకాశాలు వచ్చాయి. రైతాంగానికి కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా అవతరించింది. నైజాం నిరంకుశ పాలనకూ, భూస్వామ్యానికీ వ్యతిరేకంగా తెలంగాణా ప్రజలు వెల్లువెత్తారు. 1946 నాటికల్లా ఆ పోరాటం సాయుధ మార్గాన్ని చేపట్టింది. ఆనాటికి దాదాపు 100 గెరిల్లా దళాల్లో కనీసం 2,000 మంది సాయుధ సభ్యులుండేవారు. వాళ్లు అనేక దాడులు చేసి నైజాం సైన్యాలను ముప్పుతిప్పలు పెట్టారు. నైజాం రజాకార్ల దురాగతాలనూ, అత్యాచారాలనూ ప్రజలూ, గెరిల్లాలూ వీరోచితంగా ప్రతిఘటించారు. ‘దున్నేవారికే భూమి’ నినాదంతో రైతులు 10 లక్షల ఎకరాల భూమిని భూస్వాముల చెర నుండి విడిపించుకున్నారు. 3,000 గ్రామాలు విముక్తమయ్యాయి. విముక్తి చెందిన గ్రామాలలో ప్రజా రాజ్యాధికారం మొలకెత్తసాగింది. 1950 నాటికి ఉద్యమం కర్నూలు జిల్లా నల్లమల అడవులకూ, ఆదిలాబాద్ జిల్లాకూ, దానిని ఆనుకొని ఉన్న మహారాష్ట్రకూ విస్తరించింది.

తరతరాలుగా భూస్వామ్య పీడన కింద నలిగిపోయిన పేద రైతాంగం పార్టీతో దృఢంగా నిలిచింది. 1948 సెప్టెంబర్ 13న హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తి చేయడం పేరిట దిగిన నెహ్రూ యూనియన్ సైన్యాలు తెలంగాణా ప్రజలపై ఫాసిస్టు దమనకాండను ప్రారంభించాయి. బ్రిగ్స్ ప్లాన్‌ను అమలు చేశాయి. భారత సైనికులు వందలాది గ్రామాలను కాల్చివేశారు. నల్గొండ, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ జిల్లాలకు చెందిన 3 లక్షల మందిని అమానుషంగా హింసించారు. 50 వేల మందిని అరెస్టు చేశారు. గెరిల్లాలకు రక్షణ

ఇస్తున్నారన్న నెపంతో ప్రజల్ని కాన్‌సెంట్రేషన్ క్యాంపులలో నిర్బంధించారు. దాదాపు 3,000 మందిని కాల్చివేశారు. అయినా ప్రజలు చలించలేదు. సాయుధ పోరును విడవమన్నారు. పార్టీని విడవమని అన్నారు. ఇది 1951 నాటికి ఉద్యమం చేరుకున్న స్థితి. అయితే కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ 1951లో పోరాటాన్ని విరమించుకోవాలని నిర్ణయించడంతో తెలంగాణా ప్రజల తొలి మహత్తర పోరాటం విద్రోహానికి బలైపోయింది. అయినా ప్రజల పోరాటచేవ మాత్రం చావలేదు.

1969 నాటికి పోరాట చిత్రపటం పైకి తెలంగాణా మరోసారి ఉబికివచ్చింది. ప్రాంతీయ అసమానతలూ, వివక్షా ఫలితంగా వెనుకబడిపోయిన ప్రజ ఈసారి 'ప్రత్యేక తెలంగాణా' నినాదాన్నెత్తుకుంది. తెలంగాణాలోని పది జిల్లాలు ఒక్కతాటిపై నిలిచి పోరాడాయి. ముఖ్యంగా తెలంగాణా యువతరం, విద్యార్థి-మేధావులు విజృంభించారు. కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాలు మూతపడ్డాయి. 'తెలంగాణా ప్రజా సమితి', తదితర స్వతంత్ర సంస్థలు ఆ ఉద్యమానికి నాయకత్వం వహించాయి. చెట్టుపేరు చెప్పుకుని కాయలమ్ముకునే సిపిఐ, సిపిఎం రివిజనిస్టులు 'ప్రత్యేక తెలంగాణా'ను వ్యతిరేకించి ప్రజల్లో మరింత బట్టబయలయ్యారు. నిజమైన విప్లవకర శక్తులు ఈ పోరాటానికి చురుకుగా మద్దతునిచ్చాయి. అయితే పాలకవర్గాలు ఈ పోరాటాన్ని కూడా నెత్తుటేరుల్లో ముంచివేశాయి. 400 మంది యువతీయువకులు పోలీసు తూటాలకు బలయ్యారు. ఆనాడు ఆ ఉద్యమానికి నాయకత్వం వహించిన దోపిడీ పాలకవర్గాలు తెలంగాణాను మరోసారి వంచించాయి. అయితే తెలంగాణాను నిర్బంధాలూ, విద్రోహాలూ ఎల్లకాలం అణచలేకపోయాయి. ఇప్పటికీ 'ప్రత్యేక తెలంగాణా' నినాదం ఆరని కుంపటిలా రగులుకుంటూ ఉండడమే ఇందుకు నిదర్శనం.



చంద్రబాబు ప్రభుత్వ
ఫాసిస్టు హత్యాకాండకు బలైన
కామ్రేడ్ ఆర్కే (సుదర్శన్ రెడ్డి)

మహత్తర తెలంగాణా పోరాటం తర్వాత తెరమరుగైన నూతన ప్రజాస్వామిక విప్లవ పంథా, 1967లో నక్సల్బరీ వసంతమేఘ గర్జనతో మరోసారి భారత ప్రజల ఎజెండా పైకి వచ్చింది. రివిజనిజాన్నీ, నయా రివిజనిజాన్నీ ఛళ్లున చరిచి అసలైన విప్లవ కమ్యూనిస్టు పార్టీగా సిపిఐ (ఎం-ఎల్) ఆవిర్భవించింది. దేశవ్యాప్త విప్లవ పార్టీ నిర్మాణానికీ, భారత ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాల పరిపూర్తికీ అది పూనుకుంది. నక్సల్బరీ పోరాటం భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో గుణాత్మకంగా భిన్నమైన నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది.

నక్సల్బరీ నిప్పురవ్వ క్రమంగా తెలంగాణాలో రాజుకోసాగింది. నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాలతో విద్యార్థులు, మేధావులు, రచయితలు, కళాకారులు గొప్పగా ప్రభావితమయ్యారు. వాళ్లు 1970ల ప్రారంభం నుండి పలు ప్రజాసంగాలలో సంఘటితం కాసాగారు. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు దెబ్బతిన్నాక తెలంగాణా మరోసారి ఉద్యమ కేంద్రంగా ముందుకొచ్చింది. 1975 ఎమర్జెన్సీ చీకటి రోజుల్లో పార్టీపై మరో వేటు పడింది. బూటకపు ఎన్‌కౌంటర్లలో తెలంగాణా యువతరాన్ని హతమార్చే క్రమం మరోసారి ప్రారంభమైంది. తన సంకీర్ణ (సెక్టేరియన్) విధానాలను వదిలించుకున్నపార్టీ నాగపూర్‌లో జరుపుకున్న ప్రాంతీయ కాన్ఫరెన్స్ ద్వారా తిరిగి సంఘటితం కాసాగింది. ఆ తర్వాత 1977-78 నాటికి తెలంగాణాలోని ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల రైతాంగ పోరాటాలు ముందుకు వచ్చాయి. పల్లెలన్నీ భగ్గుమన్నాయి. వెల్లువెత్తిన ప్రజా పోరాటాలతో పల్లెల్లోని భూస్వాముల ఆధిపత్యం దెబ్బతినసాగింది. తిరిగి రైతులు రైతుకూలీ సంగాలలో వేలాదిగా సంఘటితమయ్యారు. త్వరలోనే ఉద్యమం పొరుగు జిల్లాలకూ, ప్రాంతాలకూ, రాష్ట్రాలకూ విస్తరించింది. పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని అణచివెయ్యడానికి రాజ్యం దిగింది. చట్టం భూస్వామ్య శక్తులకు అండగా నిల్చింది. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. తెలంగాణా విప్లవ ప్రజానీకంపై అమానుష నిర్బంధం అమలు చేసారు. 1980లో పార్టీ తన 12వ కాన్ఫరెన్సును జరుపుకొంది. ఆ తర్వాత అది ప్రజలకు సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]గా పరిచయమయ్యింది. తెలంగాణా యువతరం పెద్ద ఎత్తున సాయుధ దళాలలో చేరారు. పార్టీ గెరిల్లాజోన్ల నిర్మాణానికి నడుం బిగించింది. తెలంగాణా ఉద్యమానికి తోడుగా, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లోనే గాకుండా పొరుగు రాష్ట్రాల్లోని బస్తర్-చాందా (చంద్రపూర్) జిల్లాల్లోకీ మరోసారి విస్తరించింది. ఈ జిల్లాల్లోని ఉద్యమం నేడు దండకారణ్యా విప్లవోద్యమంగా పురోగమిస్తున్నది. భారత విప్లవోద్యమంలోనే ప్రముఖ స్థానాన్ని కలిగిన తెలంగాణా ఉద్యమానికి గత 23 ఏళ్లుగా వెనుకతట్టు ప్రాంతంగా అభివృద్ధి అవుతూ వస్తున్నది. విడదీయరాని సంబంధం గల ఈ రెండు ప్రాంతాల ఉద్యమాలు జమిలిగా పురోగమించడం పాలకవర్గాలకు వణుకుపుట్టిస్తున్నది.

## అలలుఅలలుగా సాగుతున్న పోరాటాలు – వెన్నంటి అమలవుతున్న నిర్బంధం

తెలంగాణాలో సాగుతున్న విప్లవోద్యమానికి చారిత్రకంగా ప్రాముఖ్యత ఉన్నట్టే తెలంగాణాలో కొనసాగుతున్న క్రూరమైన నిర్బంధకాండ కూడా భారత చరిత్ర పుటల్లో ఓ చీకటి అధ్యాయంగా నిలిచిపోతుంది. 70వ దశకం చివర్లో జరిగిన జగిత్యాల జైత్రయాత్ర నుండి నేటి దాకా అప్రతిహతంగా సాగుతున్న విప్లవోద్యమాన్ని అణచివేయడానికి పాలకవర్గాలు ఇప్పటికి మూడు దఫాలుగా నిర్బంధకాండను ప్రయోగించాయి. 1985లో అప్పటి ఎన్‌టిఆర్ ప్రభుత్వం తెలంగాణా ఉద్యమంపై తొలి అణచివేత క్యాంపెయిన్ ప్రారంభించింది. అప్పటికి ప్రజాపోరాటాల ధాటికి పల్లెలనొదిలి పరుగుతీస్తున్న భూస్వాముల అధికారాన్ని నిలబెట్టడానికి పోలీసులు ప్రజలపై క్రూరంగా విరుచుకుపడ్డారు. అనేక మంది విప్లవకారులను, గ్రామీణ యువతరాన్ని బూటకపు ఎన్‌కౌంటర్లలో హతమార్చారు. మనుషుల్ని మాయం చేసి హత్య చేసే మధ్యయుగాల నాటి నిర్బంధ పద్ధతులు ఈ

కాలంలోనే మొదలయ్యాయి. ప్రజల్ని మూకుమ్మడిగా అరెస్టు చేయడం, జైలుకు పంపడం, చిత్రహింసలు పెట్టడం, ఇండ్లు కాల్చడం, ఆస్తుల్ని ధ్వంసం చేయడం, పంటపొలాల్లో గొడ్లను మేపడం – ఇలా ఎన్నో పద్ధతుల్లో నిర్బంధం కొనసాగింది. అయినా ప్రజలు లొంగలేదు. పోరాటం ఆగిపోలేదు. నష్టాల్ని పూడ్చుకొని ఉద్యమం క్రమంగా మరోసారి వెల్లువెత్తింది. మహత్తర తెలంగాణా సాయుధ పోరాటం తర్వాత మరోసారి పెద్ద ఎత్తున భూఆక్రమణ పోరాటాలు ప్రజ్వరిల్లాయి. భూస్వాముల నుండి వేలాది ఎకరాల పట్టాభూముల్ని స్వాధీనం చేసుకున్నారు. నాగళ్లకు ఎర్రజెండాలు కట్టి భూములను దున్నారు.

ఆ తర్వాత కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 1992 నుండి 1994 వరకు రెండో దఫా దాడిని కొనసాగించాయి. తెలంగాణా పల్లెల్లో పెద్ద ఎత్తున సరిహద్దు భద్రతా బలగాల్ని దించి పార్టీనీ, గెరిల్లా దళాలనూ, ప్రజా సంఘాలనూ సమూలంగా నిర్మూలించి భూస్వామ్య అభివద్ధినిరోధక పాలనను నిలబెట్టాలని వెర్రిగా ప్రయత్నించారు. ఈ దాడి మొదటిదానికన్నా చాలా తీవ్రమైంది. గ్రామాలను చక్రబంధంలో ఇరికించి ప్రజలందరినీ కుప్పగా పోగేసి సంగ నాయకుల్ని వేరు చేసి ప్రజల ముందే కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కథలల్లడం ఒక సాధారణ నిర్బంధ రూపంగా మారింది. పెద్ద సంఖ్యలో యువతీయువకుల్ని మాయం చెయ్యడం, చంపేసి గుర్తు తెలియని శవాలుగా ప్రకటించడం కొనసాగింది. దళాల సమాచారం దొరకగానే వందలాది పోలీసు బలగాలు గ్రామాలను చుట్టుముట్టి కాల్పులు జరుపసాగాయి. ఈ నిర్బంధకాండ ప్రజలకు ఊపిరి సలపనివ్వలేదు. అయితే మొదటి దాడిని ఓడించిన అనుభవంతో ప్రజలు ప్రతిఘటనను దృఢంగా కొనసాగించారు. విప్లవోద్యమం తెలంగాణాలో మరిన్ని ప్రాంతాలకు విస్తరించింది. గెరిల్లా బలగాలు అభివృద్ధి చెందాయి. కూలిపోయిన భూస్వామ్య పాలన స్థానంలో గ్రామస్థాయిలో ప్రజా రాజ్యాధికార అంగాల్ని ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. 'ఒక వీరయోధ మరణిస్తే ప్రభవింతురు వేనవేలు' అన్నది తెలంగాణా అనుభవంలో అనేక సార్లు రుజువయ్యింది. నేలకొరిగిన వీరుల స్థానంలో ప్రజా ఉద్యమమే అనేక మందిని నాయకులుగా తీర్చిదిద్దింది.




చంద్రబాబు ప్రభుత్వ ఫాసిస్టు హత్యాకాండకు బలైన
కామ్రేడ్ లలిత (అరుణ)

అయితే 1998 నుండి ఇప్పటి దాకా కొనసాగుతున్న మూడవ దాడి చరిత్రలోనే అతి క్రూరమైన దాడుల్లో ఒకటిగా నిలుస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత సమన్వయంతో, నక్సలైటు ఉద్యమం గల అన్ని రాష్ట్రాలతో ఏర్పాటు చేసిన జాయింట్ ఆపరేషనల్ కమాండ్ (జెఓసి) మార్గదర్శకత్వంలో ఈ దాడి కొనసాగుతోంది. ప్రత్యేకించి ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల మధ్య మరింత సమన్వయాన్ని నెలకొల్పుకొని తెలంగాణాను అనుకొని ఉన్న దండకారణ్యం, ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు ప్రాంత గెరిల్లాజోన్లను అణచడానికి కూడా పాలకవర్గాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ దాడిలో గ్రేహౌండ్స్ బలగాల్ని ప్రజలపైకీ, దళాలపైకీ ఉసిగొల్పుతున్నారు. లక్షలాది రూపాయల్ని గుమ్మరించి పటిష్టమైన ఇన్‌ఫార్మర్ యంత్రాంగాన్ని నిర్మిస్తున్నారు. దళాలలోకి కోవర్టు పద్ధతుల్లో ఇన్‌ఫార్మర్లను చొప్పించి ఉద్యమ నాయకత్వాన్ని హతమార్చడానికి పథకాలు చేస్తున్నారు. లొంగిపోయిన నక్సలైట్లనూ, సంఘవ్యతిరేక శక్తులనూ చేరదీసి నల్లదండు ముఠాలను ఏర్పర్చారు. విప్లవోద్యమానికి మద్దతుగా నిల్చిన ప్రజా సంఘాల నాయకులనూ, మేధావులనూ బాహాటంగా హతమార్చే పాశవిక పద్ధతులను ప్రయోగిస్తున్నారు. ఉద్యమ అణచివేతకు ఒక్క నిర్బంధాన్నే కాకుండా సామ్రాజ్యవాదుల ఎల్ఐసి వ్యూహంలో భాగంగా సంస్కరణలను కూడా పెద్ద ఎత్తున ప్రవేశపెట్టి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వీటి ద్వారా ప్రజల్లో ఒక సెక్షన్‌ను చీల్చి ప్రభుత్వం వైపుకు తిప్పుకొని వారిపై ఆధారపడుతూ విప్లవోద్యమాన్ని అణచివేసే పద్ధతుల్ని అనుసరిస్తున్నారు. బహుముఖ దాడిగా కొనసాగుతున్న ఈ దాడిలో దుష్ప్రచారం కూడా ఒక ముఖ్యమైన అంశంగా ఉంటున్నది. పాలకవర్గాల బాకాలైన పత్రికలనూ, రేడియో, టీవీలనూ ఉపయోగించుకొని విప్లవోద్యమంపై విషం గక్కుతూ దుష్ప్రచారం చేస్తున్నారు.

## తెలంగాణాపై ఈ దాడి ఎందుకు జరుగుతోంది?

భూస్వామ్యాన్నీ, దళారీ నిరంకుశ పెట్టుబడినీ, వారికి అండగా ఉన్న సామ్రాజ్యవాదాన్నీ నిర్మూలించే లక్ష్యంతో కొనసాగుతున్న ప్రస్తుత విప్లవోద్యమాన్ని అణచకుండా పాలకవర్గాలు తమ వర్గ దోపిడీని నిరాటంకంగా కొనసాగించలేవు. తమ దోపిడీ పాలనను నిలబెట్టుకోవడానికే విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలని ప్రయత్నిస్తున్నాయి. అట్లాగే అనేక సంపదలకూ, వనరులకూ నిలయమైన తెలంగాణాను దోచుకోవాలంటే ఇక్కడ కొనసాగుతున్న విప్లవోద్యమం సామ్రాజ్యవాదులకూ, వారి దళారీలకూ పెద్ద అడ్డంకిగా ఉంది. ప్రజల ప్రయోజనాలను ప్రపంచబ్యాంకుకు తాకట్టు పెట్టి, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను సమర్థంగా అమలు చేస్తున్న నెంబర్ వన్ దళారీ చంద్రబాబు నక్సలైటు ఉద్యమం మూలంగా తెలంగాణాకు పెట్టుబడులు రావడం లేదని బాహాటంగానే మాట్లాడుతున్నాడు. అందుకే ఈ ఉద్యమాన్ని ఎలాగైనా అణచివేసి తెలంగాణాను బహుళజాతి కంపెనీల జాగీరుగా మార్చాలని కంకణం కట్టుకున్నాడు.

నక్సల్బరీ, శ్రీకాకుళ ఉద్యమాల వెనుకంజ తర్వాత విప్లవ శక్తులు ముక్కలుచెక్కలు కాగా తప్పుల నుండి నేర్చుకున్న గుణపాఠాలతో భారత విప్లవాన్ని మరో మెట్టు ముందుకు పురోగమింపజేయడంలో ప్రముఖ పాత్ర నిర్వహించడం *(తరువాయి 30వ పేజీలో .....)*



# ప్రజా గెరిల్లా బలగాల చేతిలో పామేడ్ పోలీసుల అరెస్టు - విడుదల

జూన్ 17న దక్షిణ బస్తర్ డివిజన్‌లో పామేడ్ పోలీసు స్టేషన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులను పిజిఏ అరెస్ట్ చేసి రెండు రోజుల నిర్బంధం తర్వాత వారిని ఏమీ చేయకుండా విడిచిపెట్టింది. ఇలాంటి ఘటన దండకారణ్య ఉద్యమ చరిత్రలో మొదటిది. దానితో ప్రజల్లో రకరకాల చర్చలు జరిగాయి. పత్రికలలో రకరకాల వ్యాఖ్యానాలు చేసారు. పిజిఏ గెరిల్లాల కస్టడీ నుండి విడుదలైన తర్వాత పామేడ్ థానేదార్ సిసోదియా "నక్సలైట్లు మాతో బాగా వ్యవహరించారు... వాళ్లు నిర్వహిస్తున్న భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం కొట్టివేయాల్సిన విషయమేమీ కాదు" అని మాట్లాడాడు. ఆ విధంగా ఆయన తమ ఉన్నతాధికార్లు "హింస తప్ప నక్సలైట్లకు వేరే ఆశయం ఏదీ లేదు"ని చేస్తున్న దుష్ప్రచారానికి జవాబు చెప్పినట్టయింది. గతంలో మాన్‌పూర్ (రాజ్‌నాంద్‌గాం) పోలీసు స్టేషన్‌పై రెయిడ్ సందర్భంగా లొంగిపోయిన పోలీసులను కూడా గెరిల్లాలు ఎలాంటి హానీ చేయకుండా విడిచిపెట్టారు. అయితే ఇది కిడ్నాప్ ఘటన కావడంతో ప్రజలలో బాగా స్పందన లభించింది.

విప్లవోద్యమాన్ని అణచివెయ్యడానికి జోగి ప్రభుత్వం ప్రత్యేకించి గత మార్చ్ నెల నుండి పోలీసు నిర్బంధాన్ని తీవ్రతరం చేసింది. ఉద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా సమన్వయంతో నిర్బంధ చర్యలను ముమ్మరం చేశాయి. బస్తర్‌లో రెండు బెటాలియన్ల సిఆర్‌పి బలగాలను దింపి బస్తర్‌ను పోలీసు శిబిరంగా మార్చి వేశాయి. సిఆర్‌పి, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్బంధ క్యాంపెయిన్‌ను ప్రారంభించాయి. ఇందులో భాగంగా అనేక గ్రామాలలో దాడులు చేసి వందలాది ప్రజలను అరెస్టు చేశారు. చిత్రహింసలు, అత్యాచారాలు, ఇండ్లు కాల్చడం, అమాయక రైతులపై కాల్పులు జరిపి గాయపర్చడం వంటి ఘటనలు గడచిన ఎండాకాలంలో మామూలయ్యాయి. ఈ నిర్బంధ క్యాంపెయిన్‌ను ఓడించడానికి పిజిఏ సైనికులు తమ సాయుధ ప్రతిఘటనా చర్యలను ముమ్మరం చేశారు. మొత్తం దండకారణ్యంలో పిజిఏకు చెందిన మూడు బలగాలూ ప్రజల క్రియాశీల మద్దతుతో అనేక దాడులు చేసి సిఆర్‌పి బలగాల దూకుడుకు ఓ మేరకు కళ్లెం వేసాయి.

> *... లొంగిపోయిన పోలీసులకూ, నిరాయుధులైన పోలీసులకూ పిజిఏ ఎలాంటి హానీ చేయదు — అయితే వాళ్లు ఎలాంటి ప్రజా వ్యతిరేక, విప్లవ వ్యతిరేక గూఢచర్య కార్యకలాపాలలోనూ భాగం అయి ఉండకూడదు ...*


ఆంధ్ర సరిహద్దును అనుకుని ఉండే దక్షిణ బస్తర్ పామేడ్ ప్రాంతంలో కూడా పోలీసులు ఎండాకాలంలో పెద్ద ఎత్తున ఏరివేత చర్యలు చేపట్టారు. వీటికి జవాబుగా పిజిఏ సైనికులు చర్ల (ఆంధ్ర) - పామేడ్ రోడ్డుపై ఆంబుష్‌కు పథకం తయారు చేసుకున్నారు. ఈ రోడ్డు గుండా పోలీసులు తరచుగా రాకపోకలు సాగిస్తుంటారని పిజిఏకు స్పష్టమైన సమాచారం. బస్తర్‌లో తీవ్రతరమవుతున్న పిజిఏ దాడుల ఫలితంగా పోలీసులు కొన్ని సార్లు పౌరదుస్తులలో తిరగడమే మేలని భావించి ఆయుధాలు లేకుండా మఫ్టీలో కూడా వస్తున్నారు. దాడి రోజు కూడా ఎక్కువ మంది పోలీసులు నిరాయుధంగా, మామూలు దుస్తులలో వచ్చారు. పిజిఏ సైనికులు నిరాయుధులను చంపగూడదనే తమ విధానానికి అనుగుణంగా వాళ్లను అరెస్టు చేయాలని నిశ్చయించుకున్నారు. మోటారుసైకిళ్లపై వస్తున్న పోలీసులను చుట్టుముట్టి వాళ్లను సరెండర్ కావల్సిందిగా హెచ్చరించారు. వాళ్లను ఆపడం కోసం గాలిలోకి కాల్పులు కూడా జరిపారు. ఒకరిద్దరు పోలీసులు పారిపోవడానికి ప్రయత్నించగా గెరిల్లాలు వారి వెంటబడి పట్టుకున్నారు. ఈ ప్రయత్నంలో థానేదార్ సిసోదియాకు కాలిపై స్వల్పంగా గాయమయ్యింది. అతడి దగ్గరి నుండి పిజిఏ సైనికులు 9 ఎంఎం పిస్తోలును స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టు చేసిన నలుగురు పోలీసులను గెరిల్లాలు తమతో పాటు అడవిలోకి తీసుకెళ్లారు. వారిలో ఇద్దరిని 24 గంటల తర్వాత విడుదల చేశారు. వారి ద్వారా పిజిఏ ఒక డిమాండ్ల పత్రాన్ని పంపించింది. గ్రామాలపై పోలీసు దాడుల్ని నిలిపివేయాలనీ; గస్తీ, ఏరివేత తదితర కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలనీ; సిఆర్‌పి బలగాలను వెనక్కి పంపించాలనీ పిజిఏ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల గురించి పేపర్లలోనూ, రేడియోలోనూ బాగా ప్రచారం జరిగింది. మొదట పోలీసు అధికార్లు నక్సలైట్లను వెదికి పట్టుకుంటామనీ, పోలీసులను విడిపిస్తామనీ, ఆంధ్ర పోలీసులను రప్పిస్తామనీ ప్రగల్భాలు పలికారు. కానీ చివరకు వాళ్లు గస్తీనీ, దాడులనూ ఆపివేస్తున్నామనీ ప్రకటించక తప్పలేదు. ఈ ప్రకటన వెలువడ్డ తర్వాత పిజిఏ సైనికులు థానేదార్ సహా ఇద్దరు పోలీసులను విడిచిపెట్టారు.

ఈ చర్య ద్వారా పిజిఏ ప్రజలకు, ముఖ్యంగా సాధారణ పోలీసు ఉద్యోగులకు తన విధానాన్ని స్పష్టంగా తెలియజెప్పింది : లొంగిపోయిన పోలీసులకూ, నిరాయుధులైన పోలీసులకూ పిజిఏ ఎలాంటి హానీ చేయదు - అయితే వాళ్లు ప్రజా వ్యతిరేక, విప్లవ వ్యతిరేక గూఢచర్య కార్యకలాపాలలో భాగం అయి ఉండకూడదు. తమ విడుదల తర్వాత పోలీసులు విలేఖరుల సమావేశంలో పిజిఏ సైనికుల వ్యవహరించిన తీరుపై సానుకూలంగా మాట్లాడారు. వాళ్లు విప్లవోద్యమ లక్ష్యాల పట్ల సానుభూతిని ప్రకటించారు. వాళ్లు పోరాట ప్రాంతంలో ఇకపై డ్యూటీ చేయమని ప్రకటించారు. ప్రజలను పక్కదారి పట్టించడం కోసం "నక్సలైట్ల మతిలేని విచ్చలవిడి హింస" గురించి చెవులు చిల్లులుపడేలా మాట్లాడే పోలీసు అధికార్లకూ, దోపిడీవర్గ నాయకులకూ ఈ మొత్తం ఉదంతంతో పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయ్యింది. ✪

# యుద్ధంలో మానవుడి ప్రతిభావంతమైన పాత్ర

... ఏ సమస్యను కూడ స్వీయాత్మక ధోరణితో పరిశీలించకూడదు. అంటే అర్థమేమిటి? అంటే వాస్తవ విషయాలపైన మాత్రమే అంచనాలు ఆధారపడాలి. లేకపోతే ఆలోచనలు ఊహాగానంపై ఆధారపడి ఉంటాయి. వాటిపై ఆధారపడి కార్యాచరణకు పూనుకుంటే ఓటమి తప్పదు. కానీ ఏ కార్యక్రమమైనా మానవుల చేతనే నిర్వహించబడాలి. దీర్ఘకాల యుద్ధము, అంతిమ విజయం మానవ కార్యాచరణ లేకుండా సాధ్యం కాదు. కార్యాచరణ ఫలితాన్ని సాధించాలంటే, వాస్తవ విషయాలపై ఆధారపడి ఆలోచనలు, సూత్రాలు, అభిప్రాయాలు సూత్రీకరించే వ్యక్తులుండాలి. వారు ప్లానులు, ఆదేశికాలు (directives), విధానాలు, వ్యూహం, ఎత్తుగడలు తయారుచేయ్యాలి. **ఆలోచనలు మొదలయినవి స్వీయాత్మకమైనవి. కార్యాచరణ ద్వారానే ఈ ఆలోచనలు అమల్లోకి వస్తాయి. ఈ రెండు అంశాలు మానవుడికి గల ప్రత్యేకమైన ప్రతిభావంత పాత్రను** ప్రదర్శించుతాయి. ఈలాంటి ప్రతిభావంతమయిన పాత్రనే 'చైతన్యంతో కూడిన మానవుడి పాత్ర" అని అంటాం. ఇక్కడే ఇతర జీవరాసులకు భిన్నమయిన మానవుడి ప్రత్యేక లక్షణాన్ని మనం చూస్తాం. వాస్తవ విషయాలపై ఆధారపడిన, **వాస్తవ విషయాలకు దగ్గరగా వున్న ఆలోచనలే సరైన ఆలోచనలు. సరైన** ఆలోచనలపై ఆధారపడిన **కార్యాచరణే సరైన కార్యాచరణ. ఈ ఆలోచనలకు, కార్యాచరణకు మనం సంపూర్ణ అవకాశమివ్వాలి.** అంటే మానవుడి ప్రతిభావంతమయిన పాత్రకు సంపూర్ణ అవకాశమివ్వాలి. జపాను వ్యతిరేక యుద్ధ లక్ష్యం – సామ్రాజ్యవాదాన్ని తరిమివేయటం, పాత చైనాను కొత్త చైనాగా రూపొందించటం. మొత్తం చైనా ప్రజలను సమీకరించటం ద్వారానే, ఈ లక్ష్యం సాధించబడుతుంది. జపాను ప్రతిఘటనలో చైనా ప్రజల చైతన్యవంతమైన వీరోచిత పాత్రకు సంపూర్ణ అవకాశం కల్గించినపుడే ఈ లక్ష్యం సాధించబడుతుంది. ఏలాంటి కార్యాచరణ లేకుండా, చేతులు ముడుచుకొని కూర్చొనివుంటే, మనకు దీర్ఘకాల యుద్ధమూ లేదు. అంతిమ విజయమూ లేదు. ఓటమి మాత్రమే మిగులుతుంది.



*ఇటీవలే మన పార్టీ దండకారణ్యా స్పెషల్‌జోన్ 3 మహాసభ మొదటి ప్లీనం జరుపుకొని* **"పిజిఏ యొక్క యుద్ధ సామర్థ్యాన్ని పెంపొదిద్దాం. ప్రజా యుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారా శత్రుదాడిని ఓడిద్దాం!"** *అనే కేంద్ర కర్తవ్యంతో పాటు,* ***"పార్టీని సంఘటితపర్చుడం, సైనిక రంగాన్ని బలోపేతం చేయడం, ఐక్య సంఘటనకు పునాదులు వేయడం"*** *అనే మూడు ముఖ్య కర్తవ్యాలను చేబట్టింది.*

*మన పార్టీ ఇప్పటికే 12 రాష్ట్రాల్లో విప్లవోద్యమాన్ని విస్తరించుకోగల్గింది. గ్రామీణ ప్రాంతాలు, పీడిత ప్రజానీకం పునాదిగా వ్యవసాయ విప్లవం విజయవంతం చేయడానికి వర్గ పోరాటాన్ని తీవ్రతరం చేస్తున్నది. బేస్ ఏరియాల నిర్మాణానికి అనుకూల టెర్రయిన్ గల వ్యూహాత్మక ప్రాంతాలపై కేంద్రీకరిస్తోంది.*

*మనది దీర్ఘకాల యుద్ధం. మావో చెప్పినట్లు విప్లవ విజయవంతం కావాలంటే పార్టీ, ప్రజాసైన్యం, ఐక్య సంఘటన అవసరం. వీటిలో మొదటి రెండూ మనకు ఉన్నాయి. ఐక్య సంఘటన విషయంలో ఇంకా తగినంత ఆచరణ, అనుభవం సంపాదించవలసే ఉంది. పై మూడు కర్తవ్యాలు నిర్వర్తించడంలో మానవుని పాత్ర, యుద్ధం-రాజకీయాలు, యుద్ధానికి రాజకీయ సమీకరణ – వీటి మధ్య గల అంతస్సంబంధం, వాటిలో దేనికి ఎలాంటి ప్రాముఖ్యత వుందో తెలుసుకోడానికి ఉపయోగపడుతుందని కా.మావో* **'దీర్ఘకాల యుద్ధం'** *వ్యాసంలో నుండి కొన్ని భాగాలను ఆయన 27వ వర్థంతి సందర్భంగా అందిస్తున్నాం.*

***- సంపాదక వర్గం***

... చైతన్యయుతమైన ప్రతిభావంత పాత్రను నిర్వహించడం మానవుడి ప్రత్యేక లక్షణం. యుద్ధములో ఈ లక్షణాన్ని మానవుడు బలంగా ప్రదర్శించుతాడు. ఇరుపక్షాలలోని మిలిటరీ, రాజకీయ, ఆర్థిక, నైసర్గిక పరిస్థితులపైన, ఇరుపక్షాలు సాగించుతున్న యుద్ధ స్వభావంపైన, ఇరుపక్షాలకు లభ్యమయ్యే అంతర్జాతీయ సహకారంపైన, యుద్ధంలో విజయం లేక ఓటమి ఆధారపడే మాట వాస్తవమే, కాని ఇవి మాత్రమే యుద్ధ ఫలితాన్ని నిర్ణయించలేవు. ఈ అంశాలు యుద్ధములో విజయానికి, లేక ఓటమికి అవకాశాలను కల్పిస్తాయి కాని, వాటంతటవే అంతిమ ఫలితాన్ని నిర్ణయించలేవు. ఈ అంశాలకు తోడుగా స్వీయాత్మక కృషి, అంటే యుద్ధ నిర్వహణ, యుద్ధంలో మానవుడి చైతన్యయుతమైన ప్రతిభావంత పాత్ర కలసినపుడే అంతిమ ఫలితం నిర్ణయించబడుతుంది.

... విజయ సాధనకు కృషి చేసేటపుడు, యుద్ధ నిర్వాహకులు భౌతిక పరిస్థితులు కల్పించే పరిమితులను అధిగమించ లేరు. ఈ పరిమితుల్లో మాత్రమే విజయం సాధించుటకు ప్రతిభావంతమైన పాత్రను నిర్వహించగలరు, నిర్వహించాలి కూడా. భౌతిక

## 27వ వర్థంతి సందర్భంగా కామ్రేడ్ మావోకు విప్లవ నివాళులు !

అవకాశాలపై ఆధారపడి యుద్ధములో కమాండర్ల కార్యాచరణ రంగస్థలం నిర్ణయించుకోవాలి. నిర్ణయించుకున్న ఈ రంగస్థలంపై మాత్రం శబ్దం, రంగు, శక్తి గల్గిన అద్భుతమయిన నాటక ప్రదర్శనల నిర్వహణకు కమాండర్లు పూనుకోవలసి ఉంటుంది. భౌతిక, వాస్తవిక పునాదులపై జపాను వ్యతిరేక యుద్ధములో కమాండర్లు తమ శక్తినంతా ప్రదర్శించాలి. వివిధ శక్తులను సమీకరించుకొని జాతీయ శతృవును నిర్మూలించాలి. దురాక్రమణకు, అణచివేతకు గురవుతున్న ప్రస్తుత మన దేశ దౌర్భాగ్య స్థితిని తొలగించాలి. స్వాతంత్ర్యం, సమానత్వం ప్రాతిపదికపై నూతన చైనాను నిర్మించాలి. యుద్ధము నిర్వహణలో మన స్వీయాత్మక శక్తి ఇక్కడే ప్రదర్శించగలం, ప్రదర్శించాలి కూడా. యుద్ధంలో మన కమాండర్లలో ఎవరూ భౌతిక పరిస్థితులకు దూరం కాకూడదు. దుస్సాహసిక చర్యలకు పూనుకోకూడదు. కాని అదే సమయంలో మన కమాండర్లలో ప్రతి ఒక్కరూ తెలివితేటలు, ధైర్యసాహసాలు రెండూ ప్రదర్శించాలి. శత్రువుపై బలాధిక్యత సంపాదించగల్గిన ధైర్యసాహసాలు మన కమాండర్లు ప్రదర్శించాలి. అంతేగాదు, మొత్తం యుద్ధ కాలంలో సంభవించే అనేక ఒడుదుడుకులను తట్టుకోగలిగిన దిట్టతనం మన కమాండర్లు ప్రదర్శించాలి. యుద్ధము అనే సముద్రంలో మధ్యలో మునిగిపోకుండా ఉండటమే గాక, జాగ్రత్తగా ఈదుకుంటూ అవతలిగట్టు చేరుకోగల్గాలి. **యుద్ధ నిర్వహణకు అవసరమయిన వ్యూహం-ఎత్తుగడలు యుద్ధము అనే సముద్రంలో ఈత నైపుణ్యం వంటివి.**

## యుద్ధం - రాజకీయాలు

... "రాజకీయాల కొనసాగింపే యుద్ధము"– ఈ దృష్టితో చూసినప్పుడు యుద్ధము రాజకీయాలే, యుద్ధమే ఒక రాజకీయ కార్యాచరణ. పురాతన కాలం నుండి రాజకీయ స్వభావం లేని యుద్ధం అంటూ లేదు. జపాను వ్యతిరేక యుద్ధం విప్లవ యుద్ధం. మొత్తం దేశం సాగించుతున్న యుద్ధం ఇది. దీనిలో విజయం యుద్ధ రాజకీయ లక్ష్యంతో విడదీయరానిది. దీని రాజకీయ లక్ష్యం సామ్రాజ్యవాదాన్ని తరిమివేసి స్వాతంత్ర్యం, సమానత్వం ప్రాతిపదికపై నూతన చైనాను నిర్మించడం. ప్రతిఘటనా యుద్ధాన్ని, ఐక్య సంఘటనను పట్టుదలతో కొనసాగించడం, దేశ ప్రజలందరి సమీకరణ, సైనికాధికారులు, సైనికుల మధ్య ఐక్యతకు, అవసరమైన రాజకీయ సూత్రాలు, సైన్యం, ప్రజల మధ్య ఐక్యత, శత్రు సైన్యాలను క్షీణింపచేయుట, ఐక్య సంఘటనా కార్యక్రమాన్ని శక్తివంతంగా అమలుపరచడం, సాంస్కృతిక సమీకరణ, అంతర్జాతీయ సహకారం, జపాను ప్రజల సహకారం సంపాదించుటకు కృషి మొదలగు అంశాలన్నింటితోనూ యీ యుద్ధ విజయం ముడిపడి వుంది. క్లుప్తంగా చెప్పాలంటే, యుద్ధాన్ని రాజకీయాల నుండి ఒక్క క్షణం కూడా విడదీయుటకు వీలు లేదు. యుద్ధాన్ని రాజకీయాల నుండి విడదీసి, జపాను వ్యతిరేక సైన్యంలో రాజకీయాల ప్రాముఖ్యత తగ్గించకూడదు. యుద్ధం యుద్ధం కొరకే సాగాలి అనే సూత్రం పాటించకూడదు. అలాంటి ధోరణి తప్పు. దానిని సరిచేయాలి.

... కాని యుద్ధానికి నిర్దిష్టమైన లక్షణాలున్నాయి. ఈ దృష్టితో చూసినప్పుడు, సాధారణ రాజకీయాలతో సమానంగా యుద్ధాన్ని చూడకూడదు. "ఇతర మార్గాల ద్వారా ...... రాజకీయాల కొనసాగింపే యుద్ధం". రాజకీయాలు ఒక స్థాయికి అభివృద్ధిచెంది, సాధారణ పద్ధతిలో అవి ముందుకు కొనసాగలేని పరిస్థితి ఏర్పడినప్పుడు, దాని దారి మధ్యలో ఏర్పడే అడ్డంకులు తొలగించుకోవడానికి యుద్ధం ప్రారంభమవుతుంది. ఉదాహరణకు, చైనా అర్ధ స్వతంత్ర దేశం. ఈ ప్రతిపత్తి జపాను సామ్రాజ్యవాద రాజకీయాభివృద్ధికి అడ్డంకిగా ఉంది. అందువల్లే ఈ అడ్డంకిని తొలగించుకొనుటకు జపాను దురాక్రమణ యుద్ధాన్ని ప్రారంభించింది. చైనా సంగతి ఏమిటి? చైనా బూర్జువా ప్రజాస్వామిక విప్లవానికి సామ్రాజ్యవాద పెత్తనం అడ్డంకిగా ఉంది. ఈ అడ్డంకిని తొలగించుకోవడానికి అనేక విముక్తి యుద్ధాలను చైనా సాగించింది. చైనాను అణచిపెట్టి వుంచడానికి, చైనా విప్లవాన్ని సంపూర్ణంగా అరికట్టడానికి జపాను ఈ యుద్ధాన్ని ప్రారంభించింది. అందువల్లే, ఈ అడ్డంకిని తొలగించుకోవడానికి జపాను వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధాన్ని చైనా సాగించుతూ వుంది. ఈ అడ్డంకి తొలగించబడినపుడు, మన రాజకీయ లక్ష్యం సాధించబడుతుంది. యుద్ధం ముగింపు చేయబడుతుంది. ఈ అడ్డంకి సంపూర్ణంగా తొలగించబడినపుడు, లక్ష్యం సంపూర్ణంగా సాధించబడే వరకు యుద్ధం కొనసాగించవలసి వుంటుంది. అందువల్ల జపాను వ్యతిరేక యుద్ధ లక్ష్యం పూర్తి అయ్యేదాకా, రాజీ ప్రబోధించేవారు ఓడిపోక తప్పదు. ఏదో ఒక కారణం చేత, తాత్కాలిక రాజీ ఏర్పడినప్పటికీ, తిరిగి యుద్ధం ప్రారంభం గాక తప్పదు. రాజకీయ లక్ష్యం సాధించబడే వరకు ప్రజలు లొంగిపోరు. యుద్ధాన్ని కొనసాగిస్తారు. అందువల్లే రాజకీయాలంటే రక్తపాతం లేని యుద్ధం అనీ, యుద్ధం అంటే రక్తపాతంతో కూడుకున్న రాజకీయాలు అని చెప్పగలుగుతాం.

... యుద్ధం యొక్క నిర్దిష్ట లక్షణాలను బట్టి, నిర్దిష్టమైన నిర్మాణ సంస్థలు, పద్ధతులు పనిక్రమం ఉత్పన్నమగుతాయి. నిర్మాణ సంస్థలంటే, సాయుధ సైన్యాలు, వాటితో ముడివేయబడిన ఇతర అంశాలు. పద్ధతులంటే యుద్ధ నిర్వహణకు అవసరమైన వ్యూహం-ఎత్తుగడలు. పనిక్రమం అంటే ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు ఏ రూపంలో, ఏ సామాజిక కార్యాచరణ ద్వారా దాడి సాగిస్తారు, ఒకరి నుండి మరొకరు ఎలా రక్షించుకుంటారు అనే అంశాలను సూచిస్తుంది. **యుద్ధ అనుభవమనేది ఒక ప్రత్యేక రకమైన అనుభవం. యుద్ధంలో పాల్గొంటున్న వారంతా తమ మామూలు పద్ధతులు విడనాడాలి. యుద్ధ పరిస్థితులకు అలవాటు పడాలి. అపుడే అంతిమ విజయము సాధించగలుగుతారు.**

## ప్రతిఘటనా యుద్ధానికి రాజకీయ సమీకరణ

... విస్తృతమైన సంపూర్ణమైన రాజకీయ సమీకరణ లేకుండా, మన దేశం సాగించుచున్న లాంటి జాతీయ విప్లవ యుద్ధంలో గెలుపు అసాధ్యం. జపాను వ్యతిరేక యుద్ధం ప్రారంభం కావడానికి ముందు జపానును ప్రతిఘటించడానికి ఎలాంటి రాజకీయ సమీకరణ జరిగి వుండలేదు. ఇది పెద్ద బలహీనత. అందువల్ల ప్రారంభంలో చైనా కంటే జపాను

పరిస్థితి మెరుగ్గా ఉంది. యుద్ధం ప్రారంభమైన తర్వాత కూడా రాజకీయ సమీకరణ అవసరమైనంత విస్తృతంగా గాని, సంపూర్ణంగా గాని సాగటం లేదు. శత్రు ఫిరంగుల మోత ద్వారాను, శత్రు విమానాలు వేస్తున్న బాంబుల మోత ద్వారా మాత్రమే అత్యధిక మెజారిటీ ప్రజలు మొదటిసారిగా యుద్ధము సంగతి తెలుసుకున్నారు. ఇది కూడా ఒక విధమైన సమీకరణే. కాని ఇది మనం చేసింది కాదు. శత్రువు చేసి పెట్టింది. ఇప్పటికి బాంబుల మోతకు దూరంగా మారుమూల ప్రాంతంలో వున్న ప్రజలు శాంతియుత జీవితాన్ని మామూలుగా సాగిస్తున్నారు. ఈ పరిస్థితి మారాలి. లేకపోతే ఈ జీవన్మరణ పోరాటంలో గెలుపు అసాధ్యము. శత్రువుకు మరొక సదవకాశాన్ని మనం జారవిడుచుకోరాదు. రాజకీయ సమీకరణను సంపూర్ణంగా కొనసాగించడం ద్వారా శత్రువుపై పైచేయి సాధించాలి. ఇది కీలకమైన సమస్య. ఆయుధాలు ఇతర విషయాలలోని మన బలహీనత రెండవ ప్రాముఖ్యత కల్గిన విషయాలు మాత్రమే. దేశ ప్రజలందరిని సమీకరించుట ద్వారా, ఆ సమీకరణతోనే శత్రువును పాతిపెట్టగలుగుతాము. అయుధాలు, ఇతర విషయాలలో మనకున్న బలహీనతను తద్వారానే అధిగమించగలుగుతాము. యుద్ధములో సంభవించే ప్రతి కష్టాన్ని అధిగమించుటకు అపుడే తగిన ప్రాతిపదిక ఏర్పడుతుంది. ప్రతిఘటనా యుద్ధాన్ని, ఐక్యసంఘటనను, దీర్ఘకాల యుద్ధాన్ని పట్టుదలతో కొనసాగించుట ద్వారానే విజయం సాధించగల్గుతాము. విజయాన్ని కాంక్షించుతూనే రాజకీయ సమీకరణ వదులుకోవటమంటే, ''బండిని ఉత్తరం వైపు ప్రయాణము సాగిస్తూ దక్షిణం వైపు చేరాల''ని కోరుకోవటం లాంటిది. దానివల్ల జరిగేది విజయాన్ని పోగొట్టుకోవడం మాత్రమే.

... **రాజకీయ సమీకరణ అంటే అర్థమేమిటి? మొదటిది, సైన్యం ప్రజలకు యుద్ధ రాజకీయ లక్ష్యాన్ని వివరించి చెప్పాలి. ప్రతి సైనికుడు, ప్రతి పౌరుడు యుద్ధానికీ తనకూ ఉన్న సంబంధం తెలుకోవాలి. యుద్ధం ఎందుకు కొనసాగించాలో తెలుసుకోవాలి.** ఈ యుద్ధం యొక్క రాజకీయ లక్ష్యం ''జపాను సామ్రాజ్యవాదాన్ని తరిమివేసి, స్వాతంత్ర్యం-సమానత్వం ప్రాతిపదికపై నూతన చైనాను నిర్మించుకోవడం''. ఈ సత్యాన్ని ప్రతి ఒక్కరికి, ప్రతి సైనికుడికి స్పష్టంగా తెలియజేయాలి. అపుడే దేశంలో జపాను వ్యతిరేక తుఫాను రేకెత్తించగలుగుతాం. రెండవది: యుద్ధ లక్ష్యం వారికి వివరించటమే చాలదు. దానిని సాధించటానికి అవసరమైన విధానాలు, తీసుకునే చర్యలు కూడా వివరించాలి. అంటే రాజకీయ కార్యక్రమాన్ని వివరించాలి. జపానును ప్రతిఘటించడానికి, దేశాన్ని కాపాడుకొనుటకు మనకు పది అంశాల కార్యక్రమం ఉంది. సాయుధ ప్రతిఘటన, జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమం మనకు ఉంది. ఈ రెండింటిని సైన్యంలోనూ, ప్రజలలోనూ వివరించి, వాటిని అమలుపరచుటకు ప్రతి ఒక్కరిని సమీకరించాలి. స్పష్టమైన నిర్దిష్టమైన రాజకీయ కార్యక్రమం లేకుండా జపాను వ్యతిరేక యుద్ధాన్ని చివరి దాకా కొనసాగించుటకు మొత్తం సైనికులను ప్రజలను సమీకరించడం అసాధ్యం. మూడవది: ఈ సమీకరణ ఎలా సాగించాలి? నోటి ప్రచారం, కరపత్రాలు, బులెటిన్‌లు, వార్తాపత్రికలు, పుస్తకాలు, నాటకాలు, సినిమాలు, విద్యాలయాలు, ప్రజా సంస్థలు, మన క్యాడర్లు – వీటన్నింటి ద్వారా ఈ సమీకరణ సాగాలి. కొమింగ్‌టాంగ్ ప్రాంతంలో ఈ సమస్యపై జరిగిన కృషి సముద్రంలో నీటి బిందువు లాంటిది మాత్రమే. అంటే చాల స్వల్పంగా మాత్రమే జరిగింది. జరిగిన సమీకరణ కూడా, ప్రజల అభిమతానికి అనుగుణ్యంగా జరుగలేదు. దీనిలో తీవ్రమైన మార్పు రావాలి. నాలుగవది: ఒకసారి సమీకరిస్తే చాలదు. **ప్రతిఘటనా యుద్ధానికి నిరంతరం సమీకరణ జరగాలి.** మన రాజకీయ కార్యక్రమాన్ని ప్రజలకు వేదవాక్యంలాగా చదివి వినిపించటం కాదు చేయవలసింది. వేదపఠనం ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదు. **యుద్ధ గతిలో వచ్చే మార్పులతో సైనికుల, ప్రజల జీవితంతో సమన్వయపరచి రాజకీయ సమీకరణ నిరంతరం కొనసాగాలి. ఇది చాలా ముఖ్యమైన సమస్య. దీని పైననే మన విజయం ప్రధానంగా ఆధారపడుతుంది.** ✪

*(వక్కాణింపులు మావి – సంపాదకవర్గం)*

---

*(..... 26వ పేజీ తరువాయి)*

తెలంగాణా ఉద్యమపు మరో ప్రత్యేకత. ఆంధ్రలోని ఇతర జిల్లాలలోనూ, పొరుగునే ఉన్న దండకారణ్యంలోనూ విప్లవోద్యమం వేళ్లూనుకోవడానికీ, బలపడడానికీ తెలంగాణా విప్లవోద్యమం దన్నుగా ఉంటూ వస్తున్నది కూడా వాస్తవం. అందుకే దేశంలో విప్లవోద్యమాన్ని నిర్మూలించడంలో భాగంగా తెలంగాణా విప్లవోద్యమాన్ని నామరూపాలు లేకుండా చేయడం తప్పనిసరి అని భావించి పాలకవర్గాలు ఈ దాడికి దిగాయి.

## మనం ఏం చేయాలి?

తెలంగాణా ఒంటరిగా లేదని ప్రకటిస్తూ మనం తెలంగాణా ప్రజానీకానికి అండగా నిలబడాలి. తెలంగాణాలో సాగుతున్న అమానుష నిర్బంధకాండను వీలైన అన్ని పద్ధతుల్లో ఖండించాలి. విప్లవోద్యమంపై కత్తిగట్టిన చంద్రబాబు నిరంకుశ పాలనను ముక్తకంఠంతో ఖండించాలి. ఆంధ్రప్రదేశ్‌ను ఉద్యమ అణచివేతలో ప్రయోగశాలగా మార్చివేయడాన్ని నిరసించాలి. పాలకవర్గాల పాశవిక బలగాలకు వ్యతిరేకంగా సమైక్య ప్రతిఘటనను అభివృద్ధిపర్చాలి. ఎంతటి అణచివేతను అమలు చేసినా తెలంగాణా విప్లవోద్యమం అణిగిపోదనీ, అక్కడి వీర ప్రజానీకం లొంగదనీ లోకానికి చాటి చెప్పాలి. కాలి బూడిదైన ప్రతిసారీ మరింత శక్తితో, మరింత తేజస్సుతో పుట్టుకొచ్చే ఫీనిక్స్ పక్షిలాంటిది తెలంగాణా అని దేశమంతటా చాటి చెప్పాలి.

తెలంగాణాలో తీవ్రంగా సాగుతున్న రాజ్య హింసకు వ్యతిరేకంగా **<u>నవంబర్ 1 నుండి 7 వరకు - వారం రోజుల పాటు</u>** దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని మన పార్టీ కేంద్రకమిటీ నిర్ణయించింది.. ఈ వారం రోజుల్లో మన పార్టీ, ప్రజా సంఘాలు నిర్వహించే వివిధ ర్యాలీలలో, సభలలో పెద్ద సంఖ్యలో పాల్గొనవల్సిందిగా మేం దండకారణ్య ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ సందర్భంగా ఫాసిస్టు చంద్రబాబు దిష్టిబొమ్మల్ని దగ్ధం చేసి రాజ్యహింసను ఖండించాల్సిందిగా మేం రైతుకూలీలనూ, కార్మికులనూ, విద్యార్థి-మేధావులనూ కోరుతున్నాం.

*విప్లవాభివందనలతో*

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

*సెప్టెంబర్ 2003*

భాకపా (మా-లె) [పీపుల్స్‌వార్]

# పోరుబిడ్డల రక్తంతో చైతన్యమవుతున్న గడ్‌చిరోలి గడ్డ ! అణచివేతను అధిగమిస్తూ సంఘటితంగా శత్రువు నెదిరిస్తున్న ప్రజా కదలిక !

గడచిన జనవరిలో అణగారిన జనసముద్రం మాన్పూర్‌ను ముంచెత్తింది. నిజానికి రాజనంద్‌గావ్ జిల్లాకు చెందినదైనా మాన్పూర్‌కు కదలిన జనం ఎక్కువమంది గడచిరోలి జిల్లాకు చెందిన మాన్పూర్‌కు పొరుగునున్న గ్రామాలవారు కావడం అక్కడి పోరాట విశేషం. అంతకు ముందు డిసెంబర్ 10న అహిరికి చెందిన మరిపెల్లిలోనూ అలాంటి ప్రజా కదలికే. తిరిగి ఏప్రిల్‌లో టిప్రాగఢ్ ప్రాంతంలోని గారపత్తిలో మరో ప్రజావెల్లువ. నిజానికి ఇలా కదిలివచ్చిన జనాలంతా ఎన్నోసార్లు పోలీసు స్టేషన్‌లు, క్యాంపులు తిరిగినవారే. ఇప్పటికీ తిరుగుతున్న వారేనన్నది మరువకూడదు. వారి శరీరాలన్నీ పోలీసు దెబ్బలకీ, పొద్దు పొడిచిన దగ్గర నుండి పొద్దు గూకేదాకా పోలీసు క్యాంపులు/స్టేషన్‌లలో చేసిన వెట్టిచాకిరితో కమిలిపోయినవన్నది బయటి ప్రపంచానికి తెలియని ఒక వాస్తవం. ఆ అమాయక ప్రాణులు పోలీసుల అమానుషానికి భార్య ముందు భర్త, భర్త ముందు భార్య, అన్న ముందు చెల్లెలు చెల్లెలి ముందు అన్న ఇలా ఎందరెందరో చిత్రహింసల పాలయ్యేరంటే కూడా 'నాగరిక' సమాజం నమ్మదేమో! అయితే ఆ జనం కదలికకు, వారి సంఘటిత శక్తికి, తెగింపుకు పాలకవర్గాలు బెంబేలెత్తాయి. పాలకవర్గాల ఊడిగంలో ప్రజలనణచిపెడుతున్న పోలీసు మూకలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని జనాల కాళ్లబేరాలకు వచ్చారు. దీని నేపథ్యం ఏమిటి? ప్రజల ధిక్కారం ఇప్పటిదేనా? గడ్‌చిరోలి జిల్లా లేదా విదర్భ ప్రాంతం మొత్తంలో జరుగుతున్నదేమిటి? పోలీసుల మొహరింపు ఎందుకుంది? ప్రత్యేక పోలీసులు, కమాండోలు ప్రజలను చుట్టుముట్టి సాగించే అధికారుల 'అభియాన్‌లు' ఎవరి ప్రయోజనాలు ఆశించి? అంతిమంగా జనం ఎందుకు సంఘటితంగా కదిలారు? ఆ తెగింపు ఎక్కడిది? విప్లవోద్యమంపై పాలకవర్గాల డేగ కన్ను ఎలాంటిది? గడ్‌చిరోలి ఎస్‌పి రాజవర్ధన్ 2005కల్లా నక్సలైట్ ఉద్యమాన్ని అణచివేస్తానని విర్రవీగడానికి దన్ను ఏమిటి? వీటన్నింటినీ చూద్దాం.

## 1. గడ్‌చిరోలి జిల్లాలో పోలీసు నిర్బంధం:

ప్రభుత్వ లెక్కల్లో గడ్‌చిరోలి మహారాష్ట్రకు చెందినదైనా '80ల నుండి విప్లవోద్యమ అభివృద్ధి క్రమంలో బస్తర్‌తో కలసి దండకారణ్యంలో భాగమైంది. ప్రభుత్వ రికార్డుల్లో 1982లో చంద్రపూర్ (చాందా) జిల్లా నుండి వేరుపర్చిన ఫలితంగా విడిగా ఒక జిల్లాగా ఇది అవతరించింది. జిల్లాలో 12 తాలూకాలుండగా వాటిలో 8 తాలూకాలను ప్రభుత్వం ఆదివాసీ తాలుకాలుగా ప్రకటించింది. వీటిలో ఒక్క ఆర్మూర్ తప్ప మిగిలిన వాటితో విప్లవోద్యమానికి సంబంధం ఉంది. ఆ సంబంధం రక్త సంబంధాన్ని మించిన వర్గానుబంధం. దశాబ్ద కాలంలో పెద్దిశంకర్ నుండి భాస్కర్ వరకు 12 మంది విప్లవకారుల అసమాన త్యాగాలతో ఆ బంధం పెనవేసుకపోయింది. అలా '90ల నాటికి 10 ఏళ్ల కాలంలో విప్లవోద్యమం జిల్లా ప్రజానీకంతో బలంగా పోరాటానుబంధం పెనవేసుకుపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ అణచివేత మొదలైంది. తొలిసారిగా 1991లో 'స్పెషల్ యాక్షన్ ప్లాన్' చేపట్టింది. దానితో '91-94ల మధ్య తీవ్రమైన నిర్బంధం, అణచివేతలు, బూటకపు ఎన్‌కౌంటర్లు 1993-94 నాటి సంవత్సర కాలంలో 60 మంది పోరాటయోధులు అసువులు బాశారు. గడ్‌చిరోలి ప్రజలు తీవ్ర నిర్బంధాన్ని చవిచూశారు. చంద్రపూర్, భండారా, గడ్‌చిరోలి జిల్లాల్లో రికార్డు స్థాయిలో పోలీసులు 5 వేల మంది ఆదివాసీ రైతాంగాన్ని 'టాడా' క్రింద నిర్బంధించారు. టాడా చట్టం దేశంలో రద్దయినా ఇప్పటికీ నమోదైన ఆ కేసుల్లోని రైతులు కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. తిరిగి ఇప్పుడీ జిల్లాలో ఆదివాసీ రైతాంగమే కాదు, వివిధ సెక్షన్‌ల వారు (పార్టీకి ఫండ్ ఇస్తున్నారనే ఆరోపణలతో టేకేదార్లు, సహకరించారంటూ షావుకార్లను, సంబంధాలున్నాయంటూ చదువుకుంటున్న విద్యార్థులను.. ఎలా ఎందరో) 'పోటా' కింద నిర్బంధించబడి జైల్లో ఉన్నారంటే నిర్బంధం ఎంతటిదో వివరించాల్సిన పనిలేదు. ఇలా దశాబ్దం పైబడి సాగే నిర్బంధం-అణచివేత గత మూడేళ్లుగా మరింత తీవ్రమైంది.

ఉదాహరణకు చెప్పుకోవాలంటే ఒక్క అహిరి ఏరియాలోనే 2001 ఆగస్టు-సెప్టెంబర్‌ల మధ్య ప్రజలను, ప్రజా సంఘాల వారిని 1,103 అరెస్టు చేశారు. వీరిలో 168 మందిని జైలుకు పంపి, మరో 421 మందిని వారానికోసారి పోలీసు స్టేషన్లలో చెప్పిన తారీఖులకు హాజరు కావాలని చెప్పి పోలీసులు వదిలారు (కేసులు లేకుండానే). ఇంకో 463 మందిని చిత్రహింసలకు గురిచేసారు. ఈ కాలంలోనే 20 వేల రైతుల ఫొటోలు బలవంతంగా తీసుకున్నారంటే పోలీసుల నిర్బంధ తీవ్రతను అర్థంచేసుకోవచ్చు. పోలీసుల చిత్రహింసల కారణంగా మిచ్చుగుండ రైతు ఒకరు ఈ మధ్య ఆత్మహత్య చేసుకున్నాడు.

అలాగే భామ్రాగడ్ ఏరియా కోహకపర్సి గ్రామరైతు చిన్నా మెట్టామి 2001 మార్చి 27న షికారుకు వెళ్లగా పోలీసులు కాల్చి చంపారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు మహారాష్ట్రలోకి రావడం ఏనాటికానాడు పెరుగుతోంది గానీ, నిజానికి మహారాష్ట్ర పోలీసులు సరిహద్దులు దాటి ఛత్తీస్‌గఢ్‌లోకి రావడం దశాబ్దం కిందటే ప్రారంభమైంది. 2000 ఆగస్టు 20న ఊసెవాడ గ్రామం (మాడ్ డివిజన్ ఏరియా) పై దాడిచేసి (అప్పటికే అది రెండోసారి) గట్టిగా 20 ఇళ్లయినా లేని చోట మహారాష్ట్ర పోలీసులు ప్రజలను హింసించి కప్పుకునే కంబళ్లతో సహా అన్నీ దోచుకుపోయారు. పశువులు కాసే పిల్లలు ఇద్దరు గుట్టపై నుండి ఇదంతా చూస్తుంటే వారిపై 20 రౌండ్లు కాల్పులు జరిపారు. పోతూపోతూ గోగ ఊసెండీ, ఎడ్మ పొదాటి అనే వృద్ధ రైతుల్ని తీసుకుపోతుండగా, మహిళలు అడ్డదారిన ఎదురునిలిచి ముఖ్యంగా గోగ భార్య 'వాళ్లను విడుస్తావా? చెప్పుతో కొట్టమంటావా?' అని తెచ్చిన పాత చెప్పును ఇన్‌స్పెక్టర్‌పైకి ఎత్తేసరికి భయపడిన పోలీసు మూకలు వదలిపెట్టి పోయారంటే గడ్‌చిరోలి పోలీసుల దుర్మార్గాలు ఎంతటివో అర్థం చేసుకోవచ్చు.

2002లో కూడ ఇలాంటి చరిత్రే. జిల్లా వ్యాప్తంగా వందల్లోనే అరెస్టుల లెక్కలు తేలతాయి. చిత్రహింసల తర్వాత కేసులతో 230 మందిని జైలుకు పంపారు. ఇతర విధాల పోలీసు బాధితుల గురించి

చెప్పాల్సిన పనే లేదు. 2003 లో కూడ చూస్తే జిల్లాలో జనవరి నుండి అరెస్టులు, చిత్రహింసల పర్వం సాగుతూనే ఉంది. ముఖ్యంగా ఏప్రిల్-జూన్ మధ్య 398 మందిని అరెస్టు చేసి 182 మందిని కేసులతో జైలుకి పంపారు.

సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే కూడా 'టాడా' 'పోటా' నిర్బంధితులను కలపకుండానే గత 10-15 సంవత్సరాలుగా వందలాది మంది కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. 2001 నుండి ఇప్పటివరకు 711 మంది పోలీసు స్టేషన్‌ల చుట్టూ తారీఖులకు తిరుగుతున్నారు. ముఖ్యంగా అహిరి దళం డిప్యూటీ ఆనంద్ విద్రోహం కారణంగా కేవలం రైతాంగాన్ని మాత్రమే కాదు విద్యార్థులనూ, ఉద్యోగస్థులనూ, చిన్నపాటి వర్తకులను కూడా వేధించారు. పోస్టర్లు రాసి పత్రికలు చదివారని రేగులవాయి, మరిపెల్లి, మోత్కుపెల్లి గ్రామాల నుండి 20 మంది విద్యార్థులను (4వ తరగతి నుండి 10వ తరగతి వరకు) అరెస్టు చేసి తీవ్రంగా కొట్టారు. కమలాపూర్, జిమ్మలగట్టల నుండి 10 మంది వివిధ షావుకార్లు పోలీసు స్టేషన్లకు వారంవారం హాజరు కావలసి వస్తోంది.

**డబ్బు/డంపుల వేట:** సాధారణంగానే విప్లవోద్యమ అణచివేతలో ఉన్న పోలీసు అధికారులు పార్టీ డబ్బు డంపులు దొరికినపుడు దానిలో చాలవరకు తామే స్వాహా చేసి కుబేరులయిన చరిత్ర మామూలే. గతంలో మాడ్‌లో డిప్యూటీగా వుండి ద్రోహిగా మారిన సమర్ అరెస్టయినపుడు కూడ జరిగిందదే. ఇపుడు ఆనంద్ అహిరి డిప్యూటీగా వుండి ఏరియా/దళ వివరాలు చెప్పడంతో కమాండో/స్పెషల్ పోలీసులు 2001 ఆగస్టు తర్వాత డంపుల కోసం విపరీతంగా గాలించారు. అహిరి ఏరియాలోనే సుమారు 27 డంపులు (వీటిలో దళం సామాలు డంపులు కొన్నీ 10 లక్షల రూపాయల డబ్బు డంపులు కొన్నీ ఉన్నాయి) స్వాధీనపరచుకున్నారు. వీటి కోసం గ్రామాలలో వుండే వివిధ నిర్మాణాలలోని సభ్యులను ఎన్నో చిత్రహింసలకు గురిచేశారు. ప్రజలు ధాన్య సహకార సంగాలు ఏర్పర్చుకొని వాటిలో 151 క్వింటాళ్ల ధాన్యం భద్రపరచుకుంటే అవీ ఎత్తుకెళ్లారు. గ్రామస్థుల పరపతి సంగాల్లో రు. 60,140/- లు ఉండగా దానికి రెట్టింపు డబ్బు అంటే రు. 1,20,280/- వసూలుచేసి నిలువు దోపిడీ చేశారు. పార్టీ కోసం వర్క్ డే రూపంలో ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడ 29 గ్రామాలవారు రు. 49,980/- లు జమచేశారు. ఇది తెలిసి కసితో జనాల నుండి రెట్టింపు డబ్బు అంటే రు. 99,960/- పోలీసులు బెదిరించి వసూలు చేశారు. మరిపెల్లి గ్రామంలో ధనిక రైతును బెదిరించి 70 వేల రు.లు తిన్నారు. రేగులవాయి గ్రామంలో పూజారి ముసలావిడ ఇంట్లోకి చొరబడి 17 వేలు ఎత్తుకెళ్లారు. జిల్లాలో కరువు తాండవించినపుడు షావుకార్లు ప్రజలకు సహాయం (చందా)గా ఇచ్చిన డబ్బు, ధాన్యానికి రెట్టింపు మొత్తాన్ని నిర్బంధంగా వసూలు చేసుకుపోయారు పోలీసులు. ప్రజాద్రోహి డిప్యూటీ ఆనంద్‌ను వెంటేసుకొని కిరాయి పోలీసులు సాగించిన దోపిడీ ఇది కాగా గత 10 ఏళ్లలో పోలీసుల పైశాచిక దాడుల్లో ప్రజలు ఆర్థికంగా నష్టపోయినదెంతో పరిమితమైన ఈ వ్యాసంలో వివరాలు ఇవ్వడం కష్టమే.

**గ్రామస్థులతో వెట్టిచాకిరీ:** ఆనంద్ విద్రోహం తర్వాత అహిరి పోలీసు స్టేషన్‌కు ఊరూరి రైతులను పిలిపించి వారితో పలు రకాల వెట్టి చేయిస్తున్నారు. గడ్డి పీకడం దగ్గర నుండి ఎన్నెన్నో! (రైతుల్ని మానసికంగా కృంగదీయాలనేదే!) మరిపెల్లిలో నూతనంగా పోలీసు క్యాంపు ఏర్పర్చి ఒక్కొక్క ఊరి రైతు 10-15 బళ్ల పొయ్యిల కట్టెలు వేసేట్లు చేయించారు. మరిపల్లిలో పోలీసు స్టేషను నిర్మించడానికి పొరుగు ఊరివాళ్లు ఒక్కొక్కసారి ఒక్కొక్క గ్రామం వారితో ఇసుక తెప్పించడం, సిమెంటు చేరవేయించడం, ఇటుకలు చేరవేయించుకోగా అదే ఊరివాళ్లతో రోడ్డు పనులు చేయించుకున్నారు. ఇవన్నీ వెట్టితోనే. నిజానికి ఆగస్టు-ఫిబ్రవరి కాలం వ్యవసాయ పనులకు సీజన్. రైతులు పోలీసులకు అలా వెట్టిచేయాల్సి రావడంతో తమ పంటలు నష్టపోయారు. అసలే ఆదివాసీ వ్యవసాయం అంతంత మాత్రం అంటే ఇది వారి స్థితిని మరీ దిగజార్చింది. పోలీసుల అణచివేత విధానంలో ఇదో భాగం.

**పోలీసు అత్యాచారాలు:** గడ్‌చిరోలి ప్రాంతంలో నిర్బంధం పెరిగిన నేపథ్యంలో సంతలలో గ్రామీణ మహిళలపైన, అవకాశం చూసుకొని విద్యార్థినులపైన పోలీసులు సాగిస్తున్న లైంగిక అత్యాచారాలు కూడ గణనీయంగానే పెరుగుతూ వారికి భద్రత లేని దుస్థితి ఏర్పడింది. అహిరి తాలుకాలో మహిళలపై సామూహికంగా అత్యాచారం జరిపినది ఇప్పటికీ ఎవరు మరువలేరు. ఒక చోట పరీక్షల కోసం వెళ్లిన విద్యార్థినులపై అత్యాచారం చేశారంటే (అదీ రూముల్లోకి చొరబడి) వారి మృగస్వభావం చెప్పనలవి కానిదే. పోలీసు స్టేషన్‌కు రిపోర్టు ఇచ్చినందుకు వాళ్లను దరోగా(ఎస్ఐ)యే బెదిరించడం లాంటివి పోలీసుల అధికార దురహంకారానికి ప్రతీక తప్ప మరేం కాదు.

మొన్నటి మాన్పూర్ ఘటనలో కూడా పోలీసుల అత్యాచారానికి బలైన ఇద్దరు మహిళలు ర్యాలీలో పాల్గొని పోలీసులతో క్షమాపణలు చెప్పించుకున్నారంటే అంతకంటే పేర్కొనాల్సిన ఘటన లేదు.

## 2. విప్లవోద్యమాన్ని తుదముట్టించడానికి పాలకవర్గాల కుట్ర:

**పోలీసు బలగాల మోహరింపు:** జిల్లాలో ప్రజల మౌలిక సమస్యలు తీర్చని మహారాష్ట్ర ప్రభుత్వం పోలీసు స్టేషన్‌లు/క్యాంపులను మాత్రం 49కి పెంచింది. వీటిలో 3 వేలకు పోలీసు బలగాలు ఉండగా, అదనంగా గడ్‌చిరోలిలోని వడ్సా (దేశాయిగంజ్)లో 1,200 మంది జవాన్లతో ప్రత్యేక రిజర్వు పోలీసు బలగాల (ఎస్ఆర్‌పిఎఫ్) హెడ్‌క్వార్టర్స్ ఏర్పర్చింది. అలాగే వెయ్యిమంది హోంగార్డులు, మహిళా హోంగార్డులు వందమంది ఉన్నారు. ఇంకా ఇవిగాక పైనుండి వచ్చే ప్రత్యేక బలగాలు సరేసరి. దశాబ్దం కిందటే స్థానికులను రిక్రూట్ చేసుకొని కమాండో బలగాన్ని ఏర్పర్చుకుంది.

మరో పక్క నాగపూర్ కేంద్రంగా విదర్భ ప్రాంతానికంతా చేరువలో ఉండేట్లు ఒక పోలీసు అకాడమిని స్థాపిస్తోంది. ఇది మాఫియాలను, నక్సలైట్లను అణచడానికని చెబుతున్నా, (ఎపిలో వరంగల్/హైదరాబాద్ కేంద్రంగా నక్సల్ వ్యతిరేక పోలీసు కేంద్రాలు ఏర్పడినట్లు) విదర్భ అంతటా వ్యాపించిన విప్లవోద్యమాన్ని అణచడానికి రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్ర తప్ప మరేంకాదు (కేంద్ర జెఐసిని ఏర్పర్చి 9 రాష్ట్రాల్లోని ఉద్యమాన్ని అణచడానికి ముందుకు వస్తుంటే, దాని ఆదేశాలతో ఇక్కడ అటు ఎపి పోలీసులతోనూ ఇటు ఛత్తీస్‌గఢ్ పోలీసులతోనూ ఉమ్మడిగా దాడులు సాగించే సన్నాహాల్లో భాగమే ఈ అకాడమిని ఏర్పరచడం). నిజానికి మాఫియాల కోసమైతే అలాంటి అవసరం ఉన్నది ముఖ్యంగా ముంబాయికి, ఇతర పట్టణాలకు. అలాగాక వడ్స(దేశాయిగంజ్), నాగపూర్ కేంద్రాలుగా చేసే ఈ కేంద్రీకరణ పై కుట్రలో భాగం అన్నది స్పష్టమే.

**కరపత్రాల పోస్టర్ల దుష్ప్రచారం :** గడ్‌చిరోలి విప్లవోద్యమానికి

వ్యతిరేకంగా పోలీసులు ఒక్క 2003 లోనే ఇప్పటివరకు వరుసగా 12 కరపత్రాలు తీశారు. అనేక పోస్టర్లు వేశారు. ఈ దుష్ప్రచారం ఎంతటిదంటే ఒక పోస్టరులో కార్ల్ మార్క్స్ ఏంగెల్స్‌లు నగ్జలైట్లేననీ, భారత దేశంలో మొదటి నగ్జలైట్ భగత్‌సింగ్ అనీ ప్రజలకు బోధించారు. కరపత్రాల్లో నయితే నగ్జలైట్లు ఆంధ్రప్రదేశ్ వారనీ వారు 'పెద్ద పెద్ద భవనాల్లో ఉంటార'నీ (గడ్‌చిరోలి ప్రజానీకాన్ని తూటాలకు, లాఠీలకు బలిచేస్తూ, జైళ్లపాలు చేస్తున్నారని ఆరోపిస్తూ!), వారి పార్టీ ఆదివాసీ ప్రజలపై అత్యాచారాలు సాగిస్తోందంటూ, నిర్దిష్టంగా, ప్రియాంక దుర్వేపై అత్యాచారం జరిపి చంపారనీ..... ఇలాంటి అబద్ధపు ఆరోపణలెన్నింటినో తమ కరపత్రాలు/ పోస్టర్ల ద్వారా ప్రచారం చేశారు. ఇదంతా విప్లవ పార్టీపైనా విప్లవోద్యమంపైనా విషం కక్కడం తప్ప ఇంకొకటి కాదు.

పై ఆరోపణల డొల్లతనం చూద్దాం. దండకారణ్య ఉద్యమంలో అమరులైన వారిలో ఎందరో ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన వారున్నారు, ముఖ్యంగా డి.కె ఉద్యమ నాయకత్వానికి చెందిన కా. సుఖదేవ్ అలాగే డివిజన్ నాయకుడైన కా. ప్రకాష్ (మోటు పి.ఎస్. రెయిడ్‌లో) అమరులయింది ఏమాశించి? పోలీసులు ఆరోపిస్తున్నట్లు బంగ్లాలో ఉండేవాళ్లయితే ప్రజల మధ్య ఉంటూ పోరాటంలో ప్రాణాలు ఎలా త్యాగం చేస్తారు? ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారన్నది చూసినా పార్టీ, ఉద్యమ విస్తరణలో భాగంగా దేశవ్యాప్తంగా పీడిత ప్రజలను సంఘటితపర్చి విప్లవోద్యమాన్ని బలోపేతం చేయడానికి 1980లో ఇటు గడ్‌చిరోలి, అటు బస్తర్‌లకు (నేడిదే దండకారణ్యంగా పార్టీ పేర్కొంటున్నది) పార్టీ వచ్చిందన్నది యదార్థమే. అయితే 23 ఏళ్లగా ఇక్కడి ప్రజలతో కలసిపోయి వీరిని ఎడ్యుకేట్ చేస్తూ వీరినుండే పోరాటయోధులను తయారుచేసి నాయకత్వంలోకి తెస్తున్నది కూడ వాస్తవం. నేడు డివిజన్ (జిల్లా వంటిదే) స్థాయి నాయకత్వంలో ఈ నేల బిడ్డలే ఎందరో ఉన్నారనీ, వీరంతా జిల్లా ప్రజల ఆదరాభిమానాలతో పోరాడుతున్నారనీ ప్రజలకు తెలియనిది కాదు. గడ్‌చిరోలిలోనే పోలీసు కాల్పుల్లో అమరుడైన కమాండర్ కామ్రేడ్ ప్రభాకర్ గురించి అక్కడి ఆదివాసీ ప్రజలకు బాగా తెలుసు కాని వెంటాడి వేటాడి కమాండోలతో చంపించిన ఈ పోలీసు గుడ్డి కళ్లకు కానరాదు కదా! అందుకే ఇది కావాలని సాగిస్తున్న దుష్ప్రచారం అనే అనాలి.

నిజానికి ప్రియాంక దుర్వే సంఘటన తీసుకోండి. ఆమె ప్రేమ వ్యవహారాల్లో పడి సమాజానికి భయపడే దుస్థితి రావడంతో ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లితండ్రులనూ, టీచర్లనూ అడిగి ఎవరైనా వాస్తవాలు తెలుసుకోవచ్చు. మా పార్టీ గడ్‌చిరోలి డివిజన్ కమిటి ఒక కరపత్రంలో వీటన్నింటికీ జబాబిస్తూ వాస్తవాలను చూడమని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. నిజానికి దొంగే దొంగ అని అరిచే చందంగా పోలీసు దురాగతాలు ఉంటాయని చెప్పడానికో ఉదాహరణ జారవండి ఘటన. జారవండి పోలీసు క్యాంపుకు చెందిన ఇద్దరు పోలీసులు పరీక్షలు రాయడానికి వచ్చిన ఇద్దరు విద్యార్థినులపై రూముల్లోకి చొరబడి అత్యచారం చేశారు. దానిపై రిపోర్టు చేసిన టీచర్లు, ఆ విద్యార్థినుల కుటుంబాల వారిపై ఆ రిపోర్టు వాపసు తీసుకోమని పోలీసు అధికారులే వత్తిడి తేవడాన్ని ఏమనాలో ప్రజలే చెప్పాలి!

**సరండర్ల నాటకం - గావ్‌బందీ బూటకం:** గడ్‌చిరోలి ఎస్పి రాజవర్ధన్ 'జనజాగరణ అభియాన్' పేరుతో జనవరి-ఏప్రిల్ మధ్య సాగించిన దాన్ని జులై వరకు కొనసాగించాడు. ఈ అభియాన్‌లో పోలీసులు తమతో కలుపుకు వెళ్లిన సెక్షన్ వాళ్లు - గ్రామపెద్దలు (అధికంగా ప్రజావ్యతిరేకులే), సరండరయిన వాళ్లు, ప్రజా గెరిల్లాల చేతిలో శిక్షించబడినవారు, ఛోటామోటా నాయకులు (బూర్జువా పార్టీలవారు), అన్ని ప్రభుత్వశాఖల్లోని అదికార్లు కొంత మంది ఆదివాసీ విద్యార్థి నాయకులు కాగా 90 శాతంగావున్న గ్రామీణ ఆదివాసీ రైతాంగం పరిస్థితి అభియాన్ల మూలంగా సరెండర్ల నాటకంలో కొంత వెల్లడయింది. ఈ అభియాన్ పేరుతో ఎస్పీ నేతృత్వంలో జిల్లా వ్యాప్తంగా 50-60 సభలు జరిగాయి. ఈ సభలన్నీ ముఖ్యంగా జిల్లా పరిషత్, పంచాయితీ సమితి, గ్రామ పంచాయితీ సభ్యులు, సర్పంచ్‌లు, పటేళ్లు, సభాపతులు పాల్గొనగా పోలీసు అధికార్ల నాయకత్వంలో జరిగినవే. వీటన్నింటిలో ప్రజా వ్యతిరేకులైన పెత్తందార్లు పాల్గొని పార్టీకి, ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడారు. పాల్గొన్న వారిలో వివిధ శాఖల అధికార్లు సరేసరి. జిమ్మలగట్ట గ్రామంలో జరిగిన సభలో 18 మంది అమాయక రైతుల్ని చూపించి నక్సలైట్లు సరండర్ అయ్యారని ప్రచారం చేసారు. గోట్‌లో జరిగిన 'జనజాగరణ్ మేడావా'లో 16 మంది నక్సలైట్లు సరండరయ్యారని గ్రామస్థుల్ని పట్టుకొచ్చి ప్రచారం చేసారు.

వాస్తవానికి వీటి వెనకాల కథ ఏమిటి? బెజ్జార్‌పల్లి గ్రామస్థులు ఎప్పటిలాగే అడవిలో షికారుకు వెళ్లారు. అలా తిరుగుతున్న వారిపై పోలీసులు కాల్పులు జరపడంతో భయపడ్డ రైతులు అక్కడే అలా నిలిచిపోయారు. అలాంటి వారిని అరెస్టు చేసి బాగా కొట్టి బర్మార్లు తీసుకురమ్మని బెదిరించారు. వాళ్లు తమ దగ్గర లేకపోయినా బర్మార్లు కొని తీసుకువెళ్లారు. అలా వారందరిని జిమ్మలగట్ట సభలో నిలబెట్టి దళ కమాండర్లు, దళ సభ్యులు సరండర్ అయ్యారని అబద్ధాలు ప్రచారం చేశారు. ఇక గోట్‌ది చూస్తే కూడ పేంద్రి పోలీసు స్టేషన్‌కు చెందిన దరోగ పేంద్రి చుట్టుపక్కల ఉన్న పడసగావ్, మంగెవాడ, పైడి గ్రామాలకు చెందిన రైతులను మే 20న అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకుపోయి చిత్రహింసలు పెట్టి 'మీ దగ్గర తుపాకులు ఉన్నాయి. తెచ్చి ఇవ్వాలి. లేకపోతే చంపేస్తామ'ని బెదిరించాడు. వాస్తవానికి వారి వద్ద తుపాకులు లేకపోయినా కొని ఇచ్చారు. తర్వాత 22 నాడు జరిగిన గోట్ సభలో ఎస్పీ చేతుల్లో తుపాకులు పెడుతూ సరండర్ అయినట్లు చూపిన నక్సలైట్లు ఈ రైతులే. ఈ ఘటన జరగ్గానే జిల్లా విలేఖరులు నిజానిజాలు వెలుగులోకి తేవడంతోనే ఈ సభల్లోని సరండర్ల నాటకం ఎంత బూటకమో లోకానికి తెలిసిపోయింది. ఇదంతా పార్టీని ప్రజలను అణచివేతకు గురిచేయడానికేనన్నది వేరే చెప్పనవసరం లేదు.

గాంవ్‌బందీ (ఊర్లోకి రానీయకుండా బంద్ పెట్టడం) కూడా పోలీసుల నాటకమే. పోలీసులు గ్రామాల్లోకి వచ్చి పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడి దళాన్ని గ్రామాల్లోకి రానీయవద్దని ప్రజలపై తీవ్రంగా వత్తిడి తెచ్చి బెదిరించారు. పోలీసులు 'మేము దళాన్ని రానీయం' అని ప్రజలతో అనిపించేవరకు వారిని వదలలేదు. వీటి లోతు కూడా చూద్దాం. గోందియా జిల్లా (విదర్భనే) కోర్చి తాలూకాలోని 30 గ్రామాల ప్రజలు నక్సలైట్లను తమ గ్రామాలకు రాకుండా ఆపారనీ, అహిరి తాలూకాలో (గడ్‌చిరోలి, విదర్భనే) 12 గ్రామాల ప్రజలు నక్సలైట్లను తమ గ్రామాల నుండి తరిమారనీ, చాముర్షి ఏరియా (గడ్‌చిరోలి)లో 70 గ్రామాల వారు కూడా తమ గ్రామాలకు రాకుండా ఆపారనీ పోలీసులు దినపత్రికల్లో సాగించినదంతా దుష్ప్రచారం, అబద్ధం కూడా. జిల్లా ఎస్పి రాజవర్ధన్ నాయకత్వంలో నడిచిన ఈ అభియాన్‌లో నక్సలైట్లను తమ గ్రామాలకు

రానీయమన్న (బహిష్కరించిన) గ్రామాలకు లక్ష రూపాయిలు, సరెండరయిన వారికి 25 వేల రూపాయిలు ఇస్తామని ప్రకటించి ప్రలోభాలతో లొంగదీసుకోవాలని ఆశలు చూపించారు. పీపుల్స్‌వార్ పార్టీ ప్రజా ప్రయోజనాలకు, సంస్కరణలకు వ్యతిరేకి అంటూ ప్రజలను రెచ్చగొట్టే తతంగానికి పెట్టిన ముద్దు పేరే 'జనజాగరణ్ అభియాన్.'

## 3. నిర్బంధాన్ని ఎదిరిస్తున్న ప్రజానీకం:

**ప్రతిఘటన ప్రజల్లో ముందునుండి ఉన్నదే:** గతంలో నుండి పోలీసులు అత్యాచారాలు, అరెస్టులు, దాడులు సాగిస్తున్న క్రమంలో కొన్ని ఘటనలు చూస్తే (దిగువ నిస్తున్నాం) తమ హక్కుల కోసం ప్రజలు పోరాడ్డమే కాదు. తమ ఆత్మరక్షణ కోసం పోలీసు దుర్మార్గాలను ఎదిరించడం కూడా గడ్‌చిరోలి ప్రజల రక్తంలో జీర్ణించుకున్నదనేది సుస్పష్టమే. ఉదా:

* గడ్‌చిరోలి కమాండోల పైశాచిక దమనకాండ నెదిరించడంలో మే 2000 లో జరిగిన బుకమరకా గ్రామ సంఘటన ఒక కలికితురాయని చెప్పాలి. ఈ గ్రామం మహారాష్ట్ర మధ్యప్రదేశ్ సరిహద్దుల్లోనిది. మహారాష్ట్ర కమాండో బలగాలు ఆ గ్రామంపై 3 సార్లు దాడిచేసి ముగ్గురిని విపరీతంగా బాదారు. దీనికి వ్యతిరేకంగా గ్రామంలోని స్త్రీ-పురుషులంతా కోపోద్రిక్తులై కమాండోలు 25 మందిని లాఠీ/కర్రలతో కొట్టి కొట్టి తరిమారు. ఆ కమాండోలు తర్వాత వచ్చి ఈ ఘటన ఎవరికీ చెప్పవద్దని బతిమాలుకుని పోయారు. ఇలాంటివెన్నో!

* ఏటపల్లి తాలుకాలో తన కొడుకుని అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులపై రొప్పిన్‌కట్ట గ్రామానికి చెందిన ఒక తల్లి రాయెత్తింది. ఆమెకు మద్దతుగా గ్రామంలోని మహిళలందరూ ఏకమయ్యారు.

* పోటావి జేవెల్లి గ్రామంలో సంగం అతన్ని పట్టుకెళ్లడానికి వచ్చిన పోలీసులను గ్రామ మహిళలంతా తీవ్రంగా ప్రతిఘటించారు. పోలీసు చేతుల్లో పడిన తమ సంగ నాయకుడిని విడిపించుకోడానికి పోలీసులతో చాలసేపు గొడవ పెట్టుకున్నారు.

* మిచ్చుగుండ గ్రామంలో సంగం వారిని అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులను ప్రజలు అడ్డుకున్నారు. దాంతో రెండవ రోజు రాత్రి వచ్చి గప్‌చిప్‌గా తీసుకుపోయారు. ఇది తెలియగానే గ్రామస్థులు అడ్డదారిన, పట్టుకెళ్లిన పోలీసులు క్యాంపుకు రాకముందే, వెళ్లి క్యాంపు ముందు ధర్నా చేశారు. ప్రజలకు కనబడకుండా వారిని దాచిపెట్టాలని పోలీసులు ప్రయత్నించగా దాన్ని విఫలంచేస్తూ తమ వారిని విడిపించుకున్నారు.

* ఎకరా గ్రామంలో సంగ నాయకుడిని పట్టుకోవడానికి రాగా అతన్ని దాచిపెట్టి వచ్చిన పోలీసులతో గ్రామస్థులు తలపడ్డారు.

*మర్కనార్ గ్రామంలో తన పెద్దన్నను అరెస్టుచేయ వచ్చిన కమాండోను 8 ఏళ్ల బాలుడు బండతో తల పగులగొట్టాడు.

* మర్కనార్, కోస్మి ప్రజలను (స్త్రీపురుషులను) అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులను కట్టెలు, బండలతో 2 గంటల పాటు ఎదుర్కొని జనం తరిమికొట్టారు.

* కట్టెఝరి, కోస్మి, బోడిమెట్ట గ్రామ ప్రజలు పోలీసులకు నీళ్లు, వంటచేసుకోడానికి గంజులు, పడుకోవడానికి జాగ ఇవ్వకుండా నిరసన తెలిపారు. గ్రామ స్కూల్లో డేరా వేయనీయలేదు.

* కొడిపె గ్రామంలో 14 ఏళ్ల బాలిక పోలీసులకు తాగే నీరు ఇవ్వ నిరాకరించింది.

## పెల్లుబికిన సంఘటితతత్వం ఎలాంటిది?

గడ్‌చిరోలి ఆదివాసీ ప్రజల జీవితాల్లోనే చావుకి వెరువని పోరాటతత్వం ముందు నుంచీ వున్నది. అందుకనే పీపుల్స్‌వార్ పార్టీ అడుగిడి కల్గించిన చైతన్యంతో కొత్త ఉత్తేజాన్ని సంతరించుకున్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణలో ముఖ్యంగా తునికాకు సేకరణ, వెదురు నరకడాల్లో తమ శ్రమను నిలువుదోపిడీ చేస్తున్న ఠేకేదార్లతో, పేపరుమిల్లు వారితో ప్రతి సంవత్సరం పోరాడుతూ 22 ఏళ్ల చరిత్రలో ఎక్కడా లేని రేటును సాధించుకున్నారు. వారి జీవనంలో అది తెచ్చిన మార్పు ప్రజలు ఎప్పుడూ మరువలేరు. ఇది పోరాటం ద్వారానే, పీపుల్స్‌వార్ వంటి పోరాట పార్టీ ఉంటేనే సాధ్యమన్నది అణగారిన ఆదివాసీ ప్రజలకు తెలిసినంతగా వారిని దోచుకుంటున్న దోపిడీదారులకు, పాలకవర్గాలకు ఎందుకు తెలుస్తుంది? తెలుసుకోవలసిన అవసరమేముంది?

అందుకే వారి నరనరాల్లో పోరాటం జీర్ణించుకుంది. 23 ఏళ్లుగా ముఖ్యంగా గత 13 ఏళ్లుగా ఎంతటి నిర్బంధం వచ్చినా పీపుల్స్‌వార్ పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. చట్టాల పేరుతో దోపిడీ-అణచివేతలు, అవినీతి తాండవిస్తుంటే సమిష్టిగా వాటిని ధిక్కరించడంలో ప్రజల తెగింపుకు నిదర్శనం వ్యాసం ప్రారంభంలో ఉటంకించిన మూడు ఘటనలు. వాటి వివరాలు చూస్తే గనుక --

1. ఛత్తీస్‌గడ్-మహారాష్ట్ర పోలీసులు కలసి దాడులు నిర్వహించడంలో భాగంగా టిప్రాగఢ్ (గడ్‌చిరోలి) ఏరియా మర్కనార్, కోస్మి చుట్టుప్రక్కల గ్రామాలపై దాడులు కొనసాగిస్తున్నారు. ఇలా దాడులు చేస్తూ పోలీసులే మరో పక్క జనవరి 14 చిచోలి గ్రామంలో నక్సలైట్ల వ్యతిరేక ర్యాలీనొకదాన్ని తీయించారు. అలాగే మాన్పూర్ పోలీసులు మర్కనార్, వడనార్ గ్రామాల ప్రజలను అరెస్టుచేసి తీసుకుపోయారు. దానితో పోలీసులు సాగించిన ఈ అరెస్టులకు వ్యతిరేకంగానూ, అలాగే వారు సాగిస్తున్న దురాగతాలకు వ్యతిరేకంగా జనవరి 30న 30 గ్రామాల నుండి ప్రజలు 10 వేలకు పైగా (వారిలో మహిళలే 3 వేల మంది) మాన్పూర్ పోలీసు స్టేషన్‌ను చుట్టుముట్టి అరెస్టుచేసిన వారిని విడిచే వరకు కదలలేదు. అక్కడ కూడా పోలీసులు లోపలి నుండే 12 రౌండ్లు కాల్పులు జరిపారు. అయినా ప్రజలు భయపడలేదు సరికదా స్టేషన్ బయట ఉండిపోయిన ఇద్దరు పోలీసులపైబడి మహిళా ఏఎస్ఐ నుండి తూటాలు లాక్కొని, రెండవ పోలీసుని చితకబాదారు. 10-12 గంటలు సాగిన ఈ పోరాటంలో చుట్టుపక్కల స్టేషన్లకు చెందిన అధికారులంతా వచ్చి చివరకు అరెస్టు చేసినవారిని విడిచిపెడుతూ, ఇకపై చిత్రహింసలకు పాల్పడకుండా చూస్తామని వాగ్దానం చేసేవరకు వారక్కడ నుండి కదల లేదు.

2. గత సంవత్సరం డిసెంబర్ నెలలో అహిరి తాలుకా జిమ్మలగట్ట దగ్గరిలోని మర్రిపల్లి పోలీసు స్టేషన్/క్యాంపు చుట్టుప్రక్కల 10 గ్రామాల ప్రజలు జమఅయి పోలీసులు సాగిస్తున్న అత్యాచారాలు, చిత్రహింసలకు వ్యతిరేకంగానూ అరెస్టు చేసిన తమవారు ఏడుగురిని విడిచిపెట్టాలనీ 950 మంది ర్యాలీ తీసారు. స్టేషన్ ముందు ధర్నా చేశారు. అరెస్టు చేసిన వారిని విడిచిపెడతామని హామీ ఇచ్చి, తాము చేసిన దుర్మార్గాలకు క్షమాపణ చెప్పే వరకు అక్కడ నుండి ప్రజలెవ్వరూ కదల లేదు.

3. టిప్రాగఢ్ ఏరియా గారపత్తిలో పోలీసులు సాగిస్తున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 14న 25 గ్రామాల నుండి 3 వేల మంది ప్రజలు స్టేషన్ వద్దకు ఊరేగింపుగా సాగి, కలెక్టర్ ఎస్పీలు వచ్చి

ఇకముందు అలా జరగనివ్వమని హామీ ఇచ్చేవరకు కదల లేదు.

ఇలా గడ్‌చిరోలి జిల్లాలో అణచివేతను ధిక్కరించడంలో రోజురోజుకీ గ్రామగ్రామాన ప్రజల శక్తి సంఘటితపడుతోంది. తమ ఆడపడుచులను కాపాడుకోవడానికీ, తమ ప్రజల శరీరాలను రక్షించుకోవడానికీ, పోలీసుల వెట్టిచాకరీలతో తమ జీవనాలు నాశనం కాకుండా తమ హక్కులను నిలబెట్టుకోవడానికీ 'చట్టాలు'గా పిలువబడే వాటిని, వాటిని కాపాడే కావలికుక్కల తుపాకులను ధిక్కరిస్తున్నారు. ఎదిరించి పోరాడుతున్నారు. గడ్‌చిరోలి జిల్లాలో ఇది నేటి వాస్తవం. నిర్బంధం ప్రజలను అణచిపెట్టలేదన్న చారిత్రక సత్యం మరోసారి రుజువవుతోంది.

## ముగింపు:

వడ్సాలో ఎస్‌ఆర్‌పిఎఫ్ అధికార కేంద్రం(హెడ్‌క్వార్టర్స్)ను, నాగపూర్‌లో పోలీసు అకాడమీని, గడ్‌చిరోలి ప్రాంత ఆదివాసీ యువకులతో ప్రత్యేక బెటాలియన్, గడ్‌చిరోలి జిల్లాలోనే 11వందల హోంగార్డులను, ఏ విధమైన ప్రభుత్వ కార్యాలయాలు లేదా ప్రభుత్వ అధికార్లు కానరాని లోతట్టు అటవీ ప్రాంతాల్లో పోలీసు స్టేషన్‌లు క్యాంపులు .... ఇవన్నీ విదర్భ ప్రాంతంలోనే ఎందుకు వెలుస్తున్నాయి? ఇదీ మనమంతా ఆలోచించాల్సిన విషయం.


విదర్భ ప్రాంతంలోని గడ్‌చిరోలి, భండారా, గోందియా, చంద్రపూర్, యవత్‌మాల్ జిల్లాలు ఐదింటిలో నేడు పీపుల్స్‌వార్ పార్టీ బలంగా వేళ్లూనుకుంటోంది. ఇటు ఆంధ్రప్రదేశ్‌లోనూ అటు ఛత్తీస్‌గడ్‌లోను ప్రభుత్వాన్ని ఎదిరించి 'ప్రజారాజ్యాధికార' స్థాపనకై విప్లవోద్యమం ముందుకు సాగుతున్న నేపథ్యంలో గడ్‌చిరోలిలో అడుగిడి విదర్భలోని ఐదు జిల్లాలకు పాకిన పీపుల్స్‌వార్ పార్టీని తుడిచిపెట్టకపోతే తమ ఉనికికే ప్రమాదమని గ్రహించిన మహారాష్ట్ర ప్రభుత్వం (ఇది కూడా జెఒసి లో భాగంగా కేంద్ర ఆదేశాలను పొందుతున్నదే) సాగిస్తున్న చర్యలే పోలీసుల అణచివేత/దురాగతాలు తప్ప మరేంకావు.

పాలకవర్గాల ఏజంటుగా గడ్‌చిరోలి ఎస్‌పి రాజవర్ధన్ అలాంటి ప్రగల్భాలు పలకడం లేదా సంస్కరణల పేరుతో ప్రజలను వంచించడం గానీ, నిర్బంధం-అణచివేతలతో ప్రజలను లొంగదీసుకోవాలని ప్రయత్నించడం గానీ పీపుల్స్‌వార్ పార్టీ చరిత్రలో విప్లవోద్యమానికి ఎదురునిలిచిన పోలీసు అధికార్లలో మొదటివాడూ కాదు, ఆఖరివాడు కాబోడు. ప్రజాశక్తి ముందు ఇలాంటివారు ఓటమితో పలాయనం చిత్తగించకా తప్పదు.

అయితే నేడు విప్లవ శక్తుల ముందు, ప్రజల ముందు విదర్భలోని విప్లవోద్యమాన్ని ముఖ్యంగా గడ్‌చిరోలి ఉద్యమాన్ని (దానికున్న ప్రాముఖ్యత రీత్యా) కాపాడుకోవడం ముఖ్యం. సామ్రాజ్యవాదానికి, దళారీ బూర్జువా-భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా సాగుతున్న నూతన ప్రజాతంత్ర విప్లవంలో పీడిత ప్రజలవైపు ముఖ్యంగా పీడిత ఆదివాసీ ప్రజలవైపు నిలబడి పోలీసు దుర్మార్గాలను బహిర్గతం చేయడం, వారి పోరాటాలకు మద్దతునీయడం ప్రజాస్వామ్య ఆకాంక్ష కలిగిన ప్రజల బాధ్యత. అది నిర్వర్తించమని ప్రజాతంత్ర శక్తులకు, వ్యక్తులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

★ *అంతిమ విజయం పోరాడే ప్రజలదే !*

★ *ప్రజల సంఘటిత శక్తి ముందు ఏ శక్తీ నిలువజాలదు !*



## గడ్చిరోలిలో పిజిఏ జరిపిన మాటుదాడిలో

### *ఐదుగురు కమాండోల కుక్క చావు - ఇద్దరికి గాయాలు*

*ఆగస్టు 29 ఉదయం 8 గంటల సమయాన గడ్చిరోలి జిల్లాలోని భామ్రాగఢ్ పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలో కుమ్మరివాగుకు దగ్గర్లో పిజిఏ ఎర్రయోధులు మాకెదురే లేదని విర్రవీగుతున్న కమాండోలపై విజయవంతంగా దాడి చేశారు. హంతక కమాండో బలగాల కదలికలన్నింటినీ జాగ్రత్తగా పరిశీలిస్తూ వచ్చిన పిజిఏ సైనికులు ఒక వంతెన కింద మందుపాతరను అమర్చి వాళ్లు ఏమాత్రం ఊహించలేని విధంగా దాడి చేశారు. దాదాపు 25 మంది కమాండోలు రెండు వాహనాల్లో వస్తుండగా దాదాపు 15 మంది గెరిల్లాల డిటాచ్‌మెంట్ మొదటి వాహనాన్ని వదిలేసి రెండో దాన్ని పేల్చివేసింది. ఇందులో ఐదుగురు కమాండోలు అక్కడికక్కడే చావగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తర్వాత ఇరు పక్షాలకూ తీవ్రంగా కాల్పులు కొనసాగినప్పటికీ పిజిఏకు ఎలాంటి నష్టం జరగలేదు. గత కొన్ని నెలలుగా గడ్చిరోలి జిల్లాలో పోలీసులు విప్లవోద్యమానికి వ్యతిరేకంగా దారుణ నిర్బంధ క్యాంపెయిన్‌ను ప్రారంభించి అమలు చేస్తూన్నారు. ప్రజలను విపరీతంగా కొట్టడం, పెట్రోల్ ఇంజెక్షన్లు చేయడం, అబద్ధపు కేసుల్లి మోపి జైలుపాలు చేయడం, కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కథల్లడం వంటి పద్ధతులన్నీ అమలు చేస్తున్నారు. మరోవైపు విప్లవోద్యమాన్ని ప్రజల్లో అభానుపాలు చేయడానికి దుష్ప్రచారం చేయడం, కరపత్రాలు వేయడం, నక్సలైట్లను ఊళ్లోకి రానివ్వమని ప్రజలతో బలవంతంగా ప్రకటనలు చేయించడం, సరెండర్ల ప్రహసనం లాంటి ఎన్నో కుట్రపూరిత పద్ధతుల్ని అవలంబిస్తున్నారు. ఊపిరి సలపనివ్వని నిర్బంధం మధ్య పిజిఏ చేసిన ఈ ఆంబుష్‌తో ప్రజలకు ఊపిరి పీల్చుకున్నట్టయ్యింది.* ✪

# ప్రజా గెరిల్లాల చేతిలో ప్రజా వ్యతిరేకులకు శిక్షలు

## రహస్య పోలీసు బండు పేక తొర్రె ఖతం


గడ్చిరోలి డివిజన్ ఏటపల్లి తాలూకాలో ఒక గ్రామం గట్ట. 1988లో అక్కడ పోలీసు క్యాంపు వెలిసింది. ఇక్కడ 10వ తరగతి చదువుతున్న బండుని పోలీసులు చేరదీశారు. వారి ప్రలోభాలకు లోనై ఇన్‌ఫార్మర్‌గా మారాడు. 1998-2000 సంవత్సరాల నడుమ పోలీసులు ఈ విధంగా చాలా మంది చదువుకున్న యువకులను చేరదీసి ఇన్‌ఫార్మర్లుగా మలచుకున్నారు. వీరు తమ గ్రామాలలోనే ఉంటూ, జూలై 28, తునికాకు పోరాటం మొదలైన సందర్భాలలో చుట్టరికాలను అడ్డం పెట్టుకొని చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు చేస్తుంటారు. దళానికి సంబంధించిన సమాచారం గానీ, ప్రజల సమిష్టి కార్యకలాపాల ఆచూకీ గానీ తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తారు. ఈ పద్ధతిని ఉపయోగించి దళాలను నిర్మూలించే ప్రయత్నాలు చేసారు. జారవాడలో గతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌కు కూడా బండుయే కారణమని తర్వాత తెలిసింది. వీడిచ్చిన సమాచారంపై పోలీసులు 2002లో జారవాడ గ్రామంలో సంఘ నాయకులను అరెస్టు చేశారు. అంతకు మునుపు 2000లో జూలై 28 సందర్భంగా వీడు నేండువాడీ అనే గ్రామానికి వచ్చి అక్కడ స్థూప నిర్మాణం కోసం జమగూడిన ప్రజలతో కలసి కార్యక్రమాన్నంతా చూసి పోయాడు. తరువాత కంటికి కట్టినట్లుగా పోలీసులకు రిపోర్టు ఇచ్చాడు. అప్పటి నుండే వీని ప్రజా వ్యతిరేక కార్యకలాపాలు బహిర్గతమయ్యాయి. గట్ట కేంద్రంగా వీని కార్యకలాపాలు సాగుతుండేవి. వీడిని ఖతం చేయాలని 2000లో నిర్ణయం కాగానే పోస్టర్ల ద్వారా ప్రచారం చేశారు. అయినప్పటికీ వీడు సరెండర్ కావటం గానీ తన కార్యకలాపాలకు స్వస్తిచెప్పటం గానీ చేయలేదు. దానితో వీడిని పిజిఏ సైనికులు అంతమొందించారు.

## సుర్సుండి ర్యాలీపై ఫైరింగ్ చేయించిన పట్వారీ గుర్‌నులె ఖతం

సుర్సుండి గ్రామంలో పేరుమోసిన జమీందారు కసర్‌షా ప్రజలపై లెక్కలేనన్ని దౌర్జన్యాలకు పాల్పడుతుండేవాడు. పంచాయితీల పేరుతో వేల కొద్ది రూపాయలు వసూలు చేసి దిగమింగేవాడు. 1990లో ఈ ప్రాంతంలో మొదలైన పోరాటాలను అణచడానికి వీడు చెయ్యని ప్రయత్నమంటూ లేదు. తన కొడుకును పోలీసుల్లో చేర్పించాడు. గ్రామాలలో ప్రజాసంగాల సభ్యుల పేర్లు సేకరించి పోలీసులకు అందజేస్తుండేవాడు. వీడి ప్రజావ్యతిరేక కార్యకలాపాలన్నింటిలోనూ పట్వారీ గుర్‌నులే వీడి కుడి భుజంలా వ్యవహరిస్తుండేవాడు.

పట్వారి గుర్‌నులే ప్రజలను బాగా పీడించేవాడు. వీడికి అటవీశాఖ వాళ్లతో మంచి సంబంధాలుండేవి. గ్రామస్తుల పశువులను అడవిలో మేయనిచ్చేవారు కాదు. వీడు సుర్సుండి గ్రామంలో బందెలదొడ్డిని కట్టించాడు. చుట్టుపక్కల గ్రామాల పశువుల్ని వీడు బందెలదొడ్లో బంధించేవాడు. వాటిని వదిలేయడానికి బాగా డబ్బులు గుంజి వీడు తెగ బలిసిపోయాడు.

జమీందారు కసర్‌షా, పట్వారీ గుర్‌నులే దౌర్జన్యాలతో విసుగు చెందిన ప్రజలు డిఏకెఎంఎస్ నాయకత్వంలో 1990లో ఒక ఊరేగింపు నిర్వహించారు. అయితే ప్రజల సంఘటితశక్తిని దెబ్బతీయడానికి అవకాశం కోసం పొంచి చూస్తున్న ఈ తోడు దొంగలిద్దరూ కుట్రపూరితంగా



## గీదం పోలీసుస్టేషన్‌పై విజయవంతమైన పిజిఏ దాడి!

### *ముగ్గురు పోలీసుల మృతి – ఏడుగురికి గాయాలు – పెద్ద ఎత్తున ఆయుధాలు స్వాధీనం*

ఈ సంచిక పని దాదాపు పూర్తయిన సమయంలో గీదం పోలీసుస్టేషన్‌పై పిజిఏ గెరిల్లాలు దాడి చేశారన్న వార్త మాకు చేరింది. దంతెవాడ జిల్లా కేంద్రానికి కేవలం 12 కిలోమాటర్ల దూరంలో ఉన్న గీదం పట్టణం మధ్యలో ఉన్న పోలీసుస్టేషన్‌పై సెప్టెంబర్ 13 రాత్రి ఎనిమిదిన్నర గంటలకు పిజిఏ సైనికులు జరిపిన ఈ దాడిలో ముగ్గురు పోలీసులు చనిపోగా, మరో ఏడుగురు గాయపడ్డారు. పత్రికల కథనం ప్రకారం ఈ దాడిలో ఒక పిజిఏ యోధుడు కూడా అమరుడయ్యాడు. ప్రత్యేకించి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడం కోసం జరిగిన ఈ దాడిలో ఎస్సెల్లార్లు 13, .303 రైఫిళ్ళు 17, గ్రెనేడ్ లాంఛర్ ఒకటి – మొత్తం 31 రైఫిల్లు పిజిఏ వశమయ్యాయి. వీటితో పాటుగా ఐదు చేతి గ్రేనేడ్లను కూడా పిజిఏ స్వాధీనం చేసుకుంది. శత్రు ఆయుధాలే మన ఆయుధాలనే స్ఫూర్తితో సాహసంగా పోరాడి ఈ దాడిని జయప్రదం చేసిన పిజిఏ ఎర్ర యోధులందరికీ 'ప్రభాత్' విప్లవాభినందనలు తెలుపుతోంది. అట్లాగే ఈ దాడిలో అమరుడైన కామ్రేడ్‌కు విప్లవ జోహార్లు తెలుపుతున్నాం. *(అయితే పూర్తి వివరాలు ఇంకా అందాల్సి ఉంది.)*

— *సంపాదకవర్గం*

పోలీసుల్ని రప్పించారు. ప్రజల ఊరేగింపు బందెలదొడ్డిని చేరుకొని పశువుల్ని విడిపించగానే పోలీసులు ప్రజలపై విచ్చలవిడిగా కాల్పులు ప్రారంభించారు. ప్రజల్లో పెరుగుతున్న చైతన్యాన్ని పోలీసులు తుపాకీ తూటాలతో రూపుమాపడానికి విఫల ప్రయత్నం చేశారు. ఈ కాల్పుల్లో కామ్రేడ్ దయారాం అనే సంగ కార్యకర్త అమరుడయ్యాడు. కానీ ప్రజలు అక్కడి నుండి కదలలేదు. వారిలో కోపం కట్టలు తెచ్చుకుంది. పోలీసులతో వీరోచితంగా తలపడ్డారు. నిరాయుధులైన ప్రజలు పోలీసులను చావబాది రెండు రైఫిళ్లు గుంజుకున్నారు. (వీటిలో ఒకటి పోలీసులు తిరిగి స్వాధీనం చేసుకోగా, మరొకటి గెరిల్లాల చేతికి చేరింది.)

ఆ తర్వాత చాలా సంవత్సరాల పాటు సుర్సుండిలో పోలీసు క్యాంపు కొనసాగింది. అయితే పోరాటం ఆగలేదు. మొత్తం ప్రాంతంలో పోరాటాలు తీవ్రతరమయ్యాయి. తీవ్ర నిర్బంధం మధ్య కూడా గెరిల్లా దళాలు విప్లవ కార్యకలాపాలను కొనసాగించాయి. ప్రజలు పార్టీనీ, గెరిల్లా దళాలనూ కాపాడుకున్నారు. దాదాపు 8-9 సంవత్సరాల తర్వాత కసర్షా లొంగిపోతానని ప్రతిపాదన చేశాడు. అమరవీరుడు దయారాం కుటుంబానికి 15 ఎకరాల భూమి ఇచ్చే షరతుపై ప్రజలు వాడిని క్షమించడానికి సిద్ధపడ్డారు. ఈ విధంగా కసర్షా మరణశిక్ష తప్పించుకున్నాడు. అయితే పట్వారీ గుర్నులే మాత్రం ఇన్ఫార్మర్‌గా కొనసాగాడు. పోలీసులు వీడికి ఒక రివాల్వర్, ఒక వాకీటాకీ కూడా సమకూర్చింది. ఈ నేపథ్యంలో ఆగస్టు 24, 2002న పిజిఏ సెకండరీ, పునాది బలగాలు కలిసి మొత్తం దాదాపు 100 మంది వీడి ఇంటిపై దాడి చేశారు. వీడి దుకాణాన్ని కాలబెట్టారు. వీడిని అక్కడికక్కడే కాల్చిచంపారు. ఈ విధంగా చాలా ఏళ్లుగా పార్టీకీ, ప్రజలకూ వ్యతిరేకంగా నిల్చిన కరడుగట్టిన ఇన్ఫార్మర్ గుర్నులే కథ ముగిసింది.

## రహస్య పోలీసు కృష్ణ దర్రో ఖతం

కోట్గుల్ పట్టణంలో నివసించే కృష్ణ దర్రో ఒక అరాచక యువకుడు. టిప్రాగడ్ ప్రాంతంలో ప్రారంభం నుండి విప్లవోద్యమానికి వ్యతిరేకిగా నిలిచాడు. ప్రజావ్యతిరేక కార్యకలాపాలు సాగించవద్దని ఏరియా పార్టీ కమిటీ అర్థం చేయించింది కూడా. వీడు ఈ విషయాన్ని కూడా పోలీసులకు చేరవేసేసాడు. కోట్గుల్ బజారుకు వెళ్లే ప్రజల సంచీలను సోదా చేస్తూ నక్సలైట్లకు సామానులు చేరవేస్తున్నారని వారిపై ఆరోపణలు చేసి, డబ్బులు అడుగుతూ లేదంటే పోలీసులకు చెబుతానని బెదిరించేవాడు. అట్లాగే వీడు గెరిల్లా దళాన్ని అంతం చేయడానికి ఇన్ఫార్మర్లను తయారు చేసి, స్వయంగా తాను వారికి కేంద్రంగా పనిచేయసాగాడు. ఇందుకు మెచ్చి పోలీసులు వీడిని పోలీసు పటేల్‌గా నియమించారు. అప్పటి నుండి వీడి ప్రజావ్యతిరేక కార్యకలాపాలు మరింతగా పెరిగిపోయాయి. గడ్చిరోలి జిల్లాలో విప్లవ పార్టీ మాట విని పోలీసు పటేళ్లు రాజీనామాలు ఇవ్వడం ప్రారంభించినప్పటి నుండీ పోలీసులు అలా ఖాళీ అయినచోటల్లా అరాచక వ్యక్తుల్ని పటేళ్లుగా నియమించసాగారు. ఇక కోట్గుల్‌లో పోలీసు క్యాంపు రావడంతో వీడికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. చివరకు పిజిఏ సైనికులు కోట్గుల్‌లోనే దర్రోను ఖతం చేసి ప్రజలకు వీడి పీడ విరగడ చేశారు.

## కుంట సమీపాన ఎస్పీ కాన్వాయ్‌పై పిజిఏ జరిపిన మాటుదాడిలో ఒక పోలీసు మృతి

*సెప్టెంబర్ 13న కుంట నుండి దంతెవాడకు పోతున్న ఎస్పీ గౌతం కాన్వాయ్‌పై పందిగూడెం గ్రామం దగ్గర్లో పిజిఏ మాటుగాచి దాడి చేసింది. ఈ దాడిలో ఒక పోలీసు అక్కడికక్కడే చనిపోగా మరో పోలీసు జవాను గాయపడ్డాడు. ఎస్పీ బతికి బైటపడ్డాడు. రేడియో వార్తల ప్రకారం పోలీసులకూ, పిజిఏ సైనికులకూ మధ్య జరిగిన కాల్పుల్లో ఒక గ్రామీణ మహిళ మరణించింది.*

## ప్రజా శత్రువు ఎర్రం ఆత్రం ఖతం

భామ్రాగడ్ ఏరియా తాడిగాం రేంజి జోనావాయి గ్రామస్థుడు ఎర్రం ఆత్రంను గెరిల్లాలు సంతలో గొడ్డలితో నరికి చంపారు. వీడి పక్కనే ఉన్న మరో ఇన్ఫార్మర్ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పోలీసు క్యాంపు వైపు పారిపోయాడు. గెరిల్లాలు నినాదాలు ఇచ్చుకుంటూ అడవిదారిలో తప్పుకున్నారు. తర్వాత పోలసులు వచ్చి సంతనంతా చుట్టుముట్టి నానా హంగామా చేశారు. ఈ ఎర్రం ఆత్రం 1998లో మడాం గ్రామంలో దళంపై కాల్పులు జరిపించినప్పటి నుండి పోలీసు క్యాంపులోనే ఉంటున్నాడు. సంగ సభ్యుల వివరాలు సేకరిస్తూ ప్రజలను బెదిరిస్తూ పోలీసులతో బాటు ఊరూరా తిరుగుతూండే వాడు. ప్రజలను బెదిరించి కోళ్లు, సారా వసూలు చేసేవాడు. వీడి నేరాలన్నింటినీ పరిశీలించిన పార్టీ వీడిని ఖతం చేయాలని నిర్ణయించింది.

## ప్రజావ్యతిరేకి రాజు ఊసండి పిజిఏ చేతిలో ఖతం

రాజు ఊసండి గడ్‌చిరోలి డివిజన్ ఏటపల్లి ఎల్‌జియస్ ఏరియా కసంసూర్ రేంజిలోని డివిండీ గ్రామానికి చెందిన పెత్తందారు. జారవండి పట్టిలోని 25 గ్రామాలకు పంచాయితీలు పరిష్కరించే పోలీసు పటేల్. 1991-92లో పంచాయతీ సభ్యుడిగా ఉన్న వీడు తన గ్రామం నుండి మొదలుకొని పట్టీ అంతటా ప్రజల మధ్య తగవులు సృష్టించి గిట్టని పక్షం వారిని సంవత్సరాల తరబడి సమాజ బహిష్కరణ చేసేవాడు. దండుగలు కిందికి కోళ్లు మేకలు పందులు డబ్బులు తిని ఆ పట్టీ ప్రజలను పిలిచి కుల బహిష్కరణ తొలగించేవాడు. ఇలా సర్కెడా, డివిండి, బాపడ గ్రామాల్లో ప్రజలను రెండు ముఠాలుగా చీలదీసాడు. అలాగే సర్కార్ నుండి మంజూరైన బావుల కాంట్రాక్టు తీసుకొని బావి తోడిన కూలీలకు డబ్బులు ఎగ్గొట్టాడు.

ఈ ప్రాంతంలో విప్లవ కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుండీ వీడు చాటుమాటుగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండే వాడు. గ్రామంలో సంగం నాయకత్వంలో ప్రజలు పోరాడి కూలీరేట్లు పెంచుకుంటే వీడు ప్రజలను భయపెట్టి మళ్లీ రేట్లు తగ్గించేవాడు. వీడిని తన్నాలని కూడా ఓసారి నిర్ణయమైంది. అయితే వీడు దళం పైకి తన తొత్తులను కొందరిని ఉసికొల్పి కాల్పులు జరిపించాడు. ఆ తర్వాత గెరిల్లాలు వీడిని ఓసారి తన్ని బుద్ధి చెపారు. అయినప్పటికీ రాజుకు

బుద్ధి రాలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడం కొనసాగించాడు. ఓసారి వీడిచ్చిన సమాచారంతో పోలీసులు దళంపై దాడికి వచ్చారు. అయితే అప్పటికే దళం వేరే మార్గం గుండా వెళ్ళిపోవడంతో ఎన్‌కౌంటర్ తప్పింది. జారవండి ప్రాంతంలో వీడి అరాచకాలు హద్దు మీరిపోయాయి. దానితో స్థానిక ప్రజలూ, పార్టీ కలిసి వీడిని ఖతం చేయాలని నిశ్చయించుకున్నారు. పిజిఏ దళం ఏప్రిల్ 16, 2003న వీడిని మట్టుబెట్టింది.

## గోపనీయ సైనికుడిగా మారిన మాజీ దళసభ్యుడు కమ్లూకు మరణశిక్ష

మాడ్ డివిజన్‌లో కోహ్కమెట్ట ఏరియాలోని అత్లనార్ గ్రామానికి చెందిన కమ్లూ అనే యువకుడు నాలుగేళ్ల క్రితం దళంలో భర్తీ అయ్యాడు. కొన్ని నెలల పాటు దళంలో పని చేసి ఆ తర్వాత తన బలహీనతల కారణంగా వెనక్కి పోయాడు. ఆ తర్వాత పోలీసులు వీడితో సంబంధం పెట్టుకొని తమవైపు తిప్పుకున్నారు. వీడు గోపనీయ సైనిక్‌గా మారిపోయి చుట్టుపక్కల గ్రామాలలోని జులాయి యువకులను పోగుచేశాడు. వీరంతా ఇన్‌ఫార్మర్లుగా పనిచేయసాగారు. పోలీసులు కమ్లూకు ట్రెయినింగ్ కూడా ఇచ్చారు. వీడు చుట్టుపక్కల గ్రామాలలో ఏదో ఒక వంకతో తిరుగుతూ ఉద్యమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం సేకరిస్తూ ఉండేవాడు. అయితే ప్రజలు వీడి ప్రజా వ్యతిరేక గూఢచర్య కార్యకలాపాలను పసిగట్టారు. ప్రజల సమాచారంతో గెరిల్లా దళం వీడిని అరెస్టు చేసింది. ఐదు రోజుల పాటు దళం వీడిని తన కస్టడీలో ఉంచుకొని వీడి కార్యకలాపాల గురించి వివరంగా ప్రశ్నించి ఆ తర్వాత మట్టుబెట్టింది.

## పోలీసులకు సహకరిస్తున్న కార్కా గ్రామ పటేల్‌కు హెచ్చరిక

గడ్చిరోలి డివిజన్‌లో ఏటపల్లి ఏరియాలో కసంసూర్ రేంజ్‌లో గల కార్కా గ్రామ పటేల్ ఆ ప్రాంతంలోనే పెద్ద పూజారి. ఈ ప్రాంతంలో పోలీసు నిర్బంధం తీవ్రతరమై ప్రజాసంగాల కార్యకలాపాలు పరిమితం కాగానే వీడు పోలీసులకు సహకరించసాగాడు. వీడు చాలా మంది ప్రజాసంగాల కార్యకర్తల నుండి డబ్బులు వసూలు చేశాడు. అంతేకాకుండా పోలీసు గూఢచారులను వీడు తన వెంబడి గ్రామాలలో తిప్పాడు. ఓసారి దళం ఎదురై ఎవరు వాళ్లని వీడిని ప్రశ్నించగా మేకలు కొనడానికి వచ్చిన వ్యాపారులని చెప్పి దళాన్ని పక్కదారి పట్టించాలని ప్రయత్నించాడు. దళం వారెవరో తేల్చుకునే లోగానే అవకాశం దొరకడంతో గూఢచారులు పారిపోయారు. ఆ తర్వాత వీడు ప్రజా పంచాయితీలో తన తప్పును అంగీకరించాడు. కానీ వీడు మారలేదు. పోలీసుల నుండి రహస్యంగా డబ్బు తీసుకొని దళం సమాచారం చెప్పడానికి అంగీకరించాడు. ఓసారి వీడిచ్చిన సమాచారంతో పోలీసులు కార్కాకు దగ్గర గల అడవుల్లో గెరిల్లాల మకాంపై దాడి చేశారు. అయితే గెరిల్లాలకు కొన్ని సామాన్లు పోవడం తప్ప మరే నష్టం జరుగలేదు. ఆ తర్వాత వీడు తన గ్రామంలో ఐదుగురు సంగ సభ్యులను అరెస్టు చేయించాడు. ఆ తర్వాత ప్రజలు వీడిపై పంచాయితీ జరిపారు. ప్రజా పంచాయితీ వీడికి 12 వేల రూపాయల జుర్మానా విధించి చివరిసారి హెచ్చరిక చేసి వదిలిపెట్టింది.

## ఈతకల్లు వ్యాపారులకు బహిష్కరణ

ఆంధ్ర నుండి ఆదివాసీ ప్రాంతాలకు ఈతకల్లు వ్యాపారులు వలస రావటం పెరిగింది. గడ్చిరోలి డివిజన్‌లో గట్ట ప్రాంతంలో ఇంతకు ముందు ఒక్కరో ఇద్దరో వచ్చేవాళ్లు. ఈ సంవత్సరం 25 మంది దిగారు. పెద్ద గ్రామాలనూ, వారం వారం కోళ్ల సంతలు జరిగే గ్రామాలనూ కేంద్రంగా చేసుకున్నారు. వీరంతా ప్రధానంగా నల్గొండ జిల్లాకు చెందినవారు. ఈత చెట్టు యజమానికి 110 రూపాయలు చెల్లిస్తారు. చెట్టు నుండి తీసే కల్లులో సగం నీళ్లు కలిపి అమ్ముతారు. మత్తుకోసం, ఆకర్షణ కోసం 'గుల్చన్' పౌడర్ కూడా కలుపుతారు. గట్ట కేంద్రంగా చేసుకున్న కల్లు వ్యాపారులు తమ వ్యాపారం సజావుగా సాగటం కోసం పోలీసు దరోగాకు 10 వేల రూపాయలు లంచం కూడా ఇచ్చారు

ఒకవైపు కల్లు అంటే ప్రీతి, మరోవైపు కరువు. మనిషి బలహీనత కారణంగా కరువును పక్కకు నెట్టేసింది కల్లు. కల్లు నిషా కరువు గురించి ఆలోచించనీయదు. కల్లు భట్టీల వద్ద ఎప్పటికీ ఎడతెగని రద్దీ. ఇంట్లోని డబ్బు, ధాన్యం, బియ్యం – ఇవేవీ దొరక్కపోతే అప్పు. అది కూడా దొరక్కపోతే చిల్లర దొంగతనాలు చేసే వరకూ వెళ్లింది. ఇంటి నుండి ఉదయం పోయిన వాళ్లు అర్ధరాత్రయినా తిరిగి రారు. ఇంటికి వద్దామని బయలుదేరినా వాంతులు చేసుకుంటూ తోవలోనే స్పృహ తప్పి పడిపోవటం తప్పదు. ఇంటికి వచ్చాక కుటుంబంలో తగాదాలు, భార్యలని కొట్టడం మొదలయింది. ఈ సమస్యను చర్చించిన ప్రజాసంఘాలు కల్లు బంద్ పెట్టాలని పోస్టర్ల ద్వారా ప్రచారం చేసాయి. కల్లు వ్యాపారులకు అర్థం చేయించాయి. వినని వారిని హెచ్చరించాయి. మొండికేసిన వారిలో కొందరిని దేహశుద్ధి కూడా చేశాయి. కల్లు వలన జరిగే ఆర్థిక నష్టం గురించి, అది శరీరానికి కలిగించే హాని గురించి, ప్రతి వస్తువునీ డబ్బుతో కొలిచే వ్యాపార సంస్కృతి గురించి, ఉన్న దాంట్లో పంచుకు తినే సమిష్టి భావనను విచ్ఛిన్నం చేసే సామ్రాజ్యవాద సంస్కృతి గురించి సంఘాల సభ్యులకూ, ప్రజలకూ మీటింగులు, క్లాసుల సందర్భంగా స్థానిక గెరిల్లా దళాలు అర్థం చేయించాయి.

ఇదంతా గట్ట ఎల్‌జిఎస్ ఏరియాలో జరిగింది. వ్యాపారులు గట్ట, ఏటపల్లి దళ ఏరియాలతో పాటు ఛత్తీస్‌గఢ్ గ్రామాలలో కూడా ఇలాంటి అడ్డాలు వేశారు. కొన్నిచోట్ల దళం అర్థం చేయించి పంపించింది. కొన్నిచోట్ల 3, 4 గ్రామాల ప్రజలను పిలిపించి వారి ద్వారా వ్యాపారస్థులపై వత్తిడి తీసుకొచ్చారు. ఇలా అన్నివైపుల నుండి వత్తిడి తేవటంతో 'చెట్లకు డబ్బు కట్టాం కనుక సీజన్ అయ్యేవరకూ ఉంటాం' అంటూ మొండికేసిన వ్యాపారస్థులు చివరకి తలవంచారు. ఈ నిర్ణయాన్ని స్త్రీలు మనస్ఫూర్తిగా ఆహ్వానించారు.

### పాఠకులకు విజ్ఞప్తి

- 'ప్రభాత్'కు చందాలు పంపించడంలో శ్రద్ధ చూపండి. పత్రిక తన కాళ్లపై తాను నిలబడగలిగేలా సహకరించండి.
- చాలా రిపోర్టులలో ఘటన/కార్యక్రమం జరిగిన తేదీ, స్థలం, వంటి వివరాలు సరిగా ఉండడం లేదు - గమనించండి.
- 'ప్రభాత్'లో 'పాఠకుల మాట' శీర్షికతో మీ ఉత్తరాలు వేస్తున్నాం. పత్రికపై మీ అభిప్రాయాలు నిర్మొహమాటంగా తెలియజేసి పత్రిక అభివృద్ధికి తోడ్పడండి.

– సంపాదకవర్గం

*(..... చివరి పేజీ తరువాయి)*

**ప్రియమైన ప్రజలారా! యువతీ యువకులారా!**

పిజిఏలో పెద్దెత్తున చేరండి. ఈ ప్రాంతంలో పెంపొందుతున్న విప్లవోద్యమంలో చేరి మీ పోరాటశక్తిని ప్రదర్శించండి. దోపిడీ వ్యవస్థను అంతమొందించడంలో మీ ఘనమైన పాత్రను స్వీకరించండి. ప్రజాయుద్ధానికి తగిన విధంగా రాజకీయంగా ఎదుగుతూ, సైనిక శిక్షణను గడిస్తూ నేర్పు సాధించి శత్రు ఎత్తుగడలకు ధీటైన ప్రతి ఎత్తుగడలను రచించండి. వాడి వ్యవస్థను ధ్వంసం చేయండి. దీనిపైనే మన కేంద్రీకరణంతా ఉండాలి.

విప్లవోద్యమ ప్రాంతంలో ప్రజల ప్రతి కదలికను నియంత్రించాలని శత్రు మూకలు దూకుడుగా వస్తున్నాయి. రాజకీయ సమస్యలపై, దైనందిన సమస్యలపై, పెచ్చరిల్లుతున్న శత్రు నిర్బంధంపై, తమ పోరుబిడ్డల అమరత్వాన్ని ఎత్తిపడుతూ, అనేకానేక సమస్యలపై పీడిత ప్రజలు వీధుల్లోకి వస్తుంటే శత్రువు బందూకులు ఎక్కుపెడుతున్నాడు. తుపాకులతో ప్రజా ఉద్యమాలను అణచలేరనీ, పెంచుకున్న బలాలతో, బందూకులతో ప్రజాయుద్ధాన్ని నిర్మూలించలేరనీ మన పిజిఏ నిరూపించాలి. గత ఏడాది కాలంలో పశ్చిమ, ఉత్తర, దక్షిణ బస్తర్ డివిజన్లలో, మాడ్, గడ్‌చిరోలి డివిజన్లలో వందలాది మంది ప్రజలు పోలీసు మూకలనెదిరిస్తూ తమ ప్రతిఘటనా శక్తిని నిరూపించారు. ముఖ్యంగా వేలాది మహిళలు ధైర్యంగా పోలీసు నిర్బంధాన్ని ఎదిరిస్తూ అన్ని డివిజన్‌లలో ఆదర్శమై నిలిచారు. వీరందరికీ విప్లవ జేజేలు తెలుపుతున్నాం. మన పిజిఏ అండతో మీరు మీ ప్రతిఘటనా శక్తిని మరింత పెంచుకోవాలి. మన పిజిఏ ప్రజలకు అన్ని విధాలా రక్షణ కల్పిస్తూ, వారిని సాయుధం చేస్తూ, నాయకత్వం వహిస్తూ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలి. ప్రజాయుద్ధం అజేయమైనదన్న చారిత్రక సత్యాన్ని మరోసారి నిరూపించాలి.

*విప్లవాభివందనాలతో,*

రాష్ట్ర సైనిక కమిషన్ (ఎస్ఎంసి)

*తేది : 09/09/'03* దండకారణ్యం

*(మావో వర్ధంతి)* సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]

# ఆగస్టు 15 బూటకపు స్వాతంత్ర్యానికి నిరసనగా '**కాలా దివస్**'

మాడ్ డివిజన్ కోహ్కామెట్ట ఎల్‌జిఎస్ పరిధిలోని ఏ గ్రామంలోనూ ఆగస్టు 15 నాడు మూడు రంగుల జెండానెగురవేయలేదు. దాదాపు అన్ని గ్రామాలలో ప్రజలు నల్లజెండాలు ఎత్తి బూటకపు స్వాతంత్ర్యానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కోహ్కామెట్ట గ్రామంలో ప్రధాన కార్యక్రమం జరిగింది. ఈ సభకు 10 గ్రామాల నుండి 800 మంది స్త్రీపురుషులు హాజరయ్యారు. గ్రామ ప్రజాసంగ నాయకుడు నల్లజెండా ఎత్తి సభను ప్రారంభించాడు. ఈ సభలో స్థానిక గెరిల్లా దళం సభ్యులు కూడా పాల్గొన్నారు. దళం తరపున ఒక కామ్రేడ్ ప్రజలనుద్దేశించి మాట్లాడాడు. ఆయన తన ప్రసంగంలో ఆగస్టు 15 స్వాతంత్ర్యం అంటే అధికార మార్పిడే తప్ప మరేమీ కాదని వివరించాడు. దోపిడీపీడనలలో ఈ 'స్వాతంత్ర్యం'తో మార్పేమీ రాలేదని ఆయన చెప్పాడు. దోపిడీపీడనల నుండి విముక్తి కలిగించేదే నిజమైన స్వాతంత్ర్యమని ఆయన చెప్పాడు. అసలైన స్వాతంత్ర్యాన్ని సాధించడానికి సాగుతున్న పోరాటంలో భాగస్వాములు కావాలని ఆయన అక్కడ హాజరైన ప్రజలందరినీ కోరాడు. ఈ సభలో సిఎన్ఎం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి.

దక్షిణ బస్తర్ డివిజన్‌లో కూడా బూటకపు స్వాతంత్ర్యానికి నిరసనగా 'కాలా దివస్' జరుపుకున్నట్టుగా వార్తలు వచ్చాయి. బూర్జువా పత్రికల్లో వచ్చిన ప్రకారం గోర్కు, కొత్తవేరు, ఎర్రబోరు, హర్న, మెహల, చింతగుప్ప, ముకటలోగ్, మరాయిగూడెం, జగదపల్లి మొదలైన గ్రామాలన్నింటిలోనూ ప్రజలు నల్లజెండాలు ఎగరేసి తమ నిరసనను ప్రకటించారు. అనేక గ్రామాల్లో ఈ సందర్భంగా ప్రజాసంగాలు సభలూ, సమావేశాలూ నిర్వహించాయి. ✪

## పాఠకుల మాట

"నేపాల్ పోరాటానికి సంబంధించిన రిపోర్టు, సామ్రాజ్యవాద ప్రపంచీకరణనూ, హిందూ ఫాసిజాన్నీ ఓడించాలని కేంద్రకమిటీ ఇచ్చిన పిలుపూ మొదలైనవి చదివాను. చాలా ఉపయోగకరంగా ఉన్నాయి. మార్చ్ 8 సందేశం మహిళలపై సాగుతున్న రాజకీయ హింసనూ, హిందూ ఫాసిస్టుల దాడులనూ అర్థం చేసుకోవడానికి ఉపయోగపడింది. సిఆర్‌పి బలగాల నిర్బంధకాండ గురించి ఎస్‌జెడ్‌సి కార్యదర్శి ప్రకటనను వేయడం బాగుంది. 'ప్రభాత్'ను దండకారణ్య పోరాటాలను అర్థం చేసుకునే సాధనంగా చెప్పుకోవచ్చు. దండకారణ్య పాఠకులను దృష్టిలో ఉంచుకొని సరళమైన హిందీని రాయాల్సిన అవసరం ఉంది. పుస్తక హిందీకన్నా వాడుక హిందీని రాస్తే బాగుంటుంది"

***- జూరి, మాస్ యూనిట్ (దక్షిణ సబ్-జోన్) నుండి ...***

"అక్టోబర్-డిసెంబర్ 2002 సంచికలో 'పాఠకుల ఉత్తరాల' శీర్షికను ప్రారంభిస్తున్నామన్న ప్రకటన చూశాను. కృతజ్ఞతలు. నిజంగా 'పత్రిక ఒక ఆర్గనైజరే.' 'భూంకాల్'పై వ్యాసాల సిరీస్ నిలిచిపోయింది. నా లాంటి పాఠకులకు ఇక్కడి పోరాటాల గురించి తెల్సుకోవడం చాలా అవసరం. 'టూరిజం పరిశ్రమ'పై వ్యాసం బాగుంది. మార్చ్ 8కి ముందుగా ఈ వ్యాసం మాకందడంతో దీనిపై అవగాహనను ఏర్పర్చుకోవడానికి ఉపయోగపడింది. వివిధ సందర్భాలలో ఇలాంటి వ్యాసాలు ప్రచురిస్తే మాకు మా ప్రాంతాలలో ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించడంలో సహాయకరంగా ఉంటుంది. తెలుగు, హిందీ రెండు భాషల్లోనూ 'ప్రభాత్' రావడం సంతోషంగా ఉంది."

***- జయ, దక్షిణ బస్తర్ నుండి ...***

పిజిఏ సందేశం

# పిజిఏలోకి విస్తృతంగా భర్తీ చేసుకుంటూ బలోపేతం చేయండి !

## గెరిల్లా యుద్ధాన్ని తీవ్రంగా, విస్తృతంగా కొనసాగించండి !

## శత్రు ఆయుధాలే మన ఆయుధాలు !

**ప్రియమైన పిజిఏ యోధుల్లారా, కమాండర్లారా!**

కొద్ది రోజుల్లో మనం పిజిఏ స్థాపనా వారం జరుపుకోబోతున్నాం. ఇకపై మనం పిజిఏ స్థాపనా వారాన్ని **26 నవంబర్ నుండి 2 డిసెంబర్ వరకు** పాటిద్దాం. గడచిన పిజిఏ వారం సందర్భంగా మన మూడు రకాల బలగాలు అద్భుతమైన చొరవను ప్రదర్శించి అనేక దాడులు చేసి శత్రువుకు కునుకు బట్టకుండా చేశాయి. పిజిఏ వారం, అమరుల వారం (జులై 28) వచ్చిందంటేనే శత్రువు హడలి చస్తున్నాడు. సుదూర ప్రాంతాలలో కూడా రక్షణ చర్యలు చేపడుతున్నాడు. ప్రజా గెరిల్లా సైన్యమన్నా, ప్రజలన్నా శత్రువు హడలి చావడం సహజమే.

ఇంకా ఇంకా మీ చొరవ, సమయస్ఫూర్తి, దృఢ సంకల్పం పెరిగి తీరుతుందనీ దృఢంగా ఆకాంక్షిస్తూ 4వ స్థాపనా దినం సందర్భంగా మీ అందరికీ విప్లవాభివందనాలు తెలియజేస్తున్నాం. శత్రువుతో గొప్ప ధైర్య సాహసాలతో పోరాడుతూ ఈ మధ్య కాలంలో నేలకొరిగిన పిజిఏ యోధులకు, కమాండర్లకు ఈ సందర్భంగా వినమ్రంగా తలవంచి విప్లవాంజలి ఘటిస్తున్నాం.

ఈ సంవత్సరం తొలి నెలల్లో పిజిఏ పునాది బలగాలు తమ సంప్రదాయక ఆయుధాలతో జరిపిన సాహసిక దాడులతో శత్రువు ఖంగు తిన్నాడు. దాడులలో నేలకూలిన పోలీసు మూకల నుండి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంలో ఈ కామ్రేడ్స్ ప్రదర్శించిన చొరవ కొనియాడదగినది. అలాంటి దాడులు, ఆయుధాల స్వాధీనాలు మన లక్ష్యిత బేస్ ఏరియా వ్యాప్తంగానూ ముమ్మరం చేయండి. విస్తరింపచేయండి. అయితే పొట్టకూటి కోసం పోలీసు నౌకరి చేస్తూ ప్రజా శత్రువుల జాబితాలోకెక్కని వారిని తమ దైనందిన అవసరాల కోసం సివిల్‌లో సంచరించేవాళ్లను విడిచిపెట్టండి. పామేడు ప్రాంతంలో మీరు పోలీసులతో వ్యవహరించిన తీరు పేద వర్గాల పోలీసులను బాగా ఆలోచింపజేసింది. మునుముందు కూడా పోలీసులతో మనం వర్గ దృక్పథంతోనే వ్యవహరించాలి.

గత ఫిబ్రవరిలో జరిగిన మురుదొండ ఘటన విచారకరం. ఇలాంటి ఘటనలు మరోసారి జరగనివ్వకూడదు. గడ్‌చిరోలిలో ఆగస్టు 29న క్రూరమైన ఐదుగురు కమెండోలు మన పిజిఏ చేతిలో మట్టిగరవడంతో ప్రజలు ఎంతో సంతోషిస్తున్నారు. కిస్‌కొడ్డో, తాకిలోడ్, పిడియకోట్ దాడులు శత్రువు దూకుడును అరికట్టడంలో తోడ్పడినాయి. ఈ సంవత్సర కాలంలో తక్కువ దాడుల్లోనే మనం శత్రువును దెబ్బతీయగలిగినప్పటికీ సంఖ్యాపరంగా దాడులు పెరిగాయి. మనం చేసే ప్రతి దాడిలో శత్రువును మట్టుబెట్టేలా, వాడి ఆయుధాలను తప్పనిసరి స్వాధీనం చేసుకునేలా మలచుకుందాం. దీనిపై మనం కేంద్రీకరించి కృషిచేద్దాం.

శత్రువు ఇప్పుడున్న బలగాలు మన ఉద్యమాన్ని అణచడానికి సరిపోవడం లేదని కేంద్రం నుండి అర్ధ సైనిక బలగాలను సైతం పిలిపించాడు. ఇంకా బలగాలను పెంచుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. మన ఉద్యమాన్ని మట్టుబెట్టాలని కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఉత్తర తెలంగాణా, ఏఓబి, దండకారణ్య ప్రజలలో పెంపొందుతున్న విప్లవ చైతన్యాన్నీ, ప్రజలు సంయుక్తంగా చేపడుతున్న పోరాటాలనూ ఈ ప్రాంతంలో బలోపేతమవుతున్న మన పిజిఏను అణచి వెయ్యాలనీ, ఈ విశాల అటవీ ప్రాంతంలో విప్లవోద్యమాన్ని పెంపొందనీయకూడదనీ వాడు దీర్ఘకాల, తక్షణ పథకాలతో ముందుకొస్తున్నాడు. వాడి దాడులను ప్రతిఘటిస్తూ, ఓడిస్తూ మన లక్ష్యాలను పూర్తి చేయడంలో మన పిజిఏ పార్టీ చేతిలో, ప్రజల చేతిలో గొప్ప ఆయుధం కావాలి. ప్రజల్లో విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలి. వాడు ఎన్ని బలగాలను తెచ్చుకున్నా దినదినం పెంపొందుతున్న మన బలగాలు, ప్రజలు శత్రువును ఓడించి తీరుతారని మనం ప్రజాయుద్ధం ద్వారా నిరూపిద్దాం.

గ్రామీణ ప్రాంతంలో 'జనతన సర్కార్' ఏర్పడుతోంది. బీజప్రాయంలో ప్రజలు ప్రజాస్వామ్య పాలనను అనుభవిస్తున్నారు. పాత తెగ పెద్దల, భూస్వాముల, పెత్తందార్ల వ్యవస్థను ధ్వంసం చేస్తున్నారు. ప్రజా సభలు జరిగి, జనతన సర్కార్‌లు ఎన్నికవుతున్నాయి. పునాది బలగాలు వీటి రక్షణ బాధ్యతను చేపట్టాయి. దండకారణ్యంలో ఏర్పడుతున్న ప్రత్యామ్నాయ ప్రజా ప్రభుత్వ వ్యవస్థను మొగ్గలోనే నాశనం చేయాలని శత్రువు బహుముఖ దాడిని తీవ్రం చేస్తున్నాడు. శత్రు దాడులను ప్రతిఘటిస్తూ, ఓడిస్తూ 'జనతన సర్కార్'ను నిలపాల్సిన బాధ్యత మన పిజిఏ మీదనే ఉంది. ఈ రెండు వైరి వ్యవస్థల మధ్య రాజకీయ అధికారం కోసం తీవ్రతరమవుతున్న యుద్ధంలో గెలుపు సాధించడంలో మన పిజిఏ కీలకమైన పాత్ర పోషించాల్సి ఉంది.

*(తరువాయి వెనుక పేజీలో .....)*